RNI.No.TELTEL/2013/52694

Estd.: 2000

www.voodayam.com /voodayam /Voodayam

### ఆడపిల్లలకు ఆత్మరక్షణ విద్య ఆవశ్యకం

చొప్పదండి, డిసెంబర్ 11(ఎ.ఎం.ఎస్): ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కరాటే శిక్షణా తరగతులను రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపుదల, ఆపద సమాయాలలో తమను తాము కాపాడుకోవడానికి ప్రస్తుత రోజుల్లో కరాటే నేర్చుకోవడం సాధారణమైన విషయమని కరాటే ఇన్‌స్ట్రక్టర్ తెలిపారు. బాలికలకు ప్రత్యేక కరాటే శిక్షణ తరగతులు కొనసాగడం పట్ల తల్లిదండ్రులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# వుదయం

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal

### పోడు భూములకు పట్టాలివ్వాలి

వైరా, డిసెంబర్ 11(ఎ.ఎం.ఎస్): వేంసూరు మండలం ఎర్రగుంటపాడు రెవెన్యూ పరిధిలో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. కల్లూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఎర్రగుంటపాడు 756 సర్వే నెంబర్ ను సర్వే చేసి పేదలకు పంపిణీ చేయాలని, అమ్మపాలెంలో పేదల భూములను కొందరు ఆక్రమించారని, ఆ భూములను సర్వే చేసి పేదలకు ఇవ్వాలన్నారు.

సంపుటి : 12 || సంచిక : 184 || ఆదిలాబాద్ || గురువారం, డిసెంబర్ 12, 2024 || VOODAYAM Telugu Daily || వెల : రూ. 3.00 || పేజీలు : 12

# యూపీఎస్సీ మెయిన్స్ విజేతలకు సీఎం రేవంత్ అభినందనలు




హైదరాబాద్ : యూపీఎస్సీ మెయిన్స్ 2024 ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటారు. ఈ ఏడాది తొలి సారిగా రాష్ట్రం నుంచి సివిల్స్ మెయిన్స్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. సివిల్స్? సాధించే లక్ష్యంతో ప్రిపేరయ్యే పేద కుటుంబీకులకు అండగా నిలిచేందుకు రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని ఈ ఏడాది తొలిసారిగా అమలు చేసింది. సింగరేణి సంస్థ అధ్వర్యంలో 135 మందికి రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించింది. ఈ ఏడాది ఆగస్ట్ 26న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వీరికి చెక్కులు పంపిణీ చేశారు. రాజీవ్ సివిల్స్ అభయ హస్తం సాయం అందుకున్న అభ్యర్థుల్లో 20 మంది తాజాగా యూపీఎస్సీ మెయిన్స్? ఫలితాల్లోనూ విజేతలుగా నిలిచారు. వరంగల్ అర్బన్ జిల్లాకు చెందిన ఈ. సాయి శివాని, రాహుల్ శంకేషి, పోతరాజు హరి ప్రసాద్, విక్రమ్ బేతి, ఖమ్మం జిల్లాకు చెందిన నల్లమల సాయికుమార్ , బానోతు నాగ రాజా నాయక్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన కడారి శ్రీవాణి, గాదె శ్వేత, రాపర్తి ప్రీతి, మెదక్ జిల్లాకు చెందిన కుమ్మరి శ్రవణ్ కుమార్, రంగారెడ్డి జిల్లాకు చెందిన మొహమ్మద్ అశ్ఫాక్, తొగరు సూర్యతేజ, మహబూబాబాద్ జిల్లాకు చెందిన బెస్త ప్రియాంజలి, సిద్ధిపేటకు చెందిన నరిగె స్వామి, నాగర్‌కర్నూలుకు చెందిన గోకమల్ల అంజనేయులు, ఆదిలాబాద్‌కు చెందిన ఆర్. ప్రమోద్ కుమార్, వికారాబాద్‌కు చెందిన బి. ప్రహ్లాద్, జగిత్యాలకు చెందిన బురుగుపెల్లి నీరజ్ కుమార్, భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన జస్వంత్ కుమార్, అసిఫాబాద్-కుమ్రంభీం జిల్లాకు చెందిన రామ్టెంకి సుధాకర్ మెయిన్స్? క్వాలిఫై అయిన జాబితాలో ఉన్నారు. రాష్ట్రం నుంచి మెయిన్స్ ఫలితాల్లో విజయం సాధించిన అభ్యర్థులందరికీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.



## వరంగల్ నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలి
- నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలి

**వరంగల్ నగర అభివృద్ధిపై అధికారులతో సమీక్షించిన రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మరియు వరంగల్ జిల్లా ఇన్-ఛార్జ్ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

హైదరాబాద్ :- వరంగల్ నగర అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మరియు వరంగల్ జిల్లా ఇన్-ఛార్జ్ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇటీవల గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు వరంగల్ జిల్లా పర్యటనలో అక్కడి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అనేక హామీలు ఇచ్చారని, ఈ నేపధ్యంలో ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని వరంగల్ నగర అభివృద్ధి పనులను యుద్ధ ప్రతిపాదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

వరంగల్ నగర అభివృద్ధిపై బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో వరంగల్ జిల్లా మంత్రులు శ్రీమతి కొండా సురేఖ, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డిలతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా వరంగల్ నగర అభివృద్ధి, ఐఆర్ఆర్, ఓఆర్ఆర్ , భద్రకాళి చెరువు, విమానాశ్రయం తదితర అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి గారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రతి ప్రాజెక్టు కు సంబంధించిన డీపీఆర్ లను త్వరితగతిన తయారు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వరంగల్ నగరంలో నిర్మించే రింగ్ రోడ్డు జాతీయ రహదారులకు కనెక్టివిటీ ఉండేలా చూడాలని,

ఈ ప్రాజెక్టుకు భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణను యుద్ధప్రాతిపదికన భద్రకాళి చెరువు శుద్ధీకరణపనులను వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రాధాన్యత క్రమంలో పనులను చేపట్టి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీ దాన కిశోర్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ శ్రీదేవి, మైనింగ్ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వరంగల్, హన్మకొండ జిల్లాల కలెక్టర్ లు డాక్టర్ సత్య శారదా, పి. ప్రావీణ్య, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు

## బీసీలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు

### ఎంబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏమైంది ?

### వడ్డెర సంఘం నాయకుల సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



హైదరాబాద్ : ప్రతి రోజు రాష్ట్రంలో ఏదో ఒక చోట ఫుడ్ పాయిజన్ తో విద్యార్థులు ఆసుపత్రల పాలవ్వడంతో, సంక్షేమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల్లో వారి పిల్లల క్షేమం పట్ల భయాందోళన నెలకొందిపిల్లలకు నాణ్యమైన ఆహారం అందించకపోవడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనంసారంగాపూర్ కస్తూర్బా పాఠశాల ఘటనపై ఆవేదన వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ కవితహైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తేల్చిచెప్పారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ తో పాటు ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చిన ఇతర హామీలను అమలను త్వరగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఎంబీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సూచించారు.తెలంగాణ వడ్డెర సంఘం నాయకులు బుధవారం నాడు ఎమ్మెల్సీ కవితను తన నివాసంలో కలిశారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంపుపై బీసీ డెడికేటెడ్ కమిషన్ కు తెలంగాణ జాగృతి సంస్థ తరఫున నివేదిక సమర్పించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి ఏడాది గడిచినా ఎంబీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు, ప్రతి జిల్లా కేంద్రంలో రూ. 50 కోట్లతో బీసీ ఐక్యత భవనాలను నిర్మిస్తామని ఇచ్చిన హామీల అమలు కనీస చర్య తీసుకోలేదని ఎండగట్టారు.స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, దాన్ని అమలు చేయడంలో తాత్సారం చేయవద్దని సూచించారు. కులవృత్తుల వారికి ఈ ప్రభుత్వం కనీస మద్ధతునివ్వడం లేదని విమర్శించారు.సారంగాపూర్ కస్తూర్బా పాఠశాల ఘటనపై ఆవేదన వ్యక్తం చేసిన ఎమ్మెల్సీజగిత్యాల జిల్లా సారంగాపూర్ కస్తూర్బా బాలికల పాఠశాలలో ఆరుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారనే వార్త ఆందోళన కలిగించిందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల కవిత తెలిపారు. ప్రతి రోజు రాష్ట్రంలో ఏదో ఒక చోట ఫుడ్ పాయిజన్ తో విద్యార్థులు ఆసుపత్రల పాలవ్వడంతో, సంక్షేమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల్లో వారి పిల్లల క్షేమం పట్ల భయాందోళన నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.కనీసం పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించకపోవడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనంగా మారిందని విమర్శించారు.విద్యా శాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, ఏడాది కాలంలో ఒక్కసారి కూడా సంక్షేమ పాఠశాలలకు వెళ్లి అక్కడి పరిస్థితులను, విద్యార్థుల సమస్యలను తెలుసుకోలేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే సంక్షేమ పాఠశాలలను సందర్శించాలి. వాటి పరిస్థితులపై సమీక్ష చేసి ఇలాంటి పరిస్థితుల్లో పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

### కోడంగల్ లో పశు వైద్య కళాశాల భవన నిర్మాణానికి ఒప్పందం

హైదరాబాద్, డిసెంబర్ 11:: పీ.వీ. నరసింహరావు పశు వైద్య విశ్వవిద్యాలయ పరిధిలో కోడంగల్ లో కొత్తగా ఏర్పాటవుతున్న పశు వైద్య కళాశాల భవనాల నిర్మాణానికి విశ్వవిద్యాలయం మరియు రోడ్లు భవనాల శాఖ మధ్య ఒప్పందం బుధవారం నాడు బీ ఆర్ అంబేద్కర్ తెలంగాణా సచివాలయంలో పశువైద్య శాఖా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కార్యాలయంలో కుదిరింది. ఈ కొత్త పశు వైద్య కళాశాల ప్రాంగణంలో ప్రధాన భవనం, పశు వైద్యశాల, బాలికల మరియు బాలుర వసతి గృహం మరియు ఇతర భవనాలు నిర్మించబడనున్నాయి. మొత్తం 38 ఎకరాల విస్తీర్ణంలో, సుమారు 171 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఈ భవనాలు నిర్మించబడతాయని పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మరియు విశ్వవిద్యాలయ ఉప కులపతి శ్రీ. సబ్యసాచి ఘోష్ తెలియజేశారు. ఈ పశు వైద్య కళాశాల ఏర్పాటు ద్వారా కోడంగల్ ప్రాంతంలో పశుగణాభివృద్ధి జరిగి, రైతుల ఆర్థిక అభివృద్ధికి మరియు ప్రాంతీయ అభివృద్ధికి సహకరించనున్నదని శ్రీ. సబ్యసాచి ఘోష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్. శరత్ చంద్ర, ఎస్టేట్ ఆఫీసర్ ప్రొఫెసర్. చిన్ని ప్రీతం, రోడ్లు భవనాల శాఖ చీఫ్ ఇంజినీర్ (భవనాలు) శ్రీ. బీ. రాజేశ్వర్ రెడ్డి మరియు SE శ్రీ. వసంత నాయక్ పాల్గొన్నారు.

ఈ కళాశాల ఏర్పాటుతో ప్రాంతీయ అభివృద్ధికి, వ్యవసాయానికి మరియు పశు వ్యవసాయ రంగానికి కీలకమైన సహకారం అందే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు

### 12వ తేదీ నుంచి సచివాలయంలో ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ విధానం



హైదరాబాద్ డిసెంబర్ 11 : ఈ నెల 12వ తేదీ నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ విధానాన్ని అమలు చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. సచివాలయంలో పని చేసే అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి ఈ అటెండెన్స్ వర్తించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఔట్ సోర్సింగ్, సచివాలయం హెడ్ నుంచి వేతనాలు పొందే ప్రతి ఉద్యోగికి వర్తించనున్నట్లు పేర్కొన్నారు.

## ఉత్సాహంగా కొనసాగుతున్న సీఎం కప్ 2024 మండల స్థాయి పోటీలు



హైదరాబాద్ : నిన్న ప్రారంభమైన సీఎం కప్ 2024 రెండవ అంచె మండల స్థాయి పోటీలు రాష్ట్రంలోని అన్ని మండలాల్లో పట్టణాల్లో ఘనంగా కొనసాగుతున్నాయి డిసెంబర్ 7 8 తేదీలలో గ్రామస్థాయిలో ముగిసిన పోటీల విజేతలు మండల స్థాయిలో పోటీ పడుతున్నారు. ఆరు క్రీడాంశాలు అట్లాంటిక్స్ వాలీబాల్ ఫుట్బాల్ యోగ కోకో కబడ్డీ గ్రామస్థాయి పోటీల విజేతలతో పాటు వివిధ మండలాల్లో స్థానికంగా డిమాండ్ ఉన్న క్రీడాంశాల్లో ఈ పోటీలు కొనసాగుతున్నాయి వివిధ మండలాల్లో ఉత్సాహభరితంగా కొనసాగుతున్నఈ క్రీడా పోటీల వేడుకల్లో పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులు ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారుల ను ఉత్తేజ పరుస్తున్నారు. ములుగు జిల్లా మండలంలో మంత్రి పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పాల్గొని కబడ్డీ పోటీలను ప్రారంభించారు. అదేవిధంగా పలు నియోజకవర్గాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొని క్రీడలకు పోటీల విజయవంతనికి కృషి చేస్తున్నారు జిల్లా కలెక్టర్లు సమన్వయం చేస్తున్నఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ విద్యాశాఖ తోపాటు పలువురు ప్రభుత్వ శాఖల అధికారులు, ఈ పోటీలో పాల్గొని పోటీలను పర్యవేక్షిస్తున్నారు. డిసెంబర్ 10, 11, 12 తేదీల్లో మూడు రోజులపాటు జరగనున్న ఈ మండల స్థాయి విజేతలు తదుపరి డిసెంబర్ 16 నుండి ప్రారంభమయ్యే జిల్లా స్థాయికి ఎంపిక అవుతారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం ఎల్ బి స్టేడియంలో మానిటరింగ్ సెల్ ను ఏర్పాటు చేసి అధికారులు ఎప్పటికప్పుడు మండలాల్లో జరిగే కార్యక్రమాలను, క్రీడాకారుల వివరాలను క్రీడా పోటీల ఫలితాలను ఆన్లైన్ ప్రక్రియలో సంక్షిప్తం చేస్తూ కార్యక్రమాలు అన్నింటిని సమీక్షిస్తున్నారు.

## పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన

- ఐదు వందల మందికి ఒక సర్వేయర్
- 31వ తేదీ నాటికి పరిశీలన పూర్తి చేయాలి
- సామాజిక సర్వేకు తుదిగడువు 13వ తేదీ
- 14వ తేదీన సంక్షేమ హాస్టల్ విద్యార్థులతో సహపంక్తి భోజనం
- 15,16 తేదీల్లో జరిగే గ్రూప్ -2 పరీక్షలకు విస్తృత ఏర్పాట్లు
- కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ లో రెవెన్యూ ,హౌసింగ్. సమాచార శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలనను పకడ్బందీగా చేపట్టాలని రెవెన్యూ ,హౌసింగ్. సమాచార శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్ లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన , గ్రూప్ -2 పరీక్షల నిర్వహణ, మెస్ ఛార్జీలపెంపు, సామాజిక సర్వే తదితర అంశాలపై బుధవారం సచివాలయం నుంచి ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ " ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజా పాలనలో వచ్చిన 80 లక్షల దరఖాస్తుల పరిశీలనను ఈనెల 31వతేదీ లోగా పూర్తిచేయాలి. పరిశీలన చేసిన సర్వే వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేయాలి, ప్రతి ఐదు వందల మందికి ఒక ఉద్యోగి ( సర్వేయర్) ను నియమించుకోవాలి. సర్వే లో ఇందిరమ్మ కమిటీ సభ్యులను కూడా భాగస్వామ్యం చేయాలి, రాష్ట్రంలో ఎక్కడైనా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు కాక పోతే వెంటనే ఏర్పాటు చేసుకోవాలి, ఏ గ్రామంలో సర్వే నిర్వహిస్తారో ఆ ముందు రోజు రాత్రి గ్రామంలో చాటింపు చేయాలి. అంతేగాక స్థానిక పరిస్థితులను బట్టి కలెక్టర్‌లు ప్రణాళికలు రూపొందించుకోవాలి, ఏ ఒక్క దరఖాస్తును విడిచిపెట్టకుండా చిన్న చిన్న పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా పకడ్బందీగా సర్వే నిర్వహించాలి, సర్వే వివరాలపై ప్రతి రోజు కలెక్టర్ లు సమీక్షించాలి, ప్రతి జిల్లా కేంద్రంలో ఫిర్యాదులు, సలహాలకోసం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసుకోవాలి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఓ నిరంతర ప్రక్రియ ఈ ఏడాది 4.5 లక్షల ఇండ్లను నిర్మించబోతున్నాం "కలెక్టర్ లకు మంత్రి సూచించారు.గత ప్రభుత్వం పది సంవత్సరాలలో ప్రభుత్వ వసతి గృహాలలో చదువుకొనే విద్యార్థుల మెస్ ఛార్జీలను ఒక్కసారి కూడాపెంచలేదు. మా ప్రభుత్వం ఏడాది లోపే 40 శాతం మెస్ ఛార్జీలు పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం వల్ల 7.65 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలిగింది. కలెక్టర్లు తరచూ హాస్టళ్లను తనిఖీ చేసి విద్యార్థులకు అందించే సరుకుల క్వాలిటీ, క్వాంటిటీపై ప్రధానంగా దృష్టి సారించాలి. ఈనెల 14వ తేదీన మంత్రులు , ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ,పార్లమెంటు సభ్యులు స్థానికంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లను సందర్శించి అక్కడే విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తాం. ఈకార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాల్గొనాలి.

సామాజిక సర్వే

రాష్ట్రంలో 1కోటీ 16 లక్షల కుటుంబాలకు గాను 1కోటీ 12 లక్షల కుటుంబాల సామాజిక సర్వే (99.09 శాతం) పూర్తిచేయడం జరిగింది. ఇందుకు కృషి చేసిన అధికారులకు ముఖ్యమంత్రి గారి తరపున, రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రత్యేక అభినందనలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈనెల 13వ తేదీ సామాజిక సర్వేకు తుదిగడువు. ఆ తర్వాత ప్రజా పాలన సేవా కేంద్రాలలో కూడా కుటుంబ సర్వే వివరాలను నమోదు చేసుకోవచ్చు.ఈనెల 15, 16 తేదీలలో జరిగే గ్రూప్-2 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

# సంపాదకీయం

## ప్రజారోగ్యమే ప్రపంచ శాంతికి మూలం

పౌర సమాజ శ్రేయస్సు, స్థిర జీవనం, ఉత్పాదకత, సంపాదన లాంటి అంశాలకు వ్యక్తిగత ఆరోగ్యాలు ఆధారపడి ఉన్నాయి. ఐరాస గుర్తించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-2030 సాధనకు ఆరోగ్యకర ప్రపంచ జనాభా అత్యవసరం. గత రెండు దశాబ్దాలుగా కుటుంబాల వైద్య ఆరోగ్య ఖర్చులు విపరీతంగా పెరగడం గమనించారు. ప్రపంచ జనాభాలో 2 బిలియన్ల ప్రజలు వైద్య ఖర్చులతో నలిగి పోతున్నారని, అనారోగ్య కారణాలతో 1.3 బిలియన్ల ప్రజలు ఆర్థికంగా చితికిపోయి నిరు పేదలుగా మారారని గణాంకాలు వివరిస్తున్నాయి. ముఖ్యంగా తల్లులు, పిల్లల ఆరోగ్య సమస్యలు కుటుంబాల ఆర్థిక స్థితిని దిగజార్చడం, రోగ నిర్ధారణతో పాటు వైద్య ఖర్చులు భరించలేక కొన్ని సందర్భాల్లో ప్రాణాలు సహితం కోల్పోవడం కనిపిస్తున్నది. వైద్య ఆరోగ్య అభద్రత కారణంగా ప్రపంచ మానవాళి ఆర్థిక స్థితులు తీవ్రంగా ప్రభావితం కావడాన్ని గమనించిన ఐరాసతో కూడిన అంతర్జాతీయ సమాజం ఈ విషయం పట్ల అవగాహన కల్పించటానికి ప్రతి ఏట 12 డిసెంబర్‌న "సార్వత్రిక ఆరోగ్య భద్రత దినం (యూనివర్సల్ హెల్త్ కవరేజ్ డే)" పాటించుట 2006 నుంచి ఆనవాయితీగా మారింది. సార్వత్రిక ఆరోగ్య భద్రత దినం-2024 థీమ్‌గా "ఆరోగ్యం - ప్రభుత్వ కనీస బాధ్యత" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం కొనసాగుతున్నది. సార్వత్రిక ఆరోగ్య భద్రతలో భాగంగా నాణ్యమైన అత్యవసర వైద్య సదుపాయాల కల్పన, దీర్ఘకాలిక ఆరోగ్య భద్రత కల్పన, ఔషధాల అందుబాటు, సకాలంలో టీకాలను వేయించడం ప్రపంచ జనాభా ముంగిట ఉచితంగా అందించాలి. పేదరికం, పోషకాహార లోపాలతో ఆరోగ్య సమస్యలు నేరుగా సంబంధాలను కలిగి ఉంటాయని, ఈ ప్రాథమిక సమస్యలకు సమాధానాలను వెతకడం మన కనీస ధర్మమని ప్రభుత్వాలుతెలుసుకోవాలి. సార్వత్రిక ఆరోగ్య అభద్రతకు కారణాలుగా అరకొర వైద్య సిబ్బంది, వైద్య వసతుల లేమి, వైద్య ఆరోగ్య శాఖల్లో నిధుల కొరత, విపరీతంగా పెరుగుతున్న ప్రైవేట్ ఆసుపత్రులు, ప్రభుత్వ పని తీరు నిరాశాజనకంగా ఉండడం లాంటివి పేర్కొనబడ్డాయి. 2015లో ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వే వివరాల ప్రకారం 38 శాతం ప్రపంచ జనాభాకు ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలతో పాటు సురక్షిత నీటి వనరులు అందుబాటులో లేవని, 35 శాతం జనాభా తమ చేతులను శుభ్రంగా కడుక్కోవడానికి అవసర సబ్బు లాంటి పదార్థాలు లేదని తెలుస్తున్నది. ఇలాంటి దయనీయ దుస్థితిలో అంటువ్యాధులు కమ్ముకోవడం, అనారోగ్యాలు ముసురుకోవడం జరుగుతుంది. నేటి అభాగ్య పేదరిక ప్రపంచ జనాభాకు ఆరోగ్య భద్రత కల్పించడం ప్రభుత్వాల కనీస బాధ్యత. సార్వత్రిక ఆరోగ్య భద్రత కల్పనకు ప్రభుత్వాలు రోగ నిర్ధారణ కేంద్రాలు, వైద్య ఆరోగ్య కేంద్రాలు నెలకొల్పి నిరు పేదల వైద్య ఖర్చులను తగ్గించడంతో ద్వారా పేదరికం కూడా తగ్గిపోవడం, ఆర్థికంగా బలోపేతం కావడం, కుటుంబంలో సంతోషాల జల్లులు కురవడం, మొత్తంగా ప్రపంచ శాంతి నెలకొనడం ఫలిస్తుంది. అందరికీ సమానంగా వైద్య ఆరోగ్య వసతులు కల్పించిన సమాజంలో సార్వత్రిక ఆరోగ్య భద్రత సకల్పించినట్లు అవుతుంది. వ్యక్తిగత, కుటుంబ వైద్య ఆరోగ్య ఖర్చులను తగ్గించినా సమాజంలో పేదరిక నిర్మూలన వేగం పుంజుకుంటుంది. ప్రపంచవ్యాప్తంగా నలుమూలల వైద్య సదుపాయాలు, అవసరమైన వైద్య సిబ్బంది నియామకాలు, ఔషధాల అందుబాటు, చవకైన ఆరోగ్య భీమా అవకాశాలు లాంటి సకారాత్మక చర్యలు తీసుకున్న సమాజంలో ప్రజారోగ్య భద్రత వర్ధిల్లుతుందని గమనించాలి. ఆరోగ్యకర కుటుంబాల నెలవుగా ప్రపంచం మారాలి. ఆసుపత్రులు అందుబాటులో ఉండాలి. మన ఆరోగ్యం మన చేతుల్లో ఉండడానికి ప్రతి ఒక్కరు కనీస పరిశుభ్రతను పాటించాలి.

# ఇన్సూరెన్స్ చట్ట సవరణలు ఎవరి కోసం?

ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను(ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్ లేదా ఎఫ్‌డిఐ) 74శాతం నుంచి వంద శాతానికి పెంచనున్న ప్రతిపాదనలపై ప్రజల నుండి అభిప్రాయాలు సేకరించేందుకు కేంద్ర ఆర్థికశాఖ ఆధ్వర్యం లోని డిపార్ట్మెంట్ అఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (డిఎఫ్ఎస్) ఆన్‌లైన్ ద్వారా కోరింది. ఈ నెల పదిలోపు తమ అభిప్రాయాల్ని వ్యక్తపరచాలని సూచించింది. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకోబడిన ప్రభుత్వం ఇలా కొన్ని అంశాలపై ప్రజాభిప్రాయాన్ని సేకరించే ప్రయత్నం చేస్తున్నట్టుగా ప్రకటించుకోవడం లేదా బహిర్గత పరచు కోవడంలోనే చిత్తశుద్ధి ప్రశ్నార్థకంగా మారింది. ఈదేశంలో ఆన్‌లైన్ ద్వారా ఆర్థికాంశాల పట్ల తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచే అవ కాశాలు, తమ అనుయాయుల నుండి తప్ప, చాలా తక్కువ. నిజంగా అలాంటి అభిప్రాయాలు స్వీకరించాలనుకుంటే ఇన్సూరెన్స్ రంగానికి సంబంధించిన ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు, ఏజెంట్లు, ఏజెంట్ల సంఘాలు, పాలసీదారులు, ఇతరత్రా మేధావుల నుంచి సేకరిస్తే ప్రయోజన కలిగే అవకాశమెక్కువ. అలా కాకుండా సామాన్య ప్రజానీకం నుండి అభిప్రాయ సేకరణకు ప్రయత్నిస్తే ఫలితం ఉండదు. నిరంతరం అందులోనే మునిగి తేలుతున్న ఉద్యోగులు ఏజెంట్ల అసోసియేషన్లతో తక్షణమే సంప్రదించడం అత్యావశ్యకం. నిజంగా ప్రజాభిప్రాయ సేకరణకు ప్రాధాన్యతనిచ్చే ప్రభుత్వాలే అయితే 1998లోనే దేశవ్యాప్తంగా ఒక కోటీ 65 లక్షల సంతకాలు ఇన్సూరెన్స్ రంగాన్ని ప్రయివేటు కంపెనీలకు అవకాశం ఇవ్వొద్దని అప్పటి లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి గారికి అందజేయడం జరిగింది. ఇతర అనేక సందర్భాలలోను ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు అవసరం లేదని, సదరు ఎఫ్‌డీఐలు ఏవిధంగా సర్విస్ సెంటర్లో ప్రధాన భూమిక పోషిస్తున్న ఇన్సూరెన్స్ రంగానికి నష్టం కలిగిస్తాయో కూడా ప్రభుత్వాలకు విడమర్చి చెప్పడం జరిగింది. ఇన్సూరెన్స్ రంగంలో ఎఫ్‌డీఐ పెంపుదలపై ఏర్పాటు చేసిన స్టాండింగ్ కమిటీ ముందు కూడా ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కామ్రేడ్ అమానుల్లా ఖాన్, కామ్రేడ్ కె వేణుగోపాల్ తమ వాదనలు వినిపించి ఒప్పించారు కూడా. ఇలా వ్యక్తీకరించబడిన ఏ సందర్భంలోనూ ప్రజాభిప్రాయానికి గానీ లేదా సంఘాల అభిప్రాయాలకు గానీ విలువ ఇవ్వకుండా, ఇప్పటి కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఇన్సూరెన్స్ రంగంలోకి ఎఫ్‌డీఐలను క్రమం తప్పకుండా పెంచుతూనే ఉంది. ఇప్పటికిప్పుడు ఉన్నఫలంగా ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా కొత్త కొత్త మార్పులకు శ్రీకారం చుట్టి తమ చేతికి రక్తం అంటుకోకుండా బయటపడాలన్న ఆలోచన చేస్తున్నది. 245 ప్రయివేటు కంపెనీలు చేస్తున్న మోసాలను అరికట్టి ప్రజలకు న్యాయమైన పద్ధతిలో ఇన్సూరెన్స్ అందిస్తూ ఉండాలన్న ప్రధాన ఆశయంతో1956లో ఇన్సూరెన్స్ రంగాన్ని జాతీయీకరిస్తూ జవహర్‌లాల్ నెహ్రూ ఆధ్వర్యంలో ఎల్ఐసి ఆఫ్ ఇండియా ఆవిర్భవించింది. చిన్నమొత్తాల పొదుపులను సేకరించి మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వానికి నిధులు సమకూర్చాలని, ఇన్సూరెన్స్‌ని ప్రతి మారుమూల ప్రాంతానికి చేరవేయాలనే నినాదంతో ముందుకొచ్చింది. అప్పటినుండి అప్రతిహతంగా సాగుతున్న ఇన్సూరెన్స్ రంగంపై ప్రయివేటు పెట్టుబడిదారుల కన్నుపడి నూతన ఆర్థిక విధానాలలో భాగంగా ఇన్సూరెన్స్ రంగంలోనికి ప్రయివేటు వ్యక్తులు కూడా ప్రవేశించే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. 1995 వరకు ఆర్థిక శాఖ ఆధ్వర్యంలో నడిచే ఇన్సూరెన్స్ రంగాన్ని రెగ్యులేట్ చేయడం కోసం ఒక కొత్త రెగ్యులేటరీ బాడీ అవసరమని ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అథారిటీ ఐ.ఆర్.ఎ అనే ప్రతిపాదనను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చింది. పార్లమెంట్‌లో ఈబిల్లును పాస్ చేయించడం కోసం నాటి ఆర్థిక మంత్రులు ఐకే గుజ్రాల్‌తో పాటు పి.చిదంబరం వేర్వేరు సందర్భాల్లో విశ్వ ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. 1999లో అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలోని వాజ్‌పేయి ప్రభుత్వం ఈ ఐఆర్ఎ అనే పదాన్ని ఐఆర్‌డిఎ (ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ)గా నామకరణం చేస్తూ పార్లమెంట్‌లో బిల్లును కాంగ్రెస్ పార్టీ సాయంతో ఆమోదింపజేసుకున్నది. ఈ బిల్లు పాస్ అయినప్పుడు ఇన్సూరెన్స్ రంగంలోకి ప్రయివేటు కంపెనీలు రావచ్చు అయితే 26శాతం మాత్రమే ఎఫ్‌డీఐలు ఉండాలన్న నిబంధన ఉంచారు. ఆశించిన మేర ప్రయివేటు కంపెనీలు నమోదు కాకపోవడంతో ఎఫ్‌డీఐని మరింత పెంచాలని తద్వారా ఫారిన్ కంపెనీస్ వస్తాయని చాలా ప్రయత్నాలు చేశారు. కానీ యూపీఎ (కాంగ్రెస్ ఆధ్వర్యంలో) వన్ ప్రభుత్వం ప్రభుత్వ రంగాలకు పెద్దపీట వేసే వామపక్ష పార్టీల మద్దతుతో ఉండటంతో అది సాధ్యపడలేదు. మళ్లీ కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత 2015లో ఎఫ్‌డీఐ 26 నుండి 49 శాతానికి పెంచారు. అయినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదనే నెపంతో 2021లో దీనిని 74 శాతానికి తీసుకెళ్లారు. ఆ తర్వాత కూడా ఈ 25 ఏండ్ల కాలంలో అన్ని ప్రయివేటు కంపెనీలు కలిపి 25 సంఖ్యను కూడా చేరు కోలేకపోయాయి. అందుచేత ఇప్పుడు ఇన్సూరెన్స్ రంగంలో వందశాతం ఎఫ్‌డీఐలను పెంచడం ద్వారా పుట్టగొడుగుల్లా ప్రయివేటు కంపె నీలు వెలసి ఇన్సూరెన్స్ రంగాన్ని అభివృద్ధి పరచగలవన్న "గాలిలో మేడలు" వంటి ఆశావాహ దృక్పథాన్ని కేంద్రం కలగంటోంది. అనగా ఇక నుండి దేశీయ భాగస్వామ్యం కలిగిన కంపెనీ లేవీ ఇన్సూరెన్స్ రంగంలో ఉండకుండా విదేశీ కంపెనీలు తమ దుకాణాలను ఇక్కడ తెరవవచ్చు. ఇప్పటికే ఇన్సూరెన్స్ బ్రోకరేజీకి సంబంధించిన రంగంలో వందశాతం ఎఫ్‌డీఐలకు అనుమతి ఉన్నది. అయినప్పటికీ ఈ బ్రోకరేజీ వ్యవస్థల ఫలితాలు ఆశించిన మేర లేవు. వెరసి అర్థం చేసుకోవాల్సిందేమంటే భారత ప్రజానీకం ప్రయివేటు ఇన్సూరెన్స్ రంగం పట్ల అంతగా ఆసక్తి కనబరచడం లేదు. కారణమేమంటే దీర్ఘకాలిక పొదుపు పట్ల, మరణానంతరం లభించే కుటుంబానికి లభించే సొమ్ము పట్ల ప్రభుత్వ గ్యారంటీ కలిగిన ప్రభుత్వ రంగాన్ని ఎంచుకుంటున్నారని అర్థం. అయినప్పటికీ న్యూ మిలీనియల్‌గా పిలువబడే యువతను తప్పుదోవ పట్టించే వక్ర ప్రకటనల ద్వారా ప్రయివేటు రంగం కొంత మార్కెట్ వాటాను చేజిక్కించుకునే ప్రయత్నం చేస్తోంది. అయినా కూడా మిస్ సెల్లింగ్ అని మాల్‌ప్రాక్టీస్ అని అనేక సందర్భాల్లో ఐ ఆర్ డిఎఐ ప్రయివేటు కంపెనీలకు జరిమానాలు విధిస్తున్నట్లు కూడా బహిర్గతమవుతూనే ఉన్నాయి.

గతంలో కూడా ఇన్సూరెన్స్ చట్టాల సమగ్ర పునర్ వ్యవస్థీకరణ పై ఇన్సూరెన్స్ చట్టాల సవరణ (అమెండ్‌మెంట్) బిల్ ప్రవేశపెడుతూ ప్రజాభిప్రాయాన్ని సేకరించాలని కేంద్రం తలపెట్టింది. ఇప్పుడు ప్రతిపాదిస్తున్న ఇన్సూరెన్స్ చట్టాల సవరణ బిల్లులో అనేక ప్రమాదకర ప్రస్తావనలు ఉన్నాయి. లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రారంభించాలంటే వంద కోట్ల కనీస మూలధనం అవసరం దాన్ని తగ్గించాలనే ప్రతిపాదన ఇందులో ఉన్నది. ఎల్ఐసి ఆఫ్ ఇండియా పూర్తి ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్నది కాబట్టి వంద కోట్ల రూపాయల మూలధనం అవసరం లేదని మొర పెట్టుకున్నా వినకుండా ఎల్ఐసీ ఆఫ్ ఇండియా నుండి వంద కోట్ల మూలధనాన్ని ఏర్పాటు చేయించింది. ఇప్పుడు ఇదే నిబంధనను కేవలం విదేశి కంపెనీలను సంతృప్తి పరచడం కోసం తొలగిస్తున్నది. ఇన్సూరెన్స్ కంపెనీలు సింగల్ రిజిస్ట్రేషన్‌తో లైఫ్, జనరల్ అండ్ హెల్త్ ఇన్సూరెన్స్ వ్యాపారం చేసుకోవచ్చు. ఈ కాంపోజిట్ లైసెన్స్‌తో అడ్వర్స్ (నష్ట దాయకమైనది) సెలక్షన్ జరగవచ్చనే ఆలోచనకు చరమ గీతం పాడుతున్నారు. ఇన్సూరెన్స్ ఏజెంట్లు లైఫ్ ఇన్సూరెన్స్, జనరల్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ ఈ మూడు కంపెనీలకు ఒకే లైసెన్స్ తో పనిచేయవచ్చని మరో ప్రతిపాదన చేయబడింది. దీంతో ఏజెంట్లు వ్యవస్థ అస్తిత్వం ఒక సందిగ్ధావస్థలో పడే ప్రమాదం ఉంది. ఈ మార్పుతో పాటు ఇన్సూరెన్స్ సంస్థలు తమ ప్రధాన వీధి అయినటువంటి ఇన్సూరెన్స్‌తో కల్పనతో పాటు ఇతర ఇండెమినిటీ వ్యాపారాలు, ఆస్తిపాస్తుల అమ్మకాలు కొనుగోళ్లు వంటి ఇతర వ్యాపారాలు కూడా చేసుకునే అవకాశం కల్పించడం జరుగుతుందట. దీని ద్వారా ప్రధాన ధ్యేయం పక్కదారి పడుతోంది. భీమా "సుగమ్" పేరున "ఇన్సూరెన్స్ సొల్యూషన్స్ ఫ్రమ్ వన్ ప్లేస్" అనే ప్రతిపాదన ద్వారా ఇన్సూరెన్స్ మూలసూత్రాలైన "ఇన్సూరబిలిటీ ఇంటరెస్ట్, అడ్వర్స్ సెలెక్షన్ అండ్ అట్మోస్ట్ గుడ్ ఫెయిత్" వంటివన్నీ కూడా ప్రమాదంలో పడనున్నాయి. ఇలాంటి సరళీకరించబడిన విధానాలు ప్రయివేట్ కంపెనీలకు తమ లాభాల కోసం ఎంతకైనా ఒడిగట్టే అవకాశాన్ని ఇస్తాయి. దీర్ఘకాలిక కాంట్రాక్టులకు ఆలవాలమైన ఇన్సూరెన్స్ రంగంలో ఇలాంటి సరళీకరణ విధానాలు ప్రమాదాలుగా పరిణమిస్తాయి.

భారత ఇన్సూరెన్స్ రంగ తలుపులు బార్లా తెరవబడిన 25 ఏండ్ల తర్వాత కూడా లైఫ్ అండ్ జనరల్ ఇన్సూరెన్స్ సెక్టర్లలో కలిపితే అరవై కంపెనీలకు మించి దాటలేదు. చాలా ప్రయివేటు కంపెనీలు కోట్లలో జరిమానాలు కట్టాయి. ఇప్పటికే డజన్ కంపెనీలు బిచాణా ఎత్తేశాయి కూడా. క్లెయిమ్‌ల చెల్లింపుల్లోనూ భేరసారాల ద్వారా లబ్ధిదారులను ప్రయివేటు కంపెనీలు ఇబ్బంది పెడుతున్న సందర్భాలు కోకొల్లలు. ఇన్సూరెన్స్ రంగం ద్వారా(ఎల్ఐసి అండ్ జిఐసి కలిపి) దేశంలోకి వచ్చిన ఎఫ్‌డీఐలు 70వేల కోట్లను మించలేదు. భారతదేశంలో ప్రయివేటు కంపెనీలు సంపాదించిన లాభాలను మూడేండ్ల పాటు ఇక్కడే పెట్టుబడులు పెట్టాలన్న నిబంధనను (రిపాట్రియేషన్ క్లాజ్) 2015 లో బీజేపీ ప్రభుత్వం తొలగించిన తర్వాత విదేశీ కంపెనీలు తమ లాభాలను యథేచ్ఛగా ఎప్పటికప్పుడు తరలించుకుపోతూనే ఉన్నాయి. ఇలాంటి అనుభవం ఉన్న తర్వాత కూడా మరింత సరళీకరించడం నష్టదాయకమే అవుతుంది. అయినప్పటికీ అంతర్జాతీయ వ్యాపార ఒప్పందాల ఒత్తిడి, భారత ఇన్సూరెన్స్ మార్కెట్ పై విదేశీ కంపెనీల అంచనాలు, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ బాధ్యతారహిత ప్రయివేటీకరణ విధానాలు ఇన్సూరెన్స్ రంగాన్ని నష్టపరిచే ఇన్సూరెన్స్ చట్టాల అమెండ్‌మెంట్ బిల్లును ముందుకు తీసుకొస్తున్నాయి. 2022 మేలో అట్టహాసంగా ఎల్ఐసి లోని 3.5శాతం వాటాలను మార్కెట్‌లోకి విడుదల చేశాక ఎల్ఐసి వాటా ధర ఆశించిన ఫలితాలనివ్వకపోవడంతో సెబి నిబంధనల రిత్యా జరగవలసిన తదుపరి ఉపసంహరణను కేంద్రమే సెబిని అభ్యర్థించి నిలుపుదల చేసింది. వాటాల ఉపసంహరణ తరువాత మిరాకిల్స్ ఏమీ జరగకపోగా ఎల్ఐసి అనవసరపు పోటీ తత్వాన్ని ఎదుర్కొని లాభార్జనకై శ్రమిస్తుండటంతో మూల ధ్యేయమైన ప్రతి మారు మూల ప్రాంతాల్లోని ఒక్కరికీ ఇన్సురెన్స్ అనే నినాదం ప్రశ్నార్థకంలో పడింది. అందుచేత మొక్కుబడిగా ప్రజల నుంచి అభిప్రాయాన్ని సేకరిస్తున్నట్లు కనిపించే తూతూ మంత్రాలు కాకుండా భాగస్వాములు అయిన ఇన్సూరెన్స్ రంగంలోని అంతర్గత సంఘాలతో చర్చిస్తే మంచి సూచనలొస్తాయి.

## భావోద్వేగాల భాష్పాంజలి

అంజలి - సుమారు పాతికేళ్ళ క్రితం చూసిన చలన చిత్రం. అప్పుడు చాలా నచ్చింది. నాది విశ్రాంత జీవితం ఇప్పుడు. కష్ట పడింది చాలు, మీ కోసం మీరు, మీకు నచ్చిన విధంగా జీవించమని నాకు కుటుంబసభ్యుల సలహా, కోరిక, అభ్యర్థన, ఉద్బోధ. మళ్లీ ఆ చిత్రం రెండు దినాల క్రితం చూడటం ప్రారంభించి నిన్న పూర్తి చేసాను. ఇప్పుడు మరచి పోలేనంతగా నచ్చింది. కథ పకడ్బందీగా, సహజంగా, అద్భుతంగా న భూతో న భవిష్యతి గా ఉంది. అప్పుడూ, ఇప్పుడు మాస్టర్ తరుణ్ నటనకి ముగ్ధుడనయిపోయాను. అప్పటిలో అతను పెద్దయి మహానటుడు అవుతాడని ప్రపంచ స్థాయిలో పేరు తెచ్చుకుంటాడని ఊహించాను, నమ్మాను, ఆశపడ్డాను. దురదృష్టవశాత్తు అలా జరగలేదు. కొన్ని జీవితాలు అంతే. చిత్రం యూట్యూబ్ లో ఉంది. ఎంతో భావోద్వేగ ఆవేశాలను కలగజేసి, చిత్రంలో మనల్ని లీనం చేసి, కాల గమనాన్ని మరిపించే చక్కని సినిమా. మనిషి సృజనాత్మకతకు హద్దు లేదని నిరూపించే చలన చిత్రం. ఈ సినిమా ప్రధాన పాత్ర ఎవరూ అంటే చెప్పడం కష్టం. చిత్రంలో ఎన్నో ధారలు ఉన్నాయి. మానసికంగా ఎదగని, పుట్టుకతోనే జబ్బుతో జన్మించిన పాప అంజలిది ఒక ధార. సినిమా మధ్యలో ఈ పాత్ర మనకి తెలుస్తుంది. అంత వరకు, చిన్న పిల్లల ఆటపాటలతో, చలాకీ చేష్టలతో, భార్యాభర్తల ప్రేమానురాగాలు, ఆదర్శబంధంతో చురుకుగా, సజావుగా, ఆహ్లాదకరంగా సాగిపోతుంది కథ. అంజలి మూడో సంతానం. పుట్టుకతోనే, అరుదైన రోగంతో అల్పజీవిత శాసనంతో పుడుతుంది. తండ్రి తల్లికి చెప్పకుండా ఉంచుతాడు, నిజం చెబితే తట్టుకోలేదన్న భయంతో. ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పకూడదన్న దృఢనిశ్చయంతో ఉంటాడు. తల్లికి, మిగతా ఇద్దరి పిల్లలకి పుట్టినప్పుడే శిశువు చనిపోయిందని, అబద్ధం చెప్పి పాపని ఒక ఆసుపత్రిలో జేర్చి ఆ పాపని కాపాడే విశ్వ ప్రయత్నం చేస్తుంటాడు తండ్రి. తల్లికి ఈ విషాద వార్త తెలియడంతో కథలోకి అంజలి ప్రవేశిస్తుంది. కథ అంతా ఇక ఆ పాప చుట్టే ముఖ్యతః తిరుగుతుంది. కథలో చాలా బిగువు ఉంది. ఎక్కడా అనుమానాలకు, కృత్రిమమని నిందలకు అవకాశం ఇవ్వలేదు. ఉత్కంఠతో సమయాన్ని స్తంభింపజేసే కథ, సాగతీత లేదు. ఇంకా చెప్పాలంటే, సమయం ఇంకా తీసుకుని కథ పూర్తిగా చెప్పి ఉంటే, కొన్ని ప్రశ్నల సమాధానాలు ప్రేక్షకుల ఊహకి వదిలేయకుండా కథకుడే చెప్పి ఉంటే, అన్ని మామూలు సినిమాల్లో లాగా పాపకి ఏదో అద్భుతం జరిగి ప్రాణ గండం నుంచి తప్పించి ఉంటే సామాన్య ప్రేక్షకుడికి ఆనందం, తృప్తి కలిగేవి. కానీ అప్పుడు కథ సామాన్యం అవుతుంది. అపార్ట్మెంట్ల సమూహ ప్రాంగణంలోనే ఉన్న ఒక యువతి, యువకుడి మధ్య నడిచే ప్రేమ కథ రెండో ధార. పోలీసు అధికారినే చంపి అడ్డు తొలగించుకునే మాఫియాది ఇంకో ధార. ఒక పక్క ప్రాణానికి మించి ప్రియమైన భార్య, జబ్బుతో పుట్టిన పాప అంజలి, ఇంకా ఇద్దరు ఎంతో ఎదగాల్సిన, ముందు జీవితం చూడాల్సిన చలాకి పిల్లలు - కలిపి ప్రాణం కంటే మిన్న అయిన కుటుంబం. అయినా సరే ప్రాణం తెగించి, హెచ్చరికలు బెదిరింపులు తట్టుకుని ఎదురొడ్డి మరీ, కళ్లెదుటే భవనం నుంచి కిందికి తోసేసి చేసిన పోలీసు అధికారి హత్యని బయటపెట్టి మాఫియా నిందితులకు శిక్ష కలిగేటట్లు చూడటానికి ప్రయత్నించే నిజాయితీపరుడి, ధైర్యవంతుడి కథ ఇంకో ధార. తోటి అపార్ట్మెంట్ వాసులకు సైతం ఆగంతుడిగా, అపరిచిత వ్యక్తిగా ఖైదీగా, హంతకుడి ముద్రతో మిగిలిపోయిన పాత్రది ఇంకో ధార. అతను హంతకుడిగా ఎందుకు మారాడు, అతని ట్రంకు పెట్టెలో దొరికిన పాప చిత్రం వెనక ఏ కథ దాగి ఉంది? కృత్రిమంగా అతికించిన పాత్రగా కాకుండాకథ అంతర్గత భాగంగా ఈ వ్యక్తి జీవితంలోని కొన్ని సంఘటనలు చూపించి కొన్ని సందేశాలు ఇస్తుంది సినిమా. కానీ అతని జీవిత విశేషాలు మనకి ప్రశ్నార్థకం గానే మిగులుస్తాడు నేర్పుగా, తెలివిగా రచయిత మరియు దర్శకుడు. చిత్రం చూసి బయటకు వచ్చేవారు ఎంత కథ అని తెలిసినా హృదయ భారంతోనే ఉంటారు. నాకయితే ఓ పది మార్లు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. 3-4 సార్లు చెంపల వెంబడి కారాయి కూడా. గొంతు గద్గద మయ్యింది.



## తెలుగు భాషకు చార్లెస్ బ్రౌన్ ఎనలేని సేవ



పరదేశీయుడైనా, ఆంగ్ల భాష మాతృభాష అయినా, బహు భాషవేత్త అయి ఉండీ, ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగిగా భారత దేశానికి వచ్చి, విధి నిర్వహణ కోసం తెలుగు భాష నేర్చుకుని, నాటికి కరడుగట్టి, మినుకు మినుకు మంటూ, ఆరి పోవడానికి సిద్దంగా ఉన్న తెలుగు భాష ఉద్దరణకు బ్రౌన్ తీసుకున్న చొరవ ప్రశంసనీయం. ఆంగ్లేయులు పురాణాలను ప్రచురించడం, వ్యాఖ్యానాలు రాయించడం, తెలుగు నేర్చుకోవడం కోసం వాచకాలు, వ్యాకరణ గ్రంథాలు రాయడం, ప్రచురించడం, సహస్రాధిక వేమన పద్యాలను వెలికితీసి ప్రచురించడం, పాఠశాలలు స్థాపించి, ఉచిత విద్య నేర్చుకునే అవకాశం కల్పించడం, ప్రాచీన గ్రంథాలను అర్థం చేసుకోవడానికి ఏకంగా నిఘంటువుని అందించడం ద్వారా తెలుగు భాషా, సాహిత్య వికాసానికి బ్రౌన్ అందించిన సేవ అమోఘం, అపూర్వం, అస మానం అనితర సాధ్యం. చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (నవంబర్ 10, 1798 - డిసెంబర్ 12, 1884) తెలుగు సాహిత్యమునకు విశేష సేవ చేసిన ఆంగ్లేయుడు. తొలి తెలుగు శబ్దకోశమును ఆయనే పరిష్కరించి ప్రచురించాడు. బ్రౌన్ డిక్షనరీని ఇప్పటికి తెలుగులో ప్రామాణికంగా ఉపయోగిస్తారు. సి. పి. బ్రౌన్ 1798 నవంబర్ 10న కలకత్తాలో జన్మించాడు. ఈయన తండ్రి డేవిడ్ బ్రౌన్ పేరొందిన క్రైస్తవ విద్వాంసుడు. తండ్రి మరణించిన తరువాత బ్రౌను కుటుంబం ఇంగ్లండు వెళ్ళిపోయింది. తండ్రి ఇచ్చిన స్ఫూర్తితో సీపీ బ్రౌన్ గ్రీక్, లాటిన్, పారశీ, సంస్కృత భాషల్లో ఆరితేరాడు, బ్రౌను అక్కడే హిందూస్థానీ భాష నేర్చుకున్నాడు. తరువాత 1817 ఆగష్టు 4 న మద్రాసులో ఈస్ట్ ఇండియా కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా మద్రాసులో కోదండరామ పంతులు వద్ద తెలుగులో ప్రాథమిక జ్ఞానాన్ని సంపాదించాడు. 1820 ఆగస్టులో కడపలో డిప్యూటీ కలెక్టరుగా చేరాడు. ఉద్యోగరీత్యా అనేక ప్రాంతాల్లో పని చేసినపుడు తెలుగులో మాట్లాడడం తప్పనిసరి అయింది. అయితే తెలుగు నేర్చుకోడానికి సులభమైన, శాస్త్రీయమైన విధానం లేక పోవడం వలన, పండితులు తమ తమ స్వంత పద్ధతులలో బోధిస్తూ ఉండేవారు. తెలుగేతరులకు ఈ విధంగా తెలుగు నేర్చుకోవడం ఇబ్బందిగా ఉండేది. భాష నేర్చుకోవడం లోని ఇబ్బంది, బ్రౌనును తెలుగు భాషా పరిశోధనకై పురికొల్పింది. ప్రాచీన తెలుగు కావ్యాలను వెలికితీసి, ప్రజలందరికీ అర్థమయ్యేలా పరిష్కరించి, ప్రచురించడం, భాషకు ఓ వ్యాకరణం, ఓ నిఘంటువు, ఏర్పడడానికి దారితీసింది. మచిలీపట్నం, గుంటూరు, చిత్తూరు, తిరునెల్వేలి మొదలైన చోట్ల పనిచేసి, 1826లో మళ్ళీ కడపకు తిరిగి వచ్చి అక్కడే స్థిర నివాస మేర్పరచు కొన్నాడు. కడపలోను, మచిలీపట్నంలోను కూడా పాఠశాలలు పెట్టి ఉచితంగా చదువు చెప్పించాడు. విద్యార్థులకు ఉచితంగా భోజన వసతి కూడా కల్పించాడు. 1834లో ఉద్యోగం నుండి తొలగించడంతో ఇంగ్లండు వెళ్ళిపోయి, తిరిగి 1837లో కంపెనీలో పర్షియను అనువాదకుడిగా భారత దేశానికి వచ్చాడు. 1827 నాటికే, బ్రౌన్ 'ఆంధ్ర గీర్వాణ ఛందము' అనే పుస్తకం రాసినప్పటికీ, ఆయనకి మంచి గుర్తింపు తెచ్చిన పుస్తకం 1829 నాటి 'వేమన శతకం'. అప్పటికి బ్రౌన్ అయిదేళ్లుగా వేమన సాహిత్యాన్ని అధ్యయనం చేస్తూ ఉన్నారు. ఇందులో దాదాపు 700 పద్యాలకు ఆంగ్లాను వాదాలతో పాటు విస్తృతమయిన పదకోశం కూడా సమకూర్చారు. మరో పదేళ్ల తర్వాత, 1164 పద్యాల వరకు విస్తరింపచేసి, తిరిగి 'వేమన శతకం' అచ్చువేశాడు. పదవీ విరమణ తరువాత 1854లో లండన్‌లో స్థిరపడి, 1865లో లండన్ యూనివర్సిటీలో తెలుగు ప్రొఫెసరుగా నియమితుడైనాడు. బ్రౌన్ కొలువులో తొలి తెలుగు కథకుడు తాతాచారి అనే పేరుతో ప్రాచుర్యం పొందిన నేలటూరు వేంకటాచలం. తాతాచారి చెప్పిన కథలను విన్న సి. పి. బ్రౌన్ అందులోంచి 24 కథలను, దానితోపాటు శ్రీకృష్ణమాచారి చెప్పిన రెండు కథలను కలిపి 1855లో పుస్తకంగా ముద్రించారు. 1916లో 'తాతాచారి కథలు ' గిడుగు వేంకట అప్పారావు సంపాదకత్వంలో ద్వితీయ ముద్రణ పొందాయి. 1951లో వావిళ్ల వారి తృతీయ ముద్రణ, 1974లో బంగోరె సంపాదకుడిగా చతుర్థ ముద్రణ పొందాయి. 1848లో చెన్నపట్నం వెళ్లి బ్రౌను కొలువులో ఏడేళ్లు పల్నాటి వీర చరితం, వసు చరిత్ర మొదలైన గ్రంథా ల పరిష్కార కృషిలో ఆయనకు సాయపడ్డారు. తాతాచార్యులు కావ్య తర్క వ్యాకరణముల యందు ప్రవీణత గలవాడు. తాతాచారి కథలు నీతి బోధకాలే కాక, ఆనాటి సామాజిక స్థితికి దర్పణంగాను ఉన్నాయి. అందులోని శైలి శుద్ధ వ్యావహారికం అయిన కారణంగా పండిత శైలికి దూరంగా ఉందనే బ్రౌన్ ప్రశంసకు యోగ్యమైంది. బ్రౌన్ వేమన పద్యాలను వెలికితీసి ప్రచురించాడు. 1829లో 693 పద్యాలు, 1839లో 1164 పద్యాలు ప్రచురించాడు. 1841లో "నలచరిత్ర"ను ప్రచురించాడు."ఆంధ్ర మహాభారతము", "శ్రీమద్భాగవతము" లను ప్రచురించాడు. తెలుగు నేర్చుకునే ఆంగ్లేయుల కొరకు వాచకాలు, వ్యాకరణ గ్రంథాలు రాసాడు. 1840లో వ్యాకరణాన్ని ప్రచురించాడు. లండన్‌లోని "ఇండియాహౌస్ లైబ్రరీ"లో పడి ఉన్న 2106 దక్షిణభారత భాషల గ్రంథాలను మద్రాసు తెప్పించాడు. "హరిశ్చంద్రుని కష్టాలు" గౌరన మంత్రిచే వ్యాఖ్యానం వ్రాయించి 1842లో ప్రచురించాడు. 1844లో "వసుచరిత్ర", 1851లో "మనుచరిత్ర" ప్రచురించాడు. జూలూరి అప్పయ్య శాస్త్రి చేత వీటికి వ్యాఖ్యానాలు రాయించాడు. 1852లో "పలనాటి వీరచరిత్ర" ప్రచురించాడు. పందొమ్మిదో శతాబ్ది తొలి చివర్లో తాను తెలుగు సాహిత్యంలో కృషి మొదలుపెట్టే నాటికి నెలకొని వుండిన స్థితిగతులను గురించి బ్రౌన్ స్ఫుటమయిన మాటల్లో అభివర్ణించాడు. 'అప్పటికి తెలుగు సాహిత్యం కొనప్రాణంతో కొట్టుకులా డుతోంది. 1825 నాటికి ప్రమిదలో దీపం కొడిగట్టి పోతోంది. తెలుగు సాహిత్యం దాదాపు అంతరించి పోతూ ఉండడం నా కళ్లబడింది. నేను 30 ఏళ్లు కృషి చేసి, దాన్ని పునఃప్రతిష్ట చేశాన'న్నాడు బ్రౌన్.

తెలుగు భాషాభివృద్ధికి ఇతోధిక సేవలు అందించి, మరచిపోలేని కృషి సల్పిన బ్రౌన్ 1884 డిసెంబర్ 12 న తన స్వగృహము 22 కిల్డారే గార్డెన్స్, వెస్ట్‌బార్న్ గ్రోవ్, లండన్లో అవివాహితుని గానే బ్రౌన్ మరణించాడు. ఆయనను కెన్సెల్ గ్రీన్ శ్మశానంలో సమాధి చేశారు.

## జర్నలిస్టులపై చేసిన దాడులను వ్యతిరేకిస్తూ జర్నలిస్టుల పటాన్ చెరు ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన



సంగారెడ్డి జిల్లా, పటాన్ చెరు డిసెంబర్11(వుదయం ప్రతినిధి): పటాన్ చెరు నియోజకవర్గంలోని పటాన్చెరువు పట్టణంలో అంబేద్కర్ విగ్రహం ముందున్న జాతీయ రహదారిపై నిరసన. సినీ నటుడు మోహన్ బాబు జర్నలిస్టులపై చేసిన దాడులను వ్యతిరేకిస్తూ జర్నలిస్టుల పటాన్ చెరు ఐక్యవేదిక ఆధ్వర్యంలోఐదు మండలాలకు సంబంధించిన జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. తదనంతరం డిఎస్పి రవీందర్ రెడ్డి కి వినతి పత్రం ఇచ్చారు. మీడియాపై దాడులను ముక్తకంఠంతో ఖండించారు. ప్లకార్డులు పట్టుకొని మోహన్ బాబుపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని, అట్లాగే తను బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, తనను వెంటనే అరెస్టు చేసి రిమాండ్ కు తరలించాలని. పలువురు జర్నలిస్టులు డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దేశవ్యాప్తంగా దాడులు చేస్తున్న చట్టాలు ఎన్ని ఉన్నా .. అమలకు నోచుకోవడం లేదని మండిపడ్డారు. మోహన్ బాబును వెంటనే అరెస్టు చేసి రిమాండ్ కు తరలించి ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు.

# ఉన్నత స్థాయికి ఎదగాలంటే క్రమశిక్షణ, కష్టపడేతత్వం కలిగివుండాలి

### జిల్లా కలెక్టర్ బి.ఎమ్.సంతోష్

అలంపూర్ డిసెంబర్ 11 (వుదయం ప్రతినిధి) తల్లిదండ్రుల కష్టాన్ని గౌరవించి, క్రమశిక్షణతో చదువుపై దృష్టి సాధించి రోల్ మోడల్లుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. బుధవారం ఎర్రవల్లి మండలం బీచుపల్లిలోని టి.జి. రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీ (బాలుర)లో విద్యార్థులతో కలిసి కలెక్టర్ రాత్రి పాఠశాలలోనే బస చేసి, ఉదయం విద్యార్థులతో కలిసి దినచర్య కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పాఠశాలలో ఉదయం విద్యార్థులతో పరస్పర సంభాషణ నిర్వహించి, తరగతి గదులు, మెనూ, హాస్టల్ పరిసర ప్రాంతాలను పరిశీలించి, ఉదయం ప్రార్థనలో పాల్గొన్నారు.




ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే క్రమశిక్షణ, కష్టపడే తత్వం, తమపై పూర్తి నమ్మకం కలిగి ఉండాలని అన్నారు. మంచి ఫలితాలు సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని అన్నారు. హార్డ్ వర్క్ మాత్రమే కాదు, స్మార్ట్ వర్క్ కూడా ఈ రోజుల్లో చాలా అవసరమని సూచించారు. చదువుకోవడం తో పాటు దాని అర్థం, ప్రాధాన్యతను తెలుసుకోవాలని, భవిష్యత్తు లో ఆ విషయాలు ఎలా ఉపయోగపడతాయో గుర్తించాలని సూచించారు. మీ సీనియర్లు గొప్ప స్థాయిలో ఉన్నారని, వారిలా మీరు కూడా ఎదగాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు లాజికల్ ఆలోచనతో చదివి, రివిజన్, మోడల్ పేపర్ల ద్వారా ప్రాక్టీస్ చేయాలన్నారు.



ఉదయం, రాత్రి స్టడీ అవర్స్‌ను పూర్తిగా ఉపయోగించు కోవాలని అన్నారు. ఈ సంవత్సరం పాఠశాలలో 10/10 జీపీఏతో కనీసం ఐదుగురు విద్యార్థులు ఉత్తీర్ణులవ్వాలన్నారు. మంచి ఫలితాలు సాధించిన వారికి స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా ఘనంగా సన్మానిస్తానని అన్నారు. విద్యతో పాటు శారీరక ఆరోగ్యం కూడా ముఖ్యమని, ప్రతి రోజూ విద్యార్థులందరూ వ్యాయామం చేయాలని సూచించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మెనూ ప్రకారం ప్రతిరోజు విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ఆదేశించారు. తల్లిదండ్రుల కృషిని వృథా చేయకుండా చదువుపై దృష్టి పెట్టాలని, ప్రతి ఒక్కరూ రోల్ మోడల్‌గా నిలవాలని కలెక్టర్ హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# క్రీడలు మానసిక ఉల్లాసం

### మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం సీఎం కప్ గేమ్స్

ఊర్కొండ డిసెంబర్11(వుదయం ప్రతినిధి): నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం. మండలంలోని ఊరుకొండ పేట. ఉరుకొండ. మాదారం. కస్తూరిబా స్కూల్. వెంకట బాల రామయ్య స్కూల్.విద్యార్థి విద్యార్థులు క్రీడలలో పాల్గొన్నారు ఊరుకొండ పేట జెడ్పిహెచ్ఎస్ పాఠశాల మైదానంలో మండల స్థాయి క్రీడలు ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా విద్యార్థులలో క్రీడా స్ఫూర్తి పెంపొందించడానికి ఈరోజు సీఎం మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన మండల స్పెషల్ ఆఫీసర్ సంతోష్ రావు మండల ఎంపీడీవో కృష్ణయ్య. ఎమ్మార్వో రామకోటి.ఎంపీ ఓ లక్ష్మణ్ నాయక్. హెచ్ఎం ఇన్చార్జి ఎంఈఓ మురళీమోహన్. ఎంపీడీవో ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి విద్యార్థులలో విద్యతోపాటు క్రీడా స్ఫూర్తి పెంచాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను నిర్వహిస్తుందని క్రీడాకారును కరచలనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు . క్రీడలు శారీరక ఆరోగ్యంతో మానసిక వికాసానికి తోడ్పడతాయని



అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయి పాఠశాలలలో పోటీపడగలుగుతున్నాయని.ప్రభుత్వ అనేక సంక్షేమలను మరికొద్ది రోజులలో ప్రవేశ పెట్టుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు.ఉపాధ్యాయురాలు. పీటీలు.గ్రామ పంచాయతీ సెక్రెటరీ. రెవిన్యూ. మండల పరిషత్. సిబ్బంది . విద్యార్థి విద్యార్థులు. ఉరుకొండ పేట గ్రామ యువకులు. మండల నాయకులు. వహీదోద్దీన్. కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి మాసూమ్.

ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షుడు కైసర్. బీజేవైఎం నాయకులు అరవిందు. జహీర్. అబ్దుల్. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అశోక్. ఎండి అక్బర్ పాల్గొన్నారు

# జర్నలిస్ట్ పైన దాడిని ఖండిస్తూ చెన్నూరు లో జర్నలిస్టుల నిరసన

చెన్నూరు డిసెంబర్11(వుదయం ప్రతినిధి): చెన్నూర్ పట్టణంలో జర్నలిస్ట్ సంఘాల ఆధ్వర్యంలో జర్నలిస్ట్ నిరసన చేశారు. TV 9 ప్రతినిధి రంజిత్ పైన మంగళవారం హైదరాబాద్ లోని తన పామ్ హౌజ్ మోహన్ బాబు దాడి చేయడాన్ని ఖండిస్తూ అంబేద్కర్ చౌరస్తాలో మోహన్ బాబుకి వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలు ధరించి జర్నలిస్టులు నిరసన తెలిపారు. అనంతరం పట్టణ పోలీసు స్టేషన్ ఎమ్మార్వో కార్యాలయంలో వినతిపత్రం అందచేశారు జర్నలిస్ట్ లు మాట్లాడుతు ప్రభుత్వం మోహన్ బాబుపై చట్టపరమైన చర్యలు తీసుకొని, భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.మీడియా తెలుసుకుంటే నీ హీరో ఇంజము పునాదుల నుండి కూలిపోతుంది ప్రతి చులకన అయిపోయింది



జీతం తీసుకోకుండా సమాజం కోసం సేవా చేసే వాళ్లే జర్నలిస్ట్ లు వెంటనే మోహన్ బాబు ను అరెస్టు చేసి తగిన న్యాయం చేయాలనీ వారు కోరారు ఈ కార్యక్రమం లో పలువురు ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు

### టీవీ9 రిపోర్టర్ రంజిత్ పై నటుడు మోహన్ బాబు దాడిని తీవ్రంగా ఖండించిన వుదయం రిపోర్టర్ అమీర్



ఊర్కొండ డిసెంబర్11(వుదయం ప్రతినిధి): మీడియా ప్రతినిధులపై దాడి హేయమైన చర్య తీవ్రంగా ఖండిస్తున్నాం.. టీవీ9 రిపోర్టర్ రంజిత్, టీవీ5 కెమెరామెన్‌పై దాడిని ఖండిస్తున్నాం. ప్రజా స్వామ్యంలో ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరం. మోహన్ బాబుపై చర్యలు తీసుకోవాలి. చర్యలు తీసుకోకపోతే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తాం. మీడియాపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నాం. ఈ ఘటనపై మీడియా యూనియన్లన్నీ ఏకతాటిపైకి రావాలి. బాధ్యతాయుతమైన మీడియా పై ఇలాంటి ఘటనలు మళ్ళీ పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

## ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక



కమలాపూర్ డిసెంబర్ 11 (వుదయం ప్రతినిధి హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని జై హనుమాన్ ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని కమలాపూర్ మండల ఆటో యూనియన్ సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు యూనియన్ అధ్యక్షులుగా మేడిపల్లి రాజు ఉపాధ్యక్షులుగా 1 మౌటం అశోక్ 2 కొండ రాజు ప్రధాన కార్యదర్శి దుండ్ర రాజు సహాయ కార్యదర్శి ఇనుముల చంద్రమౌళి కోశాధికారిగా జనగాని బిక్షపతి మరియు కార్యవర్గ సభ్యులుగా మౌటం చింటు దాసరి ధనుంజయ్ వీరకుమార్ పెరుమాండ్ల రాజు కొయ్యడ బాబు ఎండి ఆజ్ మియా లను ఎన్నుకున్నారు ఇట్టి కార్యక్రమం యూనియన్ గౌరవ అధ్యక్షులు తక్కలపల్లి సత్యనారాయణ గారి ఆదేశాల మేరకు జరిగినట్టు యూనియన్ నూతన అధ్యక్షులు మేడిపల్లి రాజు తెలిపారు

# గ్రామాభివృద్ధికి ప్రత్యేక కృషి.

### ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి



నాగర్ కర్నూల్ డిసెంబర్ 11(వుదయం ప్రతినిధి) ప్రతి గ్రామంలో బడి నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని బడి గుడి తో పాటు గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు బుధవారం నియోజకవర్గంలోని బిజినేపల్లి మండలం కారుకొండ గ్రామంలో పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు కార్యక్రమానికి హాజరైన ఆయన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ మేరకు హెచ్ సి ఎల్ కంపెనీ సుబ్రహ్మణ్యం పాఠశాల నిర్మాణానికి ముందుకు రావడం జరిగిందని అన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే గుడి బడి తో పాటు రహదారులు విద్యుత్ సమస్య పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి నేరుగా తీసుకురావాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో అధికారులు నాయకులు ప్రజలు ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# అంగన్వాడీ కేంద్రానికి వచ్చే బాలింతలకు పాలు, గుడ్లు కేంద్రంలోనే అందించాలి,

### జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,



నాగర్ కర్నూల్ డిసెంబర్ 11(వుదయం ప్రతినిధి) ఉయ్యాలవాడ లోని అంగన్వాడీ కేంద్రాన్ని బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేసి అంగన్వాడిలో అభ్యసిస్తున్న విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. అంగన్వాడికి వచ్చే విద్యార్థులు ఎంతమంది ఉన్నారు, అంగన్వాడి కేంద్రంలో విద్యార్థుల బరువు, ఎత్తు వివరాలను సైతం అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్లో ఉత్తమ విద్యా బోధన అందుతుందని అంగన్వాడీ పిల్లల సామర్థ్యాలు స్వయంగా పరిశీలించడం జరిగిందని చెప్పారు., అంగన్వాడీ లో చదువుకునే పిల్లలకు అత్యుత్తమ బోధనతో పాటు పౌష్టికాహారాన్ని అందిస్తూ. ప్రభుత్వ పాఠశాలలు విద్యా ప్రమాణాలు మెరుగుకు కృషి చేయాలని అంగన్వాడి సూపర్వైజర్ కు సూచించారు. జిల్లాలోని అన్ని అంగన్వాడి కేంద్రాలను తప్పనిసరిగా ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఖచ్చితంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులను పలుకరించి వారికి అందిస్తున్న భోజన, వసతి సదుపాయాలు, రోజువారీ దినచర్య గురించి ఆరా తీశారు. బాలింతలకు అంగన్వాడి కేంద్రంలోనే పాలు, ఉడకబెట్టిన గుడ్లును అందిస్తున్నారా లేదా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు.

కలెక్టర్ వెంట నాగర్ కర్నూల్ ఆర్ ఐ అబిద్ అలీ , అధికారులు తదితరులు ఉన్నారు.

## పేకాట స్థావరం పై పోలీసుల దాడి.18300 నగదుతో బైకులు ఆటో స్వాధీనం..



ఎల్కతుర్తి డిసెంబర్ (11 వుదయం ప్రతి నిది) హనంకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న పోలీసులు. వారి వద్ద నుండి 18300/- నగదు,మూడు బైకులు,ఒక ఆటో స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసిన పోలీసులు. సీఐ పులి రమేష్ తెలిపిన వివరాల ప్రకారం. మంగళవారం సాయంత్రం నమ్మదగిన సమాచారం మేరకు ఎస్సై రాజ్ కుమార్ ఎల్కతుర్తి సిబ్బందితో సహా దామెర గ్రామ శివారులో సమ్మక్క గద్దెల దగ్గర ఖాళీ స్థలంలో రైడ్ చేయగా ఏడుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ రెడ్ హ్యాండెడ్గా పట్టు బడ్డారు . ఇద్దరు వ్యక్తులు పరారైనారు. నేర స్థలంలో నగదు 18,300/- రూపాయలు ప్లేయింగ్ కార్డ్స్ ఆరు మొబైల్ ఫోన్స్ మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో ఉండగా వాటిని సీజ్ చేసి ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్కు నిందితులతో పాటుగా తీసుకువచ్చి కేసు నమోదు చేసినామని ఎస్ఐ రాజకుమార్ తెలిపారు. ఇందులో హెడ్ కానిస్టేబుల్ బి. విఠల్రావు, బుచ్చి లింగం, కానిస్టేబుల్ తిరుపతి, రంజిత్, సుమన్, ఎస్ఐ తో రైడ్లో పాల్గొని నిందితులను పట్టుకోవడంలో సహకరించారు.

## గణిత సామర్థ్యాలను వెలికి తీసేందుకే ప్రతిభా పరీక్షలు

### - ఘనంగా జిల్లా స్థాయి గణిత పోటీలు, రాష్ట్ర స్థాయికి ఎంపిక



నిర్మల్ జిల్లా డిసెంబర్11(వుదయం ప్రతినిధి): విద్యార్థుల్లో దాగి ఉన్న గణిత సామర్థ్యాలను, నైపుణ్యాలను వెలికి తీసేందుకే వివిధ ప్రతిభా పరీక్షలను నిర్వహిస్తున్నారని ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ సిద్ధ పద్మ తెలిపారు. ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ గణిత ఫోరం (టిఎమ్ఎఫ్) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని దీక్ష కళాశాలలో జిల్లా స్థాయి గణిత ప్రతిభ పోటీలను నిర్వహించారు. వివిధ మండలాలలో గెలుపొందిన 10వ తరగతి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గంగా ప్రసాద్, రూ. 6750,ఉపాధ్యాయులు శ్రీదేవి రూ. 1500, దీక్ష కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి రూ. 3000/-విలువ గల బహుమతులను అందించారు.

**విజేతలు:**

తెలుగు మీడియంలో జెడ్పిహెచ్ఎస్ కిసాన్ గల్లి విద్యార్థి ఆర్.సరిత, జెడ్పిహెచ్ఎస్ మున్యాల్ విద్యార్థి మానస ద్వితీయ, జడ్.పి. హెచ్.ఎస్ తిమ్మాపూర్ విద్యార్థి యు. నితీష తృతీయ, ఇంగ్లీష్ మీడియంలో

జెడ్పిహెచ్ఎస్ మస్కాపూర్ విద్యార్థి రోహిత్ కుమార్ ప్రథమ , జెడ్పిహెచ్ఎస్ వద్యాల్ విద్యార్థి ఎన్.శృతిక ద్వితీయ, జడ్పిహెచ్ఎస్ మస్కాపూర్ విద్యార్థి హర్షవర్ధన్ తృతీయ,

**రెసిడెన్షియల్ విభాగం:**

సోఫీ నగర్ పాఠశాల విద్యార్థి ఏ.సాహిత్య ప్రథమ, ఎం. సుస్మిత ద్వితీయ, బైంసా పాఠశాల విద్యార్థి పి.శ్వేత తృతీయ బహుమతులు సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో టిఎంఎఫ్ జిల్లాఅధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చట్ల శ్రీనివాస్, మనోహర్ రెడ్డి, కోశాధికారి రమాదేవి, సెక్టోరియల్ అధికారి ప్రవీణ్ కుమార్, దీక్ష కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి, ప్రమోద్ రావు, ఉపాధ్యాయులు తోడిశెట్టి రవికాంత్, పెంట అశోక్, గోపాల్ రెడ్డి, సాయినాథ్, శేఖర్ వర్మ, నాగుల రవి, మమత, రమాదేవి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మానవత్వాన్ని చాటుకున్న

### టౌన్ ఎస్ఐ విజయలక్ష్మి...

భద్రాచలం నియోజకవర్గం డిసెంబర్11(వుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని అంబేద్కర్ సెంటర్లో ప్రధాన రహదారి లో ఒక దగ్గర భారీ గుంతలు ఏర్పడి ప్రయాణికులకుఇబ్బందికరంగా మారింది. చాలా రోజుల నుంచి గుంతలు ఏర్పడి ప్రయాణికులు వాహనాలు గుంతలలో వడి రాకపోకలకు నానా అవస్థలుపడుతున్నారు. ఈ నేపథ్యంలో గుంతలను గమనించిన టౌన్ ఎస్ఐ విజయలక్ష్మి ఎలాగైనా గుంతలను ఎ్రాడి ఎిం చాాలని నిర్ణయించుకున్నారు. తమ సొంత ఖర్చులతో సిమెంట్, గ్రావెల్, ఇసుక, తెప్పించి ఈ రోజు గుంతలను పూడ్పివించారు. వాహనదారుల ఇబ్బందులను గుర్తించి గుంతలను పూడిపించిన ఎస్సై విజయలక్ష్మి స్థానికులు, వాహనదారులుధన్యవాదాలు తెలిపారు. కేవలం డ్యూటీ మాత్రమే కాదని సమాజ సేవ కూడా చేయటం





అలవాటు చేసుకోవాలని పలువురికి సూచనలు చేశారు. రాబోయే రోజుల్లో భద్రాచలం ఆలయంలో జరిగే ఉత్సవాలకు భక్తులు విరివిగా రానున్న నేపథ్యంలో ఈ గుంతలు పురుషోత్తం విశేషం... ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ నలుగురికి ఉపయోగపడే మంచి పనులు చేయటం తనకెంతో ఇష్టమని అందుకే ఇబ్బందులు ఉన్న నేపథ్యంలో గుంతలు పుచ్చడానికి తాను నడుం బిగించినట్లుగా పేర్కొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జయశంకర్ భూపాలపల్లి డిసెంబర్ 11(వుదయం ప్రతినిధి) నేడు మహాదేవపూర్ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం జరుగుతుందని మహాదేవపూర్ విద్యుత్ శాఖ ఏ.ఈ, శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు మహాదేవపూర్ సబ్స్టేషన్ పరిధిలోని మహాదేవపూర్, కాళేశ్వరం, పెద్ద O పేట, సూరారం సబ్స్టేషన్ పరిధిలోని విద్యుత్ సరఫరాకు సంబంధించి 33కేవీ లైను మరమ్మత్తుల దృష్ట్యా ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం జరుగుతుందని తెలిపారు కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు

# విశ్వ భారతి గ్లోబల్ స్కూల్లో ఘనంగా గీతా జయంతి ఉత్సవాలు



యాదాద్రి భువనగిరి/ తుర్కపల్లి : డిసెంబర్11 (వుదయం ప్రతినిధి) :తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామ పరిధిలోని విశ్వ భారతి గ్లోబల్ స్కూల్లో బుధవారం ఘనంగా గీతా జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుడు అప్పల గోపాల శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పాఠశాలను అందంగా ముస్తాబు చేశారు. పిల్లలు శ్రీకృష్ణుని వేషధారణలతో చూపరులను అలరించారు. భగవద్గీత పారాయణం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ సకినాల వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ హిందూ అనేది మతం కాదని అది ధర్మమని, జీవన విధానమని ,గీత విశిష్టతను వివరించారు.

అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతోషి, రాధా ,రాజేశ్వరి ,కల్పన, శైలజ, శిరీష, లావణ్య ,జకియా, విద్యార్థులు పాల్గొన్నారు

# చదువుతున్న గిరిజన విద్యార్థినీ విద్యార్థులకు ఇంగ్లీష్ మరియు గణితంలో...

## గిరిజన సంక్షేమ శాఖ ప్రాథమిక పాఠశాలలు



పినపాక నియోజకవర్గం డిసెంబర్11(వుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలంలోజిపిఎస్ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థినీ విద్యార్థులకు ఇంగ్లీష్ మరియు గణితంలో కనీస సామర్థ్యాలు లేకపోవడం వలన వెనుకబడిపోవడం గమనించానని వారి విద్యను బలోపేతం చేయడానికి ఉద్దీపకం వర్క్ బుక్స్ ను ప్రవేశపెట్టడం జరిగిందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. మంగళవారం రాత్రి బూర్గంపాడు లోని వేపలగడ్డ జిపిఎస్ పాఠశాలను ఆయన సందర్శించి ఉద్దీపకం వరకు బుక్స్ కు సంబంధించిన పాఠ్యాంశాలను విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నది, పిల్లలను అడిగి వారి చేత బోర్డుపై రాయించి ఒక్కొక్క విద్యార్థిని లేపి వర్క్ బుక్ లోని సారాంశాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలందరూ వర్క్ బుక్ లోని అంశాలను అడిగిన ప్రతి ప్రశ్నకు జవాబు చెప్పడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడవ తరగతి నుండి 5వ తరగతి వరకు చదువుతున్న గిరిజన పిల్లలు ఇంగ్లీష్ గణితం చదవడం రాయడంలో వెనుకబడి పోతున్నందున గణితంలో గణిత ప్రాథమిక స్థాయి సంఖ్యల నుండి కూడికలు తీసివేతలు గుణకారాలు బాగా హారాలు వాటికి సంబంధించిన కృత్యాలు మరియు చిత్రాలతో విద్యార్థి పాఠశాలల్లో ఆనందంగా ఆహ్లాదంగా నేర్చుకొనుటకు అనుకూలంగా రూపొందించామని, ఇంగ్లీష్ మీడియంలో రూపొందించిన ఉద్దీపకములు విద్యార్థులు సొంతంగా తామంతట తామే వీటిలోని కృత్యాలు బొమ్మల ఆధారంగా చదువుకొని దానిలోని కృత్యాలను చేసే విధంగా రూపొందించడం జరిగిందని ఆయన అన్నారు. విద్యార్థినీ విద్యార్థులు పాఠశాలల్లో నేర్చుకున్నదే గాక తదుపరి ఇంటి వద్ద ప్రాక్టీస్ చేసుకోవడానికి అనుగుణంగా ఈ వర్క్ బుక్ ను తయారు చేయడం జరిగిందని, సంబంధిత ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా ప్రతిరోజు ఉదయం సాయంత్రం తప్పనిసరిగా దీనిలోని పాఠ్యాంశాలను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించి మరల పిల్లల చేత తోటి పిల్లలకు బోర్డుపై రాయించి చూపెట్టాలని అన్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో చదువుతున్న పిల్లలందరూ ఉద్దీపకం వరకు బుక్స్ లోని ప్రతి చతుర్వేద ప్రక్రియలు అర్థం చేసుకున్నట్లు గ్రహించానని అందుకు సంబంధిత ఉపాధ్యాయులకు అభినందిస్తున్నానని ఆయన తెలుపుతూ మిగతా జిపిఎస్ పాఠశాలల్లో కూడా ఇదే విధంగా విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపెట్టి బోధిస్తే తప్పనిసరిగా ప్రైవేటు ఇంగ్లీష్ కాన్వెంట్ స్కూలుకు దీటుగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో జిపిఎస్ పాఠశాలల్లో గిరిజన విద్య మెరుగుపడుతుందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బద్రు మరియు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై దాడి చేయడం దుర్మార్గం

లింగాల డిసెంబర్11(వుదయం ప్రతినిధి): హైదరాబాద్లో గత మూడు రోజుల నుంచి సినీ నటులు మోహన్ బాబు కుటుంబ సభ్యులలో గొడవ జరుగుతున్న సందర్భం అందరికీ తెలిసిన విషయమే మంగళవారం రాత్రి వారి కుటుంబ సభ్యులు మరీ ఎక్కువగా గొడవ జరుగుతున్న సందర్భంగా విలేకరులు అక్కడికి ప్రశ్నించడానికి వెళ్లడంతో సినీ నటుడు మోహన్ బాబు లీటర్ల పై దాడి చేయడం దుర్మార్గమని లింగాల మండల ప్రెస్ క్లబ్ సభ్యులు శంకర్ నాయక్ గోపి అశోక్ రాజు పాండు తదితరుల విలేకరులు బుధవారం ఒక ప్రెస్ నోట్లో లో ఖండించారు. తెలంగాణ రాష్ట్రంలో విలేకరులపై దురుసుగా దాడులు జరుగుతున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం నిద్దురమని అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి దాడి చేసిన వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని వారు ఖండించారు.

# జర్నలిస్టులపై సినీ నటుడు మోహన్ బాబు దాడి హేయమైన చర్య

జయశంకర్ భూపాలపల్లి డిసెంబర్ 11(వుదయం ప్రతినిధి) జర్నలిస్టులపై సినీ నటుడు మోహన్ బాబు దాడి హేయమైన చర్య అని టీయూడబ్ల్యూజే ఐజేయు భూపాలపల్లి జిల్లా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు క్యాతం సతీష్,సామంతుల శ్యామ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు సినీ నటుడు మంచు మోహన్ బాబు ఇంటి వద్ద చోటు చేసుకున్న ఘటన కవరేజ్ కోసం ఉదయం టీవీ5 జర్నలిస్ట్ పై రాత్రి టీవీ 9 వీడియో జర్నలిస్టు పై మైక్ లాక్కుని మోహన్ బాబు దాడి చేసి కొట్టడం హేయమైన చర్య అని మండిపడ్డారు మీడియా స్వేచ్ఛకు భంగం కలిగేలా వ్యవహరించడం తో పాటు జర్నలిస్టు పై దాడి చేసిన నటుడు మోహన్ బాబు పై కేసులు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలని జర్నలిస్టుల పక్షాన టీయూడబ్ల్యూజే ఐజేయు భూపాలపల్లి జిల్లా కమిటీ తరపున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు

# ఉత్సవ విగ్రహాల కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా



దమ్మపేట డిసెంబర్11(వుదయం ప్రతినిధి): అశ్వారావుపేట(నియోజకవర్గం),దమ్మపేట మండల కేంద్రంలోని శ్రీ సంతాన వేణుగోపాల స్వామి దేవస్థానము నందు జరిగిన ఉత్సవ విగ్రహాల సంప్రోక్షణ కార్యక్రమంలో అశ్వారావుపేట నియోజకవర్గ బి,ఆర్ ,ఎస్, పార్టీ ఇంచార్జీ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మాజీ మెచ్చా నాగేశ్వరరావును శాలువాతో సత్కరించారు. అనంతరం అక్కడ ఉన్న భక్తులందరితో ఆత్మీయంగా మాట్లాడుతూ సమయం గడిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు దారా యుగంధర్,అంకథ ఉమ మహేశ్వరరావు,మండల పార్టీ ఉపాధ్యక్షులు గాజుబోయిన ఏసు బాబు,అబ్దుల్ జిన్నా,పాకనాటి శ్రీను,యార్లగడ్డ శ్రీను,దారా జనార్ధన్,దారా శ్రీను,ఇప్ప శేషాద్రి,రూపా రాంబాబు,తదితరులు ఉన్నారు.

# పేకాట రాయుళ్ల అరెస్టు..

పేకాట రాయుళ్లపై పోలీసుల ఉక్కు పాదం..

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదు.

సిఐ పులి రమేష్..

: నిందితులను చూపుతున్న పోలీసులు.. పరారిలో ఇద్దరు..



ఎల్కతుర్తి డిసెంబర్ 11 ( వుదయం ప్రతి నిది) సమాజంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ చట్ట విరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్న కేటుగాళ్లపై ఎస్సై రాజ్ కుమార్ ఉక్కు పాదం మోపుతున్నారు. ఇటీవలే గంజాయి విక్రయదారులను అరెస్టు చేసి సమాజంలో చెడును కూకటివేళ్లతో తీసివేయడంలో ఎస్సై కృషి పట్ల ప్రజలు హర్షం చేస్తున్నారు. మంగళవారం రోజున నమ్మదగిన సమాచారం మేరకు ఎస్సై తన బృందంతో కలిసి దామెర గ్రామంలో పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. సమ్మక్క గద్దల వద్ద రైడ్ చేయగా తొమ్మిది మందిలో ఇద్దరు పరారయ్యారని సిఐ పులి రమేష్ పేర్కొన్నారు. చిట్టిపల్లి సాయికిరణ్, అంబాల రాజు, అంబాల నిఖిల్, కదారి హరీష్, కల్లూరి శ్రీనివాస్, మాటూరి కిషన్, కదారా అనిల్ ను అరెస్టు చేశామని, ఇల్లందుల పునీందర్, ఓర్సు శ్రీనాథ్ పరారీ లో ఉన్నారని వారి వద్ద నుండి 18300 నగదు ఒక ఆటో ఆరు ఫోన్లు మూడు ద్విచక్ర వాహనాలు, సీజ్ చేసామని తెలిపారు. సీఐ పులి రమేష్ వివరాలు వెల్లడిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన, శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ రైడ్ లో పాల్గొన్న ఎస్సై, హెడ్ కానిస్టేబుల్ విఠలావు మరియు బుచ్చిలింగం, కానిస్టేబుల్ తిరుపతి రంజిత్ సుమన్ లను అభినందించారు.

# ఘనంగా వరల్డ్ టాయిలెట్స్ డే కాంపెయిన్



యాదాద్రి భువనగిరి / తుర్కపల్లి : డిసెంబర్ 11 (వుదయం ప్రతినిధి) :వరల్డ్ టాయిలెట్స్ డే కాంపెయిన్, హ్యూమన్ రైట్స్ డే సందర్భంగా తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామపంచాయతీ లో వ్యక్తిగత మరుగుదొడ్డిని పరిశుభ్రంగా నిర్వహిస్తున్న కుటుంబాలను అడిషనల్ డిఆర్డిఓ గుర్రం సురేష్ ,ఎంపీడీవో ఝాన్సీ లక్ష్మీబాయి లు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరల్డ్ టాయిలెట్స్ డే ను ఉద్దేశించి గ్రామాల్లో ప్రజలందరూ కూడా తమ యొక్క మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, తడి చెత్త ,పొడి చెత్తను వేరువేరుగా గ్రామపంచాయతీ ట్రాక్టర్ కు అందించాలని, ప్రతి ఇంటి బయట ఇంకుడు గుంతను నిర్మించుకోవాలని అన్నారు. తద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని తద్వారా భవిష్యత్తు తరాలకు నీరు అందించిన వారం అవుతామని అన్నారు. గ్రామంలోని ప్రజలందరూ కూడా మన గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకొనుటకు వీధుల్లో ఎక్కడ కూడా చెత్త, నీరు నిలువ ఉండకుండా తమ వంతు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో లింగంపల్లి నరసయ్య ,పంచాయతీ కార్యదర్శి నాగరాజు, కరోబార్ కసిర బోయిన శ్రీశైలం, ఫీల్డ్ అసిస్టెంట్ సుజాత గ్రామస్తులు పాల్గొన్నారు

# కెసిఆర్ ను కలిసిన కట్టా వెంకట్ రెడ్డి





తుంగతుర్తి/ శాలిగౌరారం, డిసెంబర్ 11,(వుదయం ప్రతినిధి): తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని శాలిగౌరారం మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కట్ట వెంకట్ రెడ్డితో పాటు మండల నాయకులు మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ను ఎర్రవల్లిలోని కెసిఆర్ ఫామ్ హౌస్ లో మర్యాదపూర్వకంగ కలిశారు. ఈ సందర్భంగా కెసిఆర్ కట్ట వెంకట్ రెడ్డి, మండల నాయకులను ఘనంగా శాలువాతో సన్మానించారు. అనంతరం తుంగతుర్తి నియోజకవర్గ పార్టీ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పార్టీ ఆదేశాల మేరకు పనిచేసే నాయకులను, కార్యకర్తలను కాపాడుకునే బాధ్యత తమదని, పార్టీ కోసం పనిచేసే వారికి తగిన ప్రాధాన్యత ఉంటుందని,పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో చేసిన పనులను, పథకాలను ప్రజలకు తెలపాలని,నేటి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజలకు తెలపాలని కెసిఆర్ సూచనలు చేశారని కట్ట వెంకట్ రెడ్డి తెలిపారు.

# వరంగల్ నగర అభివృద్దిపై ప్రత్యేక దృష్టి

## ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలి

## నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలి



వరంగల్ నగర అభివృద్ధిపై అధికారులతో సమీక్షించిన రెవెన్యూ, వరంగల్ జిల్లా ఇన్-ఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హనుమకొండ, డిసెంబర్ 11(వుదయం జిల్లా ప్రతినిధి) : వరంగల్ నగర అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మరియు వరంగల్ జిల్లా ఇన్-ఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ జిల్లా పర్యటనలో అక్కడి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అనేక హామీలు ఇచ్చారని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని వరంగల్ నగర అభివృద్ధి పనులను యుద్ధ ప్రతిపాదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ నగర అభివృద్ధిపై బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో వరంగల్ జిల్లా మంత్రులు కొండా సురేఖ, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డిలతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా వరంగల్ నగర అభివృద్ధి, ఐఆర్ఆర్, ఓఆర్ఆర్ , భద్రకాళి చెరువు, విమానాశ్రయం తదితర అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రతి ప్రాజెక్టు కు సంబంధించిన డీపీఆర్ లను త్వరితగతిన తయారు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వరంగల్ నగరంలో నిర్మించే రింగ్ రోడ్డు జాతీయ రహదారులకు కనెక్టివిటీ ఉండేలా చూడాలని, ఈ ప్రాజెక్టుకు భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణను యుద్ధప్రాతిపదికన భద్రకాళి చెరువు శుద్దీకరణపనులను వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రాధాన్యత క్రమంలో పనులను చేపట్టి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ కార్యదర్శి దాన కిశోర్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ శ్రీదేవి, మైనింగ్ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వరంగల్, హన్మకొండ జిల్లాల కలెక్టర్ లు డాక్టర్ సత్య శారదా, పి. ప్రావీణ్య, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మన ఊరు మనం బాగు చేసుకుందాం

## మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న



అలంపూర్ డిసెంబర్ 11 (వుదయం ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పురపాలక సంఘం పరిధిలో 1 వ వార్డు తెలుగుపేట, 11 వ వార్డు గుర్రంతోట ఏరియాలలో బుధవారం ఉదయం 6 గంటలకు మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న 11 వ వార్డు కౌన్సిలర్ ఉప్పరి విజయలక్ష్మి తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ వార్డులలోని ప్రజలను పారిశుధ్యం, మంచి నీటి సరఫరా, వీధిలైట్లు, డ్రైనేజి సమస్యలను గురించి ప్రత్యేకంగా ఆరా తీశారు. వార్డులలో అన్ని చోట్ల శానిటేషన్ సహా అన్ని పనులు సవ్యంగా సాగుతున్నాయని ప్రజలు చైర్మన్ కి తెలిపారు.

తెలుగుపేట ఏరియాలో రెడ్డి కమ్యూనిటీ హాల్ వెనుక మాత్రం రోడ్డు లేక వర్షాలు వచ్చినప్పుడు మోకాళ్ళ లోతు వర్షపు నీరు ఆగి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అలాగే తెలుగుపేట ఏరియాకు మంచినీళ్లు గత వారం రోజులుగా రావడం లేదని వార్డు యువకులు చైర్మన్ దృష్టికి తేగా నేడు మిషన్ భగీరథ పైప్ లీకేజ్ వల్ల నీళ్లు రావని ముందుగానే సమాచారం కూడా ఇవ్వడం జరిగిందని,

రేపటినుండి యధావిధిగా నీళ్లు వస్తాయని తెలుగుపేటకు ఎందుకు నీళ్లు రావడం లేదని మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ కి ఫోన్ చేసి వివరాలు తెలుసుకుని ఇవాళ లేదా రేపటిలోగా సమస్య పరిష్కారం అయ్యేలా చొరవ తీసుకోవాలని సూచించారు. 11 వ వార్డులో ఈనెల 3 తేదీన భూమి పూజ చేసిన సీసీ రోడ్డు పనులు ఇంకా ప్రారంభం కాకపోవడం తో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో కౌన్సిలర్ ఉప్పరి విజయలక్ష్మి, బి ఆర్ ఎస్ నాయకులు తెలుగు నరేంద్ర, మున్సిపల్ ఇంచార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ రంగన్న, వాటర్ లైన్ మెన్ నర్సింహులు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, జవాన్లు, ఎలక్ట్రీషియన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# హృదయపూర్వక ఆత్మవిశ్వాసంతో కూడిన విద్య

గజ్వేల్, డిసెంబర్11(వుదయం ప్రతినిధి): ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, సిద్ధిపేటలో హార్ట్‌ఫుల్‌నెస్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ వారి 3 రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం మొదటి రోజు ట్రైనర్ నగేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ద్యానం, ఆత్మవిశ్వాసం గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హిమబిందు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ పంచాయతీ కార్యదర్శి జాదవ్ మాధవ్ కు సన్మానం

దుబ్బాక, డిసెంబర్11(వుదయం ప్రతినిధి): మద్దూరు మండలం రేబర్తి గ్రామపంచాయతీ కార్యదర్శి జాదవ్ మాధవ్ సిద్దిపేట జిల్లా ఉత్తమ గ్రామపంచాయతీ కార్యదర్శిగా ఎన్నిక అయ్యి కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకోన్నారు. ఈ సందర్భంగా బుధవారం రేబర్తి గ్రామస్తులు, గ్రామపంచాయతీ సిబ్బంది జాదవ్ మాధవ్ కు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసి ఉత్తమ గ్రామ పంచాయతీగా చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.

# మహా పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే

సంగారెడ్డి, డిసెంబర్11(వుదయం ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా హత్నూర మండల కేంద్రంలోని అతి పురాతన శ్రీ దత్తాత్రేయ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సనాతన హైందవ వైదిక ధర్మ పరిరక్షణ కోసం మహా పాదయాత్ర నిర్వహించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయధర్మకర్త, పురోహితులు, సభాపతి శర్మ ఆధ్వర్యంలో పాదయాత్రను ఎమ్మెల్యే మంగళహారతులతో పాదయాత్రను ప్రారంభించారు.

# సైన్స్ తోనే మానవుని మనుగడ

- విద్యార్థుల మేద శక్తికి ప్రదర్శన సైన్స్ ప్రదర్శనలు దోహదపడతాయి,
- విద్యార్థుల ప్రదర్శనను తిలకించి అభినందించిన కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే
- జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించిన కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే,
- నాగర్ కర్నూలు జిల్లాను దేశస్థాయిలో ఇనుమడింపజేయాలి,
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,
- నాగర్ కర్నూల్ జిల్లా విద్యార్థులు దేశ ప్రతిష్టను పెంచేలా శాస్త్రవేత్తలుగా రూపొందాలి,
- నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ రాజేష్ రెడ్డి,



నాగర్ కర్నూల్ డిసెంబర్ 11(వుదయం ప్రతినిధి) సైన్స్ తోనే మానవుడి మనుగడ ముడిపడి ఉందని, విద్యార్థులు కొత్త ఆవిష్కరణలను రూపొందించి నాగర్ కర్నూలు జిల్లా ప్రతిష్టను దేశ స్థాయిలో ఇనుమడింపజేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ రాజేష్ రెడ్డి లు విద్యార్థులకు సూచించారు. జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలు 2024 కార్యక్రమాన్ని పురస్కరించుకుని బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, సభాధ్యక్షులుగా నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ రాజేష్ రెడ్డిలు పాల్గొన్నారు.మొదటగా విశ్వశాంతి హైస్కూల్ చారగొండ విద్యార్థులు సుస్వాగత గీతాన్ని ప్రదర్శించగా. కల్వకుర్తి కేజీబీవి, లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిర్వహించిన నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే, డీఈవో, ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ.... యావత్తు మానవ మనుగడ సైన్స్ తో ముడిపడి ఉందని, మానవునికి ఎదుగుదలకు సైన్సు అత్యంత కీలకమని కలెక్టర్ తెలిపారు. పూర్వపు రోజుల్లో రవాణా సౌకర్యానికి ఎంతో కష్ట నష్టాలు ఉండేవని, ప్రస్తుత కాలంలో ప్రపంచ దేశాలను చుట్టి వచ్చేలా అత్యాధునిక పద్ధతుల్లో రవాణా సౌకర్యాలు అభివృద్ధి చెందాయని అందుకు ప్రధాన కారణం సైన్స్ అని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి సైన్స్ లో ప్రయోగాలు, నూతన ఆవిష్కరణ లు రూపొందించే దిశగా ఎదగాలని సూచించారు. విద్యార్థి జీవితంలో సమయము ను సద్వినియోగం చేసుకున్న వాళ్లే విజేతలుగా నిలుస్తారన్నారు. విద్యతోపాటు, లోతైన పరిశోధనలపై దృష్టి సారించాలని సూచించారు.విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలు ఆలోచింపజేసేవిగా ఉన్నాయని కొనియాడారు. విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.విద్యార్థులు జిల్లా ప్రతిష్టను దేశస్థాయిలో రాణించేలా, జిల్లా నుండి భావిశాస్త్రవేత్తలు గా ఎదగాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటుచేసిన జిల్లా విద్యాశాఖాధికారి, విద్యాశాఖ సిబ్బందికి సైన్స్ ఉపాధ్యాయులకు కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. అన్ని పాఠశాలల విద్యార్థులు సైన్స్ ప్రదర్శనలను తిలకించేలా అధికారులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ..... ప్రతి వ్యక్తి మెదడు సైన్స్ తోనే అనుసంధానం అయి ఉంటుందని తెలిపారు. తను కూడా సైన్స్ విద్యార్థి నని ఒక డాక్టర్ గా సైన్స్ విలువ సమాజంలో ప్రాముఖ్యత తనకు తెలుసు నని ఈ సందర్భంగా చెప్పారు. జిల్లా ప్రతిష్టను ప్రపంచ స్థాయిలో రాణించే దిశగా శాస్త్రవేత్తలు తయారు కావాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా కోరారు. విద్యార్థులు విద్యతో పాటు వివిధ రంగాల్లో రాణించాలన్నారు. నేటి బాలలే భావిభారత శాస్త్రవేత్తలని,అదిశగా విద్యార్థుల ఆలోచనలు ఉండేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని శాసనసభ్యులు డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు నాగర్ కర్నూల్ డిఇఓ రమేష్ కుమార్ మాట్లాడుతూ.... మానవ మనుగడకు ముడిపడి ఉన్న సైన్సును విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు జిల్లాస్థాయి విజ్ఞాన ప్రదర్శనలు ఇంతగానో తోడ్పడతాయన్నారు. విద్యార్థులు ఎంతోమంది శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకొని భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలని డీఈఓ ఆకాంక్షించారు.అనంతరం ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు రూపొందించిన ప్రదర్శన గదులను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ రాజేష్ రెడ్డి డిఇఓ రమేష్ కుమార్ ప్రారంభించి విద్యార్థుల రూపొందించిన ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించి ప్రదర్శనల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన చారగొండ విశ్వశాంతి హై స్కూల్ విద్యార్థులు, కల్వకుర్తి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థులు, లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల విద్యార్థుల నృత్యాలను తిలకించి విద్యార్థులను ప్రత్యేకంగా కలెక్టర్, ఎమ్మెల్యే, డీఈవో అభినందించారు.జిల్లావ్యాప్తంగా 400 పాఠశాలల నుండి 512 ప్రదర్శనలను విద్యార్థుల రూపొందించారు. మూడు రోజులపాటు నిర్వహించే జిల్లా స్థాయి ప్రదర్శనలను జిల్లాలోని విద్యార్థులందరూ తిలకించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా ఉపాధ్యాయుడు గుడిపల్లి నిరంజన్ వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్ రావు, నోడల్ అధికారి కురుమయ్య, ఏసీ రాజశేఖర్ రావు, జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, జిల్లాలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ సైన్స్ బయోసైన్స్ ఉపాధ్యాయులు, గైడ్ టీచర్లు 1500 మంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వగురు మహాత్మ బసవేశ్వరుని పై అనుచిత వాక్యాలు సరి కావు

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు టౌన్ డిసెంబర్11(వుదయం ప్రతినిధి): విశ్వగురు మహాత్మ బసవేశ్వరుని పై అనుచిత వాక్యాలు సరి కావులి కర్ణాటక ఎమ్మెల్యేను బర్త్ ఆఫ్ చేయా – వీరశైవ లింగాయత్ సమాజం కార్యనిర్వాహక అధ్యక్షులు అన్మిశెట్టి జయప్రకాష్ విశ్వగురు మహాత్మా బసవేశ్వరునిపై అనుచిత వాక్యాలు చేసిన కర్ణాటక బీజాపూర్ ఎమ్మెల్యే బసవన్న గౌడ ను తక్షణమే బర్త్ రఫ్ చేయాలని సదాశివపేట వీరశైవ లింగాయత్ సమాజం కార్యనిర్వహక అధ్యక్షులు అన్మిశెట్టి జయప్రకాష్ కోరారు, ఒక సందర్భంలో బసవన్న గౌడ్ మాట్లాడుతూ బసవేశ్వరుడు నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని అపోహలు సృష్టించాడు, ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఏమైనా చర్య అని వారిని వెంటనే భర్త చేయాలని లేకుంటే ఆయన పేరులో ఉన్న బసవన్న గౌడ పేరు ను మార్చుకోవాలని డిమాండ్ చేశారు,12వ శతాబ్దంలోని విశ్వ గురువు మహాత్మ బసవేశ్వరుడు సమ సమాజ స్థాపనకై కృషి చేసినటువంటి వ్యక్తి, కాయకమై కైలాసం,స్త్రీ సమాన హక్కు, కుల మతాలకు అతీతంగా అందరిని కలుపుకుని పోయారు, అలాంటి మహోన్నతమైనటువంటి వ్యక్తిని బీజాపూర్ శాసనసభ్యులు విమర్శించడం సరికాదని వారిని వెంటనే బర్త్ రఫ్ చేయాలని కోరారు, తెలంగాణ వీరశైవ లింగాయతులు అందరూ దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు,

# ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జిగా గణేష్ నియామకం



బెల్లంపల్లి, డిసెంబరు11 (వుదయం ప్రతినిధి) ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగా ఆదేశాల మేరకు ఎంఆర్పీఎస్ తాండూర్ మండల ఇంచార్జి గా అయిల్లా గణేష్ ను నియమించడం జరిగిందని రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్ మాదిగ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు . ఈ సందర్భంగా మండల ఇంచార్జి గణేష్ మాట్లాడుతూ. తనపై నమ్మకంతో ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జి పదవి ఇచ్చిన మందకృష్ణ మాదిగ, జిల్లా జిల్లా అధ్యక్షుడు చెన్నూరు సమ్మయ్యకు కృతజ్ఞతలు తెలిపారు . నియోజకవర్గ, జిల్లా కమిటీ ఆదేశాల మేరకు పనిచేస్తూ మాదిగ సోదరుల కష్టనష్టాల్లో పాల్గొని వారికి అండగా ఉంటు ఏబీసీడీ వర్గీకరణకు తన వంతు కృషి చేస్తానని అన్నారు.కొద్ది రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో నూతన ఎమ్మార్పీఎస్ కమిటీలు వేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

# రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తాం

## వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ్ కుమార్



కల్వకుర్తి డిసెంబర్ 11 (వుద యం ప్రతినిధి) రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ యాదవ్ పేర్కొన్నారు బుధవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ సాధారణ పాలక మండలి సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పాటుపడుతుందని రైతులు రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అందుకు అనుగుణంగా వ్యవసాయ మార్కెట్ ను అన్ని విధాల రైతులకు సౌకర్యాలు చేకూర్చే విధంగా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు అనంతరం మార్కెట్ కమిటీ అధికారులు చైర్మన్,వైస్ చైర్మన్, డైరెక్టర్ లకు శాలువాలతో ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ వావిళ్ళ ఉమా మనీలా సంజీవ్ కుమార్ యాదవ్,వైస్ చైర్మన్ పండిత్ రావు, ., డైరెక్టర్లు రమ కాంత్ , దాచేపల్లి శ్రీనివాస్, రాజశేఖర్, కేశముల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇండ్లు సర్వేదీఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్





జగిత్యాల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 11( వుదయం ): రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన జగిత్యాల జిల్లాలోని వివిధ 18 మండలములలో మరియు 5 మున్సిపాలిటీ గత సంవత్సరం ప్రజాపాలన కార్యక్రమంలో ఇండ్లు లేని వారు దరఖాస్తులు 2,02011 రెండు లక్షల రెండు వేయి ల పదకొండు దరఖాస్తులను సర్వే బుధవారం రోజున జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ జగిత్యాల జిల్లాలో ధరూర్ అర్బన్ లోని 9 మరియు 23 వార్డులలో తాటి పెల్లి కథలాపూర్ మండలం సిరికొండ లోని సర్వేని తనిఖీ చేసి సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా అర్హులైన వారిని గుర్తించాలని పకడ్బందీగా గ్రామపంచాయతీలో వారిగా పంచాయతీ సెక్రెటరీ లను మున్సిపాలిటీ వార్డ్ ఆఫీసర్ల ద్వారా ప్రభుత్వం రూపొందించిన మొబైల్ యాప్ ద్వారా సర్వే నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు.జిల్లా కలెక్టర్ శ్రీ సత్యప్రసాద్ ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద జిల్లాలో సర్వేను పూర్తి చేసేందుకు ఈ పథకం ద్వారా, అర్హత గల కుటుంబాలకు ఇల్లు కల్పించే లక్ష్యంతో, సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఇ రాజేశ్వరరావు జగిత్యాల ఆర్డిఓ మధుసూదన్ కోరుట్ల ఆర్డిఓ జివాకర్ జగిత్యాల మునిసిపల్ కమిషనర్ చిరంజీవి కోరుట్ల మునిసిపల్ కమిషనర్ తిరుపతి ఎమ్మార్వో ఎంపీడీవో సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# క్లాత్ షోరూం ను ప్రారంభించిన పరకాల ఏసీపీ.!



పరకాల, డిసెంబర్ 11(వుదయం విలేకరి) : పరకాల పట్టణ కేంద్రంలో బాంబే క్లాత్ షో రూమ్ ను ప్రారంభించిన పరకాల ఏసీపీ చిర్రా సతీష్ బాబు,ఈ సందర్భంగా క్లాత్ స్టోర్ యజమాని మాట్లాడుతూ పరకాల ప్రజలకు సరసమైన ధరలకు కాటన్ షార్టింగ్ క్లాత్ లు అందిస్తున్నామని అన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న పరకాల సీఐ క్రాంతికుమార్,పరకాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొయ్యడా శ్రీనివాస్,ఒంటెరు శ్రవణ్, శ్యామ్ ప్రసాద్,నగేష్,దుప్పటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజాసమస్యలపై సిపిఎం పార్టీ సర్వే..



బయ్యారం డిసెంబర్11(వుదయం ప్రతినిధి): రాష్ట్ర సిపిఎం పార్టీ పిలుపు మేరక బయ్యారం ఒకటో వార్డు నుండి ప్రజా సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ఇంటికి సర్వే చేపట్టడం జరిగింది. ఈ సర్వేలో అర్హులైన వారికి ఇండ్ల నిర్మాణం, పింఛన్ సౌకర్యం డ్రైనేజీ,రోడ్లు వేపియ్యడం, విద్యుత్తు దీపాలు లేకపోవడం సమస్యలు వారి ప్రజల నుండి అడిగి తెలుసుకోవడం జరిగింది. భూమి కలిగి ఉన్నటువంటి రైతులకు నేటికీ పట్టా పాస్ బుక్ రాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కళ్యాణ లక్ష్మి వంటీ సమస్యలను కూడా సర్వే బృందం వారు గుర్తించారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి ఆరు గ్యారంటీ లను తక్షణమే అమలు చేయాలని వారు ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండా రాజన్న, నంబూరు మధు, వల్లాల వెంకన్న ఎస్కే యకుబ్,పురుషోత్తం,మోహన్,రాము తదితరులు పాల్గొన్నారు.

# రోటిగూడ లో అంగరంగ వైభవంగా గీతా జయంతి ఉత్సవాలు





జన్నారం,డిసెంబర్ 11(వుదయం విలేకరి) జన్నారం మండలంలోని రోటిగూడా గ్రామంలో గల గీతాశ్రమంలో గీతా జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఆలయ 50వ వార్షికోత్సవం ను పురస్కరించుకొని ఆలయ ప్రధాన పూజారి శ్రీహరి మౌన స్వామి ఆధ్వర్యంలో బుధవారం రోజున యజ్ఞ హెూమాలు, కుంకుమార్చనలు వేద పండితులు ఘనంగా నిర్వహించారు.ఇందులో భాగంగా భార్యాభర్తలైన దంపతులతో హెూమగుండాల వద్ద యజ్ఞ హెూమాలు చేయించారు. ఈ ఉత్సవాలకు ఇతర జిల్లాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అనంతరం అన్నదానం చేశారు. దీంతో గీతా ఆశ్రమంలో పూర్తిగా ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు కొంతం శంకరయ్య,ఉప్పు శేఖర్,కొమరవెల్లి లాలయ్య,కొత్త శ్రీనివాస్,పూజారి శ్రీ కోటి జలంధర్,మాజీ సర్పంచ్ మల్కా విజయ లక్ష్మణ్,భక్తులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలపై ఆటో డ్రైవర్లకు అవగాహన

జనగామ, డిసెంబర్11(వుదయం ప్రతినిధి): పాలకుర్తి మండలంలోని ఆటో డ్రైవర్లకు ఎస్సై దూలం పవన్ కుమార్ పోలీస్ స్టేషన్ లో బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని, రాంగ్ రూట్లో ఆటోలు నడపవద్దని చెప్పారు. అలాగే డ్రైవర్లు అందరూ లైసెన్స్, ఇన్సూరెన్స్ వాహన పత్రాలు కలిగి ఉండాలన్నారు.

# క్రీడా ప్రతిభను వెలికితీయడం కోసమే సీఎం కప్

హుస్నాబాద్, డిసెంబర్11(వుదయం ప్రతినిధి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మినీ స్టేడియంలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయని, గ్రామీణ యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీయడం కోసమే ప్రభుత్వం సీఎం కప్ పేరిట క్రీడా పోటీలు నిర్వహిస్తున్నదన్నారు.

# జప్తి నాచారం లో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ ఆధ్వర్యంలో సర్వే



కొండపాక డిసెంబర్11(వుదయం ప్రతినిధి): పేదప్రజలకు స్వంతింటిని అందజేయాలనే మంచి ఆలోచనతో ఉన్న తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా బుధవారం రోజు మండల పరిధిని లోని జప్తి నాచారం గ్రామం లో పంచాయితీ కార్యదర్శి రాణి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎం వజ్రవ్వ, వి సవిత, సిహెచ్ రమేష్, ఎం కిషన్, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ రవీందర్ గౌడ్ తో కలిసి ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్లకొండ రవీందర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదలు, బడుగు,బలహీన వర్గాల పార్టీ అన్నారు, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడితే ప్రతి పేదవాడికి సొంతింటి కలను నెరవేర్చుతామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఇపుడు అమలు చేయడానికి కార్యాచరణ రూపొందిస్తున్నారు. మాట నిలబెట్టుకునే క్రమంలో కాంగ్రెస్ పార్టీ వేస్తున్న అడుగులు చూస్తుంటే ప్రతిపక్షాలకు మింగుడు పడడం లేదనీ, అందుకే కాంగ్రెస్ పార్టీ పైన విమర్శలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పబ్బోజు వీరబ్రహ్మం, సుభాష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు, తదితరు పాల్గొన్నారు

# ఆన్‌లైన్ ట్రేడింగ్ కు కుటుంబం బలి

## భార్య భర్త ఇద్దరు పిల్లలు ఆత్మహత్య
## అప్పుల్లో కూరుకుపోయి తీవ్ర నిర్ణయం
## మంచిర్యాలలో దారుణ ఘటన



బెల్లంపల్లి, డిసెంబరు11 (వుదయం ప్రతినిధి) తాండూర్ మండలం కాసిపేట గ్రామానికి చెందిన తన మేనల్లుడు సముద్రాల శివ ప్రసాద్ ఆన్లైన్ ట్రేడింగ్ చేస్తూ నష్టాలు రావడంతో అప్పులు తీర్చలేక శివ ప్రసాద్ తన కుటుంబ సభ్యులు అయిన సముద్రాల మొండయ్య, తల్లి శ్రీదేవి,అక్క చైతన్య అందరూ కలిసి మంగళవారం ఉదయం క్రిమిసంహారక గడ్డి మందు సేవించగా వారందరు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళ, బుధవారాల్లో మృతి చెందడం జరిగిందని మృతుల బంధువు కోలేటి రమేష్ పిర్యాదు చేయడం జరిగిందని తాండూర్ ఎస్ ఐ కిరణ్ కుమార్ తెలిపారు. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి చేరుకొని తాండూర్ సిఐ కుమారస్వామి కేసు దర్యాప్తును పరిశీలించారు. మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం కాసిపేట గ్రామానికి చెందిన సముద్రాల మొండయ్య (50) కిరణ కొట్టు నడుపుతూ పాల ప్యాకెట్లు అమ్ముతూ జీవనం సాగించేవాడు. ఆయనికి భార్య శ్రీదేవి(44) ఒక కూతురు చైతన్య (30) కుమారుడు శివ ప్రసాద్ (26) ఉన్నారు. కొడుకు శివ ప్రసాద్ ఆన్ లైన్ ట్రేడింగ్ చేస్తూ అందులో నష్టాలు రావడంతో తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక ఈ నెల 10న మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు నలుగురు క్రిమిసంహారక గడ్డి మందు సేవించారు. మందు సేవించిన అనంతరం సముద్రాల శ్రీదేవి సిపేటలో ఉండే తన తమ్ముడు కోలేటి రమేష్కు ఫోన్ చేసి తామంతా గడ్డి మందు తాగినట్లు తెలపడంతో108లో బెల్లంపల్లి ఆసుపత్రిలో ప్రతమ చికిత్స అనంతరం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేరగా మెరుగైన వైద్యం కోసం వైద్యులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో జాయిన్ చేసి చికిత్స పొందారు. మంగళవారం చికిత్స పొందుతూ సముద్రాల మొండయ్య, కూతురు చైతన్య మృతి చెందగా బుధవారం శ్రీదేవి, శివ ప్రసాద్ చికిత్స పొందుతూ మృతి చెందారు. మాయదారి ఆన్లైన్ ట్రేడింగ్ కు కుటుంబం మొత్తం బలిఅయిందని ప్రజలు కన్నీటి పర్యంతమయ్యారు.

## రెండు రోజుల వ్యవధిలో భార్య, తండ్రి మృతి



%మెదక్, ( 2024 డిసెంబర్ 11 వుదయం ప్రతినిధి : సోమవారం రోజు నార్సింగిలో కారు ఢీకొన్న ఘటనలో భర్త ముందే భార్య మృతి చెందిన సంఘటన తెలిసిన విషయమే... బుధవారం మూడవరోజు చనిపోయిన లక్ష్మి కార్యక్రమం నిర్వహించి బంధువులు అందరూ స్నానం కోసం క్యాసంపల్లి చెరువులోకి వెళ్లారు. స్నానానికి వెళ్లిన దుర్గయ్య(మృతురాలి మామయ్య) తిరిగి రాకపోవడంతో బంధువులు చెరువులో వెతకగా చనిపోయి ఉన్నాడు. మొన్న భార్య, నిన్న తండ్రి మృతిచెందడంతో నాగులు కుటుంబంలో, నార్సింగి లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది.

## కర్మక్రియలకు హాజరైన ఎమ్మెల్యే పులివర్తినాని, చల్లా బాబు.



యర్రావారిపాళెం, డిసెంబరు 11 (వుదయం ప్రతినిది): మండలం లోని ఉస్తికాయలపెంట పంచాయతీ, ఉస్తికాయలపెంట గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు బాబు తల్లి ఆకుల నాగేశ్వరమ్మ కర్మక్రియలకు హాజరైన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని,చల్లా బాబు స్థానిక నాయకులతో కలిసి ఆకుల నాగేశ్వరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## శాసనసభ్యుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



నిజాంసాగర్, డిసెంబర్ 11 (వుదయం ప్రతినిధి): మర్రి చెన్నారెడ్డి మానవ హక్కుల విభాగంలో రెండు జరిగే శాసనసభ శాసనమండలి సభ్యుల శిక్షణ కార్యక్రమంలో జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పాల్గొన్నారు. మానవ హక్కుల విభాగం లో శాసనమండలి సభ్యులు మరియు శాసనసభ సభ్యులకు రెండు రోజులపాటు ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగన ఉందని ఎమ్మెల్యే వుదయం దినపత్రికతో ప్రత్యేకంగా తెలిపారు.

## నూతన అధ్యక్షుడిని శాలువాతో సత్కరించిన యూనియన్ గౌరవ అధ్యక్షులు సత్యనారాయణ రావ్



%కమలాపూర్ డిసెంబర్ 11 (వుదయం ప్రతినిధి) కమలాపూర్ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నికైన మేడిపల్లి రాజు మరియు కమిటీ సభ్యులను శాలువా కప్పి సత్కరించిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులు తక్కలపల్లి సత్యనారాయణ రావు బస్టాండ్ ప్రాంగణంలో బుధవారం సాయంత్రం యూనియన్ సభ్యుల సమక్షంలో నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా సత్యనారాయణ రావు మాట్లాడుతూ ఆటో కార్మికులకు ఎలాంటి అవసరం వచ్చిన తనకు వెంటనే తెలియజేయాలని ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మౌటం అశోక్ జనగాని బిక్షపతి దుండ్ర రాజు తౌటం తిరుపతి సర్వేషం అవునూరి తిరుపతి సత్యనారాయణ విరకుమార్ దుండ్ర బాబు తదితరులు పాల్గొన్నారు

## గీతా జయంతి వేడుకలు భగవద్గీత పుస్తకావిష్కరణ.

### విద్యార్థులకు భగవద్గీత పుస్తకాల వితరణ.



నర్సంపేట డిసెంబర్11(వుదయం ప్రతినిధి): నర్సంపేట పట్టణంలోని మదర్స్ ల్యాండ్ హైస్కూల్ లో గీతా జయంతి భగవద్గీత జన్మదినోత్స వేడుకలు తిరుమల తిరుపతి దేవస్థానము హిందూ ధర్మ ప్రచార పరిషత్ మరియు వికాస తరంగిని సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థుల మధ్య భగవద్గీత గ్రంథావిష్కరణ బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో తొలుత పాఠశాల కరస్పాండె%శీ%ట్ పాశికంటి నవిత, రమేష్, ధర్మాచార్య బాధ్యులు రంగనాధ స్వామి, వికాస తరంగిని బాధ్యులు మహిళలు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని 7,8,9, తరగతి విధ్యార్థుల మధ్య ప్రారంభం చేశారు. నవిత మాట్లాడుతూ విద్యార్థులకు గీత జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రంగనాధస్వామి మాట్లాడుతూ తిరుమల తిరుపతి వారి భగవద్గీత పుస్తకాలు విద్యార్థి దశలోనే మనస్సుకు తెలియాలని అవతార పురుషులు అపుడప్పుడు పుడతారు వారు చేపట్టే కార్యాలు సమసమాజ ఉద్దారనకే వారే పరమహ%శీ%స పరివ్రాజకులు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి వారు 116 అడుగుల సమతామూర్తిని అట్లాగే 108 దివ్యదేశాల ప్రతిష్ట శంషాబాధ ముంచింతల్ లో ఏర్పటు చేసి ఎన్నో దార్మిక కార్యక్రమాలు చేపడుతున్నారని ఆ బాటలోనే విద్యార్థులు, పెద్దలు వెళ్లాలని, హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా తిరుమల తిరుపతి వారి భగవద్గీత గ్రంథము విద్యార్థులదరికి ఇస్తున్నామని ఆయన చెప్పారు. వీటి బాధ్యులు శ్రీధర్ యతిపతి మాట్లాడుతూ ధర్మాన్ని పెంపొ%శీ%ది%శీ%చాడానికి, చిన్న సమస్య వచ్చినా గానీ, భగవద్గీత శ్లోకాలు పటిస్తే మనశాంతి కలుగుతందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిని బాధ్యులు కోటా శ్రీనివాస్, చంద్రశేఖర్, పంచమర్తి, సరిత, బండారి కవిత, వద్దే శ్రీలక్ష్మి, దాస్యం రూపావతి, పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు గోగినేని శ్రీనివాస్ అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్ 2 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు : జిల్లా ఎస్పీ



%మెదక్, ( 2024 డిసెంబర్ 11 వుదయం ప్రతినిధి : మెదక్ జిల్లా ఎస్.పి. డి.ఉదయ్ కుమార్ రెడ్డి, జిల్లా అదనపు ఎన్.పి ఎస్.మహేందర్, మెదక్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కె.ఉస్సేన్ ఆద్వర్యంలో బుధవారం జిల్లా పోలీస్ ప్రదాన కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ బోర్డ్ నియమావళి మేరకు పరీక్ష కేంద్రాల చీఫ్ సూపర్డెంట్ లకు, అబ్జర్వర్లకు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లకు, గ్రూప్–%××% రాత పరీక్ష బయోమెట్రిక్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. జిల్లా ఎస్.పి. డి.ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... ఈ నెల 15,16న నిర్వహించబోయే గ్రూప్–%××% రాత పరీక్ష బయోమెట్రిక్ పై శిషణ కార్యాక్రమం నిర్వహించడం జరిగింది. రాత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గుర్తింపు కొరకు బయోమెట్రిక్ పద్దతిలో వేలిముద్రలు తీసుకోవడం జరుగుతుందని, ఇందుకు వీలుగా అభ్యర్థులు పరీక్ష సమయానికి ఒక గంట ముందుగానే (ఉదయం 9 గంటలకు) పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, ఉదయం 9 గంటల నుండి అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించడం జరుగుతుందని సూచించారు. పరీక్షకు సంబంధించిన నిబంధనలు పూర్తిగా హాల్ టికెట్లో పొందపరచి ఉంటాయని, అభ్యర్థులు ఒకటికి రెండుసార్లు హాల్ టికెట్ లోని నిబంధనలు చదువుకోవడం మర్చిపోవద్దని, పరీక్ష హాలు లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్, ఇతర వస్తువులకు అనుమతి ఉండదని, చేతులకు గోరింటాకు, మెహంది వంటివి పెట్టుకోవడం వలన బయోమెట్రిక్ లో వేలిముద్రలు సరిగ్గా వచ్చే అవకాశం ఉండదని, తద్వారా అభ్యర్థులు నష్టపోయే అవకాశం ఉంటుందని, ఈ విషయాన్ని గ్రహించి పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గోరింటాకు, మెహంది, వంటివి పెట్టుకోరాదని సూచించారు. అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్ష కేంద్రంలోనికి అనుమతించరనీ, సెల్ ఫోన్లు, వాచ్ లు (చేతి గడియారాలు) ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు మొదలగునవి ఎవరు తీసుకురాకూడదని తెలిపారు. పరీక్షకు సంబంధించిన నిబంధనలు కచ్చితంగా అమలు చేయబడతాయని తెలిపారు. ఎంపిక విధానం పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని అభ్యర్థులు గుర్తించాలని, ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించే మోసగాళ్లను ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దని సూచించారు. బయోమెట్రిక్ ఉపయోగించి పూర్తి పారదర్శకంగా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకటికి రెండుసార్లు పరీక్ష కేంద్రాలను సందర్శించాలని తెలిపారు. జిల్లాలో మెదక్ పట్టణంలో 10, మంబోజీపల్లి గీత స్కూల్ లో 01, నర్సాపూర్ లో 03, తూప్రాన్ లో 02 మొత్తం 16 పరీక్షా కేంద్రలు 5856 మంది అభ్యర్థులు ఉన్నారని పరీక్షా కేంద్రల చుట్టూ 360 డిగ్రీలలో బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మెయిన్ గేట్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోనికి అభ్యర్థులు చీఫ్ సూపర్డెంట్ లకు, అబ్జర్వర్లకు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లకు,మరియు ఇన్విజిలేటర్లకు మాత్రమే అనుమతి ఉందని తెలిపారు. ఈ రాత పరీక్ష పూర్తిగా రీజినల్ కో–ఆర్డినేటర్ మెదక్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ డా.కె.ఉస్సేన్, నోడల్ ఆఫీసర్ జిల్లా అదనపు ఎస్.పి ఎస్.మహేందర్, (పి బి ఓ) పోలీస్ బయోమెట్రిక్ ఆఫీసర్ మధుసూదన్ గౌడ్ సి.ఐ డి.సి.ఆర్.బి, బయోమెట్రిక్ సాంకేతిక నిపుణులు అనిల్ కుమార్, మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. ఎవరికి ఎలాంటి సందేహాలు ఉన్నా వారి దృష్టికి తీసుకువచ్చి వారి సందేహాలు నివృత్తి చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్.పి ఎస్.మహేందర్, మెదక్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కె.హుస్సేన్, డి.సి.ఆర్.బి సి.ఐ. మధు సూదన్ గౌడ్, చీఫ్ సూపర్ండెంట్లు, అబ్జర్వర్లు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

## మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు

మిర్యాలగూడ, డిసెంబర్11(వుదయం ప్రతినిధి): ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా నార్కెట్‌పల్లి మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ఈ నెల 11, 12 తేదీలలో మండలంలోని బి వెల్లెంల జడ్పీఎచ్ఎస్ లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పీడీ శంభులింగం బుధవారం తెలిపారు. పోటీలలో పాల్గొనదలచిన వారు సొంత గ్రామం నుండి టీంను తీసుకునిరావాలని, ఇందుకు సంబంధించి ఆధార్ కార్డు, వయసు ధృవీకరణ పత్రాలతో రావాలన్నారు.

## సీఎం కప్ క్రీడా పోటీలు విజయవంతం చేయాలి



సంగెం డిసెంబర్11(వుదయం ప్రతినిధి): గ్రామస్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్పు క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంఈఓ గుగులోతు రాము, పిడిపి శ్రీధర్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలలో భాగంగా పురుషుల మహిళల విభాగంలో క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుంది. కావున క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ గుగులోతు రాము, పి.డి.పి శ్రీధర్, టీడీ ముఖర్జీ, టిడిపి శ్రీనివాస్ పిడి రతన్ సింగ్ రాథోడ్, పిడి రవీందర్, పాల్గొని క్రీడ పోటీలను ప్రారంభించారు. ఫైనల్ క్రీడకు ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేష్ మండల కాంగ్రెస్ యువజన నాయకులు రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందని విద్యార్థులు పాఠశాలలో క్రీడ ఉపాధ్యాయులతో నిత్యం క్రీడలను నేర్చుకోవడం వలన మండల స్థాయి నుండి, డివిజన్ స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని మంచి భవిష్యత్తును పొందవచ్చు అని, మంచి పేరు తెచ్చే విధంగా ఆటలా పోటీలలో పథకాలను సాధించి దేశం గర్వపడేలా యువతి యువకులు సన్మార్గంలో నడుచుకొని పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని అన్నారు.

ఈ పోటీలలో పురుషుల విభాగంలో లోహిత ప్రథమ స్థానం ఎల్ ఎల్ తండా, ద్వితీయ స్థానం పొందినారు. మహిళ విభాగంలో ప్రథమ స్థానం లోహిత, ద్వితీయ స్థానం మొండ్రాయి గ్రామం పొందినారు. ఈ కార్యక్రమంలో పిఈటి శిరీష, పద్మ మండల కబడ్డీ ప్రెసిడెంట్ ఏలియా, పాఠశాల ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మూర్ లో దొంగల బీభత్సం

బోధన్, డిసెంబర్11(వుదయం ప్రతినిధి): ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో దొంగలు హల్చల్ చేశారు. దొండి మెడికల్ హాల్ లో ఐదు లక్షల రూపాయలు, కేర్ మెడికల్ హాల్ లో 40000 రూపాయలు, స్కానింగ్ సెంటర్లో ఒక టీవీ ఒక లక్ష రూపాయలు నగదు అపహరించినట్లు బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్మూర్ ఎస్ హెచ్ ఓ పి. సత్యనారాయణ గౌడ్ తెలియజేశారు.

## నిజాంసాగర్ లో దొరికిన మృతదేహం గుర్తించిన కుటుంబీకులు



నిజాంసాగర్, అక్టోబర్ 11 (వుదయం ప్రతినిధి): ఈనెల 10 మంగళవారం నిజాంసాగర్ ప్రాజెక్టులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతుని వద్ద ఇలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించి ఆచూకీ కొరకు ఎదురు చూశారు. ఈ నేపథ్యంలో బుధవారం మృతుడు మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ గా విధులు నిర్వహించే పద్మశాలి కులానికి చెందిన పండ్యాల శివప్రసాద్45) గా గుర్తించారు. ఈ మేరకు మృతుని భార్య ఫిర్యాదు మేరకు నిజాంసాగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాష్ట్ర స్థాయి గణిత పోటీలకు ఎంపికైన విద్యార్థులపై అభినందనలు



పెద్దపల్లి జిల్లా: డిసెంబర్ 11(వుదయం) ప్రతినిధి:మల్యాల శ్రీరాంపూర్ మండలంలోని మోడల్ స్కూల్ %ఽ% కాలేజీకి చెందిన 10వ తరగతి విద్యార్థులు ఆర్. సహస్రవర్షిణి, జి. వేదప్రియ జిల్లా గణిత ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణిత పోటీ పరీక్షల్లో రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల మండల విద్యాధికారి మహేష్ అభినందనలు తెలిపారు. మహేష్ మాట్లాడుతూ, ఈ విజయంతో విద్యార్థులు వారి ప్రతిభను మరోసారి చాటారని, ముందున్న పోటీల్లో కూడా ఉత్తమ ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయానికి తోడ్పడిన ప్రిన్సిపాల్ ఎల్. సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అనుముల పోచయ్య (పీజీటీ – మ్యాథ్స్), మరియు ఉపాధ్యాయుల కృషిని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, స్నేహితులు, పాఠశాల సిబ్బంది ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేస్తూ, ఈ విజయం మరింత విద్యార్థులను ప్రేరేపించాలనే ఆశాభావం వ్యక్తం చేశారు.

## సమగ్ర శిక్షా ఉద్యోగులు తపస్ మద్దతు



మెదక్, ( 2024 డిసెంబర్ 11 వుదయం ప్రతినిధి : మెదక్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ప్రాంగణంలో రెండవ రోజు సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె కొనసాగిస్తున్నారు. ఉద్యోగుల సమ్మెకు బుధవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ... సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని వారు అన్నారు. వెంటనే వారిని రెగ్యులరైజ్ చేసి మినిమం పే స్కేల్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటస్వామి, నాగేశ్వరరావు, మెదక్ జిల్లా ఎస్ఎస్సి ల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రాజు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## మీడియా పై దాడి చేసిన మోహన్ బాబు ని వెంటనే ఆరెస్ట్ చేయాలి.. జర్నలిస్టు సంఘం



అశ్వరావుపేట డిసెంబర్11(వుదయం ప్రతినిధి): సినీ నటుడు మంచు మోహన్ బాబు జర్నలిస్టులపై చేసిన దాడిని ఖండిస్తూ అశ్వారావుపేట రింగ్ రోడ్డు సెంటర్లో జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో పట్టణంలో నిరసన ర్యాలీ చెయ్యడం జరిగింది. జర్నలిస్టుల పట్ల దారుణంగా ప్రవర్తించిన ప్రముఖ సినీ నటుడు మోహన్ బాబు ను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అయ్యప్ప మాలలో ఉన్న మీడియా ప్రతినిధితపై దాడి చేయడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా నాయకులు సలీం సంఘీభావం తెలిపారు ఈ కార్యక్రమంలో అశ్వరావుపేటలోని జర్నలిస్ట్ సంఘాలు ప్రజా సంఘాలు పాల్గొన్నారు

## దేవరకొండలో ఉచిత మెగా వైద్య శిబిరం

దేవరకొండ, డిసెంబర్11(వుదయం ప్రతినిధి): దేవరకొండలోని వాసవి కళ్యాణ మండపంలో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ ఆధ్వర్యంలో నీలా రవికుమార్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు వస్కుల సత్యనారాయణ బుధవారం తెలిపారు. ఉ. 9 గంటల నుంచి మ. 2 గంటల వరకు జరగనున్న ఈ శిబిరంలో హైదరాబాద్ యశోద ఆసుపత్రి ప్రముఖ వైద్యులతో అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





# బిజినెస్






## 34కి.మీ మైలేజీ ఇచ్చే కారుకు EMI ఎంత?

ఈ కారును కొనుగోలు చేయాలనుకుంటే, పూర్తి మొత్తాన్ని చెల్లించే బదులు, మీరు ఫైనాన్స్ కూడా చేయవచ్చు. దీని కోసం మీరు డౌన్ పేమెంట్, ఈఎంఐ గణనను అర్థం చేసుకోవాలి. మారుతి సుజుకి వ్యాగన్ఆర్ సిఎన్జి. మారుతి సుజుకి కార్లు సామాన్యులకు సైతం అందుబాటు ధరల్లో ఉంటాయి. మంచి మైలేజీని కూడా ఇస్తాయి. ఇండియన్ మార్కెట్లో బాగా ఇష్టపడే ఈ కార్లలో విభిన్న మోడల్స్ ఉన్నాయి. ఈ కార్లలో ఒకటి మారుతి సుజుకి వ్యాగన్ఆర్. కంపెనీ ఈ కారు CNG వెర్షన్ను కూడా విక్రయిస్తుంది. మీరు ఈ కారును కొనుగోలు చేయాలనుకుంటే, పూర్తి మొత్తాన్ని చెల్లించే బదులు, మీరు ఫైనాన్స్ కూడా చేయవచ్చు. దీని కోసం మీరు డౌన్ పేమెంట్, ఈఎంఐ గణనను అర్థం చేసుకోవాలి. మారుతి సుజుకి వ్యాగన్ఆర్ సిఎన్జి బేస్ మోడల్ ఎల్ఎక్స్ఐ దీని ఆన్-రోడ్ ధర ఢిల్లీలో రూ. 6 లక్షల 45 వేలు. నగరాలను బట్టి ఈ ధర మారవచ్చు. దీని బేస్ మోడల్ను కొనుగోలు చేయడానికి మీరు రూ. 1 లక్ష డౌన్ పేమెంట్ చెల్లించాలి. ఈ కారును కొనుగోలు చేయడానికి, మీరు 9.8 శాతం వడ్డీ రేటుతో 5 సంవత్సరాల పాటు బ్యాంక్ లేదా ఫైనాన్స్ కంపెనీ నుండి రుణం తీసుకుంటే, మీకు రూ. 5.45 లక్షల వరకు రుణం లభిస్తుంది. ఇప్పుడు మీరు బ్యాంక్ లేదా కంపెనీ తీసుకున్న ఈ లోన్ని EMI రూపంలో తిరిగి చెల్లించాలి. మీరు 5 సంవత్సరాల పాటు వడ్డీ రేటుతో సహా మొత్తం రూ.6.91 లక్షలు బ్యాంకుకు చెల్లించాలి. ఈ రుణాన్ని తిరిగి చెల్లించడానికి మీరు ప్రతి నెలా రూ. 11,000 EMI చెల్లించాలి. రుణం, వడ్డీ రేటు మీ క్రెడిట్ స్కోర్పై ఆధారపడి ఉంటుందని తెలుసుకోవడం ముఖ్యం.

## 5 నెలల వ్యాలిడిటీ, 320G B డేటాతో బీఎస్ఎన్ఎల్ చౌకైన రీఛార్జ్ ప్లాన్!

బీఎస్ఎన్ఎల్ చాలా చౌక రీఛార్జ్ ప్లాన్లను అందిస్తుంది. ఇది కాకుండా, కంపెనీ అనేక చౌక రీఛార్జ్లను కలిగి ఉంది. మీరు వాటిని సద్వినియోగం చేసుకోవచ్చు. ప్రైవేట్ కంపెనీలు తమ రీఛార్జ్ ప్లాన్ల ధరలను పెంచడంతో ప్రజలు BSNL వైపు మొగ్గు చూపుతున్నారు. అటువంటి పరిస్థితిలో చాలా మంది కస్టమర్లు తమ నంబర్లను ప్రభుత్వ యాజమాన్యంలోని టెలికాం సంస్థ BSNL కి పోర్ట్ చేస్తున్నారు. బీఎస్ఎన్ఎల్ చాలా చౌకైన రీఛార్జ్ ప్లాన్లను అందజేయడమే దీనికి కారణం. ఈ సిరీస్లో బీఎస్ఎన్ఎల్ 5 నెలల చెల్లుబాటుతో కొత్త, చాలా చౌక రీఛార్జ్ ప్లాన్ను ప్రారంభించింది. ఇది ఇతర టెలికాం కంపెనీల కంటే చాలా చౌకగా ఉంటుంది.

ప్రైవేట్ కంపెనీలు తమ రీఛార్జ్ ప్లాన్ల ధరలను పెంచడంతో ప్రజలు BSNL వైపు మొగ్గు చూపుతున్నారు. అటువంటి పరిస్థితిలో చాలా మంది కస్టమర్లు తమ నంబర్లను ప్రభుత్వ యాజమాన్యంలోని టెలికాం సంస్థ BSNL కి పోర్ట్




చేస్తున్నారు. బీఎస్ఎన్ఎల్ చాలా చౌకైన రీఛార్జ్ ప్లాన్లను అందజేయడమే దీనికి కారణం. ఈ సిరీస్లో బీఎస్ఎన్ఎల్ 5 నెలల చెల్లుబాటుతో కొత్త, చాలా చౌక రీఛార్జ్ ప్లాన్ను ప్రారంభించింది.

ఇది ఇతర టెలికాం కంపెనీల కంటే చాలా చౌకగా ఉంటుంది. ఈ ప్లాన్ని యాక్టివేట్ చేయడానికి కస్టమర్ రూ.997 వెచ్చించాల్సి ఉంటుంది. ఇది కస్టమర్కు 160 రోజులు (5 నెలలు) చెల్లుబాటును ఇస్తుంది. ఇది కాకుండా, రోజుకు 2GB హై-స్పీడ్ డేటా అందుబాటులో ఉంటుంది అంతకాకుండా ఇది 160 రోజుల్లో మొత్తం 320GB డేటా లభిస్తుంది. రోజువారీ 100 ఉచిత SMS, అపరిమిత వాయిస్ కాలింగ్ సౌకర్యం అందుబాటులో ఉంది. రూ. 997 ఈ గొప్ప బీఎస్ఎన్ఎల్ రీఛార్జ్ ప్లాన్లో కస్టమర్ ఆల్ ఇండియా ఫ్రీ రోమింగ్, జింగ్ మ్యూజిక్ BSNL ట్యూన్స్, హార్డీ గేమ్స్, ఛాలెంజర్ అరేనా గేమ్స్, గేమ్ఆన్ ఆస్ట్రోటెల్ వంటి అనేక సేవలను పొందుతారు. బీఎస్ఎన్ఎల్ కొత్త రూ. 997 రీఛార్జ్ ప్లాన్ దీర్ఘ కాల వ్యాలిడిటీ, చౌక డేటా, కాలింగ్ సేవలను కోరుకునే కస్టమర్లకు గొప్ప ఆప్షన్ అనే చెప్పాలి. ఈ ప్లాన్లో వినియోగదారులు ఎక్కువ కాలం చెల్లుబాటు పొందుతారు. అలాగే డేటా ప్రయోజనం కూడా పొందుతారు. ఇతర కంపెనీలతో పోలిస్తే బీఎస్ఎన్ఎల్ ఈ ప్లాన్ ఉత్తమమైనది. బీఎస్ఎన్ఎల్ చాలా చౌక రీఛార్జ్ ప్లాన్లను అందిస్తుంది. ఇది కాకుండా, కంపెనీ అనేక చౌక రీఛార్జ్లను కలిగి ఉంది.




## ఆయుష్మాన్ కార్డుల కోసం భారీగా దరఖాస్తులు

ఉద్యోగం, వ్యాపారాల నుంచి రిటైర్ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకునే సీనియర్ సిటిజన్లందరూ ఎదుర్కొనే పెద్ద సమస్య అనారోగ్యం. వివిధ రకాల వ్యాధులు, అనారోగ్య సమస్యలు ఎప్పుడూ దాడి చేస్తుంటాయి. వారికి వచ్చే పింఛన్లు, ఇతర ఆదాయంలో ఎక్కువ భాగం ఆస్పత్రిలో వైద్య ఖర్చులకు సరిపోతాయి. ఇక పేదవారి సంగతి అయితే చెప్పనవసరం లేదు. వైద్యం చేయించుకోవడానికి డబ్బులు సరిపోక తీవ్ర అవస్థలు పడతారు. ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీ పీఎం జేఏవై)లో రూ.5 లక్షల వరకూ ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. దీనికోసం 70 ఏళ్ల దాటిన వారందరూ ఆయుష్మాన్ వే వందన కార్డును తీసుకోవాలి. ఈ కార్డును ప్రారంభించిన రెండు నెలలలోపే 25 లక్షల మంది నమోదు చేసుకున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2024 అక్టోబర్ 29వ తేదీన ఆయుష్మాన్ వే వందన కార్డును ప్రారంభించారు. అనంతరం రెండు నెలల్లోనే దాదాపు 25 లక్షల మంది ఈ కార్డు తీసుకున్నారు. దీని ద్వారా 70 ఏళ్లు, అంత కంటే ఎక్కువ వయసున్న సీనియర్ సిటిజన్లందరికీ వారి ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకుండా రూ.5 లక్షల వరకూ ఉచితం వైద్యం అందిస్తారు. గతంలోనే ఈ పథకం అమల్లో ఉంది. దాని ద్వారా కుటుంబానికి రూ.5 లక్షల విలువైన వైద్యం అందించేవారు. కుటుంబంలోని సభ్యులందరికీ ఇది వర్తించేది. ఇప్పుడు ఆ కుటుంబాల్లోని సీనియర్ సిటిజన్లకు ప్రత్యేకంగా రూ.5 లక్షల వైద్య సాయం అందించేందుకు ఈ పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. సీనియర్ సిటిజన్ల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా దీన్ని అమలు చేస్తున్నారు. ప్రపంచంలోని అతి పెద్ద ఆరోగ్య పథకంగా పీఎంజేఏవైని చెప్పవచ్చు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2018 సెప్టెంబర్ 23న జార్ఖండ్ లో దీన్ని ప్రారంభించారు. దీని ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల వరకూ ఆరోగ్య బీమా కవరేజీ అందుతుంది. పేదలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం దీన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకం ద్వారా నగదు రహిత చికిత్సలు అందుతాయి. మందులు, చికిత్స రుసుము, డాక్టర్ ఫీజు, ఓటీ-ఐసీయూ ఫీజులు దీనిలోనే ఉంటాయి. సాధారణంగా కుటుంబంలో తల్లిదండ్రులు, పిల్లలు, పెద్దవారు ఉంటారు. వీరిలో పెద్దవారికి ఆరోగ్య సమస్యలు ఎక్కువగా ఉంటాయి.

## బ్యాంకులకు ఆర్బీఐ సూచనలు

దేశంలో ప్రతి ఒక్కరికీ బ్యాంకు ఖాతా తప్పనిసరిగా ఉండాలి. ఇటీవల కాలంలో టెక్నాలజీ విపరీతంగా పెరిగింది. అన్ని పనులు ఆన్ లైన్ లో సులువుగా జరిగిపోతున్నాయి. ముఖ్యంగా బ్యాంకు లావాదేవీలను ఇంటి నుంచే చాలా వేగంగా చేసుకునే వీలు కలిగింది. ప్రస్తుతం ప్రభుత్వ పథకాలు పొందాలన్నా, ఆర్థిక లావాదేవీలు చేయాలన్నా బ్యాంకు ఖాతా చాలా అవసరం. చాలా మంది తమ అవసరాల కోసం బ్యాంకు ఖాతాలను ప్రారంభిస్తారు. ఒకటి, రెండు స్లారు లావాదేవీలు జరిపి వదిలేస్తారు. ఇక వాటిని పట్టించుకోవడంతో డియాక్టివ్ అయిపోతాయి. అయితే ఈ డియాక్టివ్ నిబంధనలలో మార్పులు రానున్నాయి. రిజర్వ్ బ్యాంకు ఇండియా (ఆర్బీఐ) సూచనలు, సలహాల మేరకు బ్యాంకులు తమ కార్యకలాపాలు జరుపుతాయి. వడ్డీ రేట్ల విధింపు, డిపాజిట్ల సేకరణ తదితర విషయాన్ని ఆ నిబంధనలకు అనుగుణంగా ఉంటాయి. బ్యాంకుల నిబంధనల్లో వచ్చే మార్పులకు ఆర్బీఐ నిర్ణయాలే ఆధారమవుతాయి. ఈ నేపథ్యంలో బ్యాంకు ఖాతాల డియాక్టివేషన్ కు సంబంధించి ప్రస్తుత నిబంధనలను మార్చాలని కోరుతూ ఆర్బీఐకి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిఫారసులు చేసింది. బ్యాలెన్స్ విచారణ తదితర ఆర్థికేతర కార్యకలాపాలు సైతం ఖ్షాతాను యాక్టివేట్ గా ఉంచడానికి సరిపోయేలా పరిగణించాలని కోరింది.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్ సీఎస్ శెట్టి ఇటీవల మాట్లాడుతూ ప్రభుత్వం సహాయం కోసం ఖాతాను తెరిచే వారిలో చాలామంది పరిమితంగానే ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నారన్నారు. ఖాతాను ప్రారంభించిన తర్వాత కొన్నిసార్లు మాత్రమే నిధులను ఉపసంహరించుకుంటారన్నారు. నిర్ణీత కాలంలో లావాదేవీలు జరగకపోవడం వల్ల ఈ ఖాతాలు డీయాక్టివ్ అవుతున్నాయన్నారు. దీని వల్ల పలు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. ఆర్థిక లావాదేవీలు జరగకపోయినా ఆర్థికేతర చర్యలు అంటే ఖాతా తనిఖీ వంటివి జరుగుతుంటే వాటిని కొనసాగించాలన్నారు. ఈ మేరకు నిబంధరలను మార్పు చేయాలని ఆర్బీఐని కోరారు. ఎస్బీఐ సిఫారసులను రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా పరిగణనలోకి తీసుకుంది. ఈ మేరకు బ్యాంకులన్నింటికీ ఆదేశాలు జారీ చేసింది. స్తంభింపజేసిన ఖాతాలను సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరింది. దీంతో బ్యాంకులన్నీ ఆ మేరకు చర్యలు తీసుకున్నాయి. ఎస్బీఐ కూడా వెంటనే రంగంలోకి దిగింది. అయితే ఇలాంటి డియాక్టివ్ ఖాతాలు ఎన్ని ఉన్నాయో స్పష్టంగా తెలపలేదు. ఎక్కువ కాలం పాటు ఆర్థిక లావాదేవీలు జరగని ఖాతాలను క్రియారహిత ఖాతాలు ఉంటారు. కొందరు కస్టమర్లు తమ ఖాతాలను పట్టించుకోకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుంది. బ్యాంకు నిబంధనల ప్రకారం కొంతకాలానికి ఇవి డియాక్టివ్ అవుతాయి. అనంతరం వాటిలో ఉన్న నగదును తీసుకునే, జమ చేసుకునే అవకాశం ఖాతాదారులకు ఉండదు. వీటిపై ప్రస్తుతం ఆర్బీఐ కొత్తగా చర్యలు తీసుకోనుంది.

## గూగుల్ యూజర్లకు గుడ్ న్యూస్.. అందుబాటులోకి ఏఐ పవర్డ్ ఫీచర్లు

ప్రస్తుతం ఏ విషయం గురించి తెలుసుకోవాలన్నా గూగుల్ లో సెర్చ్ చేయడం అందరికీ అలవాటు. గుండుసూది నుంచి అంతరిక్షం వరకూ అన్ని అంశాలు దానిలో ఉంటాయి. చేతిలో సెల్ ఫోన్ ఉంటే చాలు ప్రపంచ మంతా దగ్గర ఉన్నట్టే. గూగుల్ కూడా కస్టమర్లకు మెరుగైన సేవలు అందించేందుకు అనేక అప్ డేట్లు చేస్తుంది. దీనిలో భాగంగా ఆండ్రాయిడ్ పరికరాల కోసం ఆర్టిఫీషియల్ పవర్డ్ ఫీచర్ల కొత్త సెట్ ను ప్రారంభించింది. ఆండ్రాయిడ్ 15 పరికరాలన్నింటికీ దీన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. గూగుల్ తెలిపిన వివరాల ప్రకారం కొత్త సెట్ ఏఐ ఫీచర్లు వినియోగదారులకు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. వీటిలో ఆడియో క్యాప్షన్లు, ఇమేజ్ వివరణలు, కొత్త స్టిక్కర్ కాంబో తదితర వాటిని ప్రవేశపెట్టారు. అలాగే గూగుల్ ఫిక్సెల్ స్మార్ట్ ఫోన్ల కోసం ప్రత్యేకంగా అదనపు ఫీచర్లను విడుదల చేశారు. ఇవన్ని రాబోయే కొన్ని వారాల్లో అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నారు. గూగుల్ కొత్త ఏఐ ఫీచర్ల ప్రత్యేకతలను తెలుసుకుందాం.

ఎక్స్ప్రెసివ్ క్యాప్షన్ ఫీచర్ లో భాగంగా మీకు క్యాప్షన్ పంపిన వారి భావోద్వేగాన్ని తెలుసుకోవచ్చు.




వాల్యూమ్,టోన్, పదాల కంటే శబ్దాలపై ఎక్కువ శ్రద్ధ పెడుతుంది. క్యాప్షన్లలో గుసగుసలు, చీర్స్, చప్పట్లు అన్ని తెలుస్తాయి. అంధులు, తక్కువ కంటి చూపు ఉన్నవారి కోసం ఇమేజ్ క్యూఅండ్ఏ ఇన్ లుక్ అవుట్ అనే ఫీచర్ చాలా ఉపయోగపడుతుంది. మీ పరిసరాల గురించిన సమాచారాన్ని మీకు అందిస్తుంది. ఈ యాప్ ద్వారా ఒక ఫొటోను తీసి అప్ లోడ్ చేయండి. దాని గురించి వివరాలు మీకు బిగ్గరగా పైకి చెబుతుంది. ఎమోజీ కిచెన్ అనే ఫీచర్ తో మీకు కావాల్సిన ఎమోజీలను రూపొందించుకునే వీలుంటుంది. దీని ద్వారా రెండు ఎమోజీలను కలిపి ఓ ప్రత్యేకమైన స్టిక్కర్ గా మార్చుకోవచ్చు. ఇది ఆపిల్ లోని జెన్మోజీని పోలి ఉంటుంది. కానీ అది ఇంకా అందుబాటులోకి రాలేదు. ఎమోజీ కిచెన్ మాత్రం అందరికీ అందుబాటులో ఉంది. క్యూఆర్ కోడ్ ఫీచర్ తో ఫొటోలు, వీడియోలు, పత్రాలను వేరొకరికి పంపడం మరింత సులభంగా, సురక్షితంగా ఉంటుంది. ముందుగా మీరు పంపాలనుకున్న మీడియా ఫైల్ ను ఎంపిక చేసుకోవాలి. క్యూఆర్ కోడ్ ను నొక్కాలి. సురక్షిత బదిలీ కోసం ఇతరులను స్కాన్ చేయాలి. గూగుల్ డిస్క్ ఫీచర్ ద్వారా మెరుగైన స్కాన్ సేవలు పొందవచ్చు. రశీదులు, పత్రాలు, గుర్తింపు కార్డులను సరైన కాంట్రాస్ట్, వైట్ బ్యాలెన్స్ తో మాన్యువల్ ఎడిటింగ్ లేకుండా సేవ్ చేసుకోవచ్చు. వాటిని ఫొటో తీసిన వెంటనే ఈ ఫీచర్ ద్వారా డిజిటల్ వెర్షన్ లో సేవ్ అవుతాయి.

## ఒక్క అక్షరంతో రెండు కంపెనీల మధ్య వివాదం

మహీంద్రా ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ లిమిటెడ్ నుంచి విడుదల కానున్న ఎలక్ట్రిక్ కారు పేరు మారింది. మహీంద్రా బీఈ 6ఈ పేరుతో లాంచింగ్ సమయంలో ఈ కారును విడుదల చేశారు. ఈ పేరుపై ప్రముఖ విమానాయాన సంస్థ ఇండిగో అభ్యంతరం తెలిపిన విషయం తెలిసిందే. దీంతో పేరులో స్వల్పంగా మార్పు చేయాలని మహీంద్రా నిర్ణయించింది. ఇక నుంచి బీఈ 6గా పిలవనుంది. ఇండిగా అభ్యంతరాల నేపథ్యంలో ఈ అనే అక్షరాన్ని తొలగించింది. ఒక్క చిన్న అక్షరంతో రెండు దిగ్గజ కంపెనీల మధ్య వివాదం రేగింది. మహీంద్రా కంపెనీ ఇటీవల ఈవీ విభాగంలో బీఈ 6ఈ అనే మోడల్ కారును ఆవిష్కరించింది. 2025 ఫిబ్రవరిలో మార్కెట్ లోకి విడుదల చేసేందుకు ప్రణాళిక రూపొందించింది. అయితే 6ఈ అనే పేరుపై ఇండిగో సంస్థ అభ్యంతరం వ్యక్తం చేసింది. తాము 6ఈ బ్రాండింగ్ ను ఇప్పటికే వివిధ సేవల్లో వినియోగిస్తున్నామని తెలిపింది. విమాన సర్వీసులతో పాటు 6ఈ ఫ్లెక్స్, 6ఈ లింక్, 6ఈ ప్రైమ్ తదితర వాటిని అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపింది. ఈ నేపథ్యంలో మహీంద్రా కంపెన తన కారు 6ఈ పేరు పెట్టడాన్ని ఖండించింది. వివాదం కోర్టు వరకూ వెళ్లడంతో మహీంద్రా కంపెనీ తన కారు పేరు మార్చడానికి నిర్ణయం తీసుకుంది. తన కారులోని ఈ అనే పేరును తొలగించింది. ఇండిగో నిరాధర ఆరోపణలు చేస్తోందని, దీనిపై కోర్టులో తమ పోరాటం ొనసాగుతుందని వెల్లడించింది. తమ ఖాతాదారులకు మెరుగైన ఉత్పత్తులను పరిచయం చేయడం, మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని తెలిపింది.మహీంద్రా కంపెనీ ప్రతినిధులు ఈ



విషయంపై స్పష్టమైన వివరణ ఇచ్చారు. ఇండిగో సంస్థ వాడుతున్నబ్రాండింగ్ 6ఈ అని, తమ కొత్త కారు పేరు బీఈ 6ఈ అని వివరణ ఇచ్చారు. తాము కేవలం 6ఈ అనే పేరును మాత్రమే వాడడం లేదని, దానికి ముందు బీఈ కూడా ఉందని తెలిపారు. కాబట్టి ఈ పేర్ల మధ్య తేడాలు ఉన్నాయన్నారు. ఏది ఏమైనా ఇండిగో విమానయాన సంస్థ అభ్యంతర నడుమ తన కారు పేరును స్వల్పంగా మార్పు చేయాలని మహీంద్రా కంపెనీ నిర్ణయించుకుంది. ఈ కారు విడుదల ముందే వివాదంలో చిక్కుకోవడంతో ఈ చర్యలు తీసుకుంది.

కేవలం ఒక్క ఈ అనే చిన్న అక్షరం రెండు పెద్ద కంపెనీల మధ్య వివాదానికి కారణమైంది.

# జాతీయం – అంతర్జాతీయం



## జార్ఖండ్ సిఎం హేమంత్ సోరేన్‌తో బృందాకరత్ భేటీ

రాంఛి : జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్‌తో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ భేటీ అయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మతతత్వ శక్తులను ఓడించి లౌకిక శక్తులు ఘన విజయం సాధించిన సందర్భంగా హేమత్ సోరేన్‌కు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. మర్యాదపూర్వకంగా జరిగిన ఈ భేటీలో బృందాకరత్‌తో పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్ విప్లవ్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రఫుల్ లిండా, సమీర్ దాస్, సంజయ్ పాశ్వన్ కూడా పాల్గొన్నారు. జార్ఖండ్ అసెంబ్లీ స్పీకర్‌గా జెఎంఎం ఎమ్మెల్యే రవీంద్ర నాథ్ మహతో వరుసగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఘనత సాధించిన తొలి నేతగా ఆయన నిలిచారు. సోమవారం నుంచి జార్ఖండ్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ప్రారంభమయ్యాయి. రెండో రోజున సమావేశాల్లో స్పీకర్‌గా మహతో పేరును ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రతిపాదించారు. జెఎంఎం ఎమ్మెల్యే మధుర ప్రసాద్ మహతో బలపర్చారు. సంతాల్ పరగణాల డివిజన్‌లోని నాలా అసెంబ్లీ నుంచి ఇటీవల ఎన్నికల్లో మహతో విజయం సాధించారు. 2005లో తొలిసారిగా ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఆయన 2009 ఎన్నికల్లో మినహా 2014, 2019ల్లోనూ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. గత అసెంబ్లీలోనూ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

## సమాఖ్య స్ఫూర్తితో ఆర్థిక కేటాయింపులు



తిరువనంతపురం : దేశ ఆర్థిక వ్యవస్థను పరిరక్షించే బృహత్తర బాధ్యత 16వ ఆర్థిక సంఘానిదని, అలాంటి బాధ్యతను సమాఖ్య స్ఫూర్తికి విఘాతంగా కలగకుండా నిర్వర్తించాలని కేరళ ఆర్థిక మంత్రి కెఎన్ బాలగోపాల్ విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి సంతృప్తికర తోడ్పాటు ఉంటేనే రాష్ట్రాల ప్రగతి సాధ్యమని ఆయన తెలిపారు. మూడు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా 16వ ఆర్థిక సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ అరవింద్ పనగారియా నేతృత్వంలోని బృందం కేరళలో పర్యటిస్తోంది. తొలి రోజైన మంగళవారం ఆర్థిక సంఘం బృందానికి బాలగోపాల్ సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళకు నిధుల కేటాయింపుల్లో న్యాయం చేయాలని విన్నవించారు. 'కేరళ అభివృద్ధి నమూనా' కింద రాష్ట్రం సాధించిన విజయాలను ఆయన వివరించారు. ఈ విజయాలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో లభించిన పురస్కారాలు, ప్రశంసలు గురించి గుర్తు చేశారు. అయితే మౌలిక వసతుల అభివృద్ధిలో కేరళ సాధించాల్సింది ఇంకా చాలా ఉందని, ఇందుకు కేంద్రం, ఆర్థిక సంఘం సహకరించాలని కోరారు. ముఖ్యంగా ఉన్నత విద్య, పరిశోధన వంటి రంగాల్లో చేయాల్సింది చాలా వుందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని వున్నప్పటికీ ఈ అంతరాలను పూడ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటూనే వుందని చెప్పారు. 10 నుండి 15వ ఆర్థిక సంఘం వరకు కేంద్రం నిధుల్లో కేరళ వాటా తగ్గిపోవడాన్ని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. 10వ ఆర్థిక సంఘంలో 3.88 శాతం వాటా రాగా 15వ ఆర్థిక సంఘం నాటికి అది 1.92 శాతానికి పడిపోయిందన్నారు. పర్యావరణ విపత్తుల వల్ల ఆర్థికంగా ఎన్ని ఎదురు దెబ్బలు రాష్ట్రాభివృద్ధి కోసం కేరళ ప్రభుతవం కృషి చేస్తోందని, ఇందుకు కేంద్రం కూడా చేయూతనందించాలని కోరారు. ప్రకృతి విపత్తుల వేళ ఆర్థికంగా ఆదుకోవాల్సిన కేంద్రం ఆ పని చేయడం లేదన్నారు. 16వ ఆర్థికసంఘంగానైనా కేరళకు ఆర్థిక కేటాయింపులు విషయంలో న్యాయం చేయాలని కోరారు. అభివృద్ధి వికేంద్రీకరణలో కేరళ ఆదర్శనీయమైన కృషి చేస్తోందని తెలిపారు. స్థానిక ప్రభుత్వాలకు నిధులను అందచేయడంలోనూ, వారి కార్యకలాపాలను వికేంద్రీకరించడంలోనూ ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కేరళ ముందుందన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక, ద్రవ్యపరమైన ఆందోళనలను పరిష్కరించాల్సిందిగా కోరారు. అభివృద్ధి ప్రాధాన్యతలను అమలు చేయాల్సిందిగా కోరుతూ 16వ ఆర్థిక సంఘం సభ్యులకు బాలగోపాల్ మెమోరాండాన్ని అందచేశారు.

## విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా యుపిలో నిరసనలు



నోయిడా : ఉత్తరప్రదేశ్‌లో విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసనలు కొనసాగుతున్నాయి. మంగళ వారం నోయిడా, ఘజియాబాద్‌ల్లో 4 వేలకు పైగా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. పూర్వాంచల్ విద్యుత్ విత్రణ్ నిగం లిమిటెడ్ (పియువివిఎన్‌ఎల్), దక్షిణాంచల్ విద్యుత్ విత్రణ్ నిగం లిమిటెడ్ (డివివిఎన్‌ఎల్) అనే రెండు డిస్కంలను ప్రైవేటీకరణకు ఉత్తర ప్రదేశ్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (యుపిపిసిఎల్) అనుమతి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యోగులు ఈ చర్యకు దిగారు. యుపి విద్యుత్ కర్మాచారి సంయుక్త సంఘర్షణ సమితి (వికెఎస్‌ఎస్‌ఎస్) నేతృత్వంలో ఉద్యోగులు నిరసనలు చేపడుతున్నారు. మరో వైపు నిరసనలు అణిచివేయడానికి యుపి ప్రభుత్వం నిరంకుశ చర్యలకు దిగుతుంది. యుపిపిసిఎల్, దాని ఐదు అనుబంధ సంస్థల ఉద్యోగులు ఆరు నెలల పాటు సమ్మెలు చేయకుండా యుపి ప్రభుత్వం నిషేధించింది. ఎసెన్షియల్ సర్వీసెస్ మెయింటెనెన్స్ యాక్ట్ (ఎస్మా) నిబంధనల కింద ఈ నిషేధ ఉత్తర్వులు జారీ చేసింది.

## మానవ హక్కులకు పెనుముప్పు

న్యూఢిల్లీ : మానసిక ఆరోగ్యం, సైబర్ నేరాలు, వాతావరణ మార్పులు వంటి సమస్యలు మానవ హక్కులకు ముప్పుగా మారాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ము పేర్కొన్నారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి మాట్లాడుతూ వృద్ధి చెందుతున్న గిగ్ ఎకానమీతో గిగ్ వర్కర్ల మానసిక ఆర్యోగంపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్న విషయాన్ని వ్యాపారవేత్తలు గ్రహించాలని ఆమె సూచించారు. అలాగే కృత్రిమ మేధస్సు (ఎఐ) వినియోగం గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని కూడా తెలిపారు. మానవ జీవితాలకు ఎఐ వినియోగంతో మంచి, చెడు కూడా జరుగుతుందని చెప్పారు. డిజిటిల్ యుగం అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ బెదిరింపులు, డీప్‌ఫేక్‌లు, గోప్యతా సమస్యలు, నకిలీ సమాచారం వ్యాప్తి వంటి సమస్యలు పెరుగుతున్నాయని చెప్పారు.

## జస్టిస్ యాదవ్ వ్యాఖ్యలపై సుప్రీం ఆరా



న్యూఢిల్లీ : విహెచ్‌పి కార్యక్రమంలో అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలతో నివేదిక అందచేయాలని అలహాబాద్ హైకోర్టును ఆదేశించింది. ఈ నెల 8న విహెచ్‌పి నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ యాదవ్ ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి) సమర్థిస్తూ వ్యాఖ్యానించడంతో పాటు పరోక్షంగా ముస్లింలపై విద్వేష పూరిత వ్యాఖ్యలు చేసినట్లు కథనాలు వెలువడ్డాయి. 'మన పిల్లలకు పుట్టినప్పటి నుంచి దయ, సహనం అలవాటు చేస్తాం. వాళ్లు పిల్లల ముందే జంతువులను వధిస్తారు. అలాంటప్పుడు వారికి దయ, సహనం ఎలా అలవడతాయని' అంటూ ఆయన పేర్కొన్నారు. ఇది హిందూదేశమని, మెజారిటీ ప్రజలు అనుకున్నట్టుగానే భారత్ నడుస్తుందని ఆయన వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

## ఆర్థిక చోదకశక్తిగా చైనా

### ప్రపంచ ఆర్థిక సంస్థల అధినేతల సమావేశంలో జిన్‌పింగ్



బీజింగ్ : ఆర్థికాభివృద్ధి లక్ష్యాలను ఈ ఏడాది కూడా సాధించడం ద్వారా ప్రపంచ ఆర్థికాభివృద్ధికి అతిపెద్ద చోదకశక్తిగా తాము నిలవనున్నామని చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ పేర్కొన్నారు. ప్రధాన అంతర్జాతీయ ఆర్థిక సంస్థల అధినేతలతో మంగళవారం బీజింగ్‌లో నిర్వహించిన '1 ప్లస్ 10' చర్చల సందర్భంగా ఆయన ప్రసంగించారు. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు అధ్యక్షులు దిల్మా రౌసెఫ్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జివివా, ప్రపంచ బ్యాంకు గ్రూప్ అధ్యక్షులు అజరు బంగా, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) డైరెక్టర్ జనరల్ నగోజి ఒకొంజో ఐవెలా సహా పది అగ్రశ్రేణి ప్రపంచ ఆర్థిక సంస్థల అధినేతలు ఏకకాలంలో ఈ చర్చల్లో పాల్గొన్నారు. చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ మూడో ప్లీనరీ సెషన్ దృష్టి సారించిన అంశాలను ఈ సందర్భంగా జిన్‌పింగ్ తెలియజేశారు.

ప్రత్యేకించి చైనా ఇటీవల తీసుకొచ్చిన ప్రధాన విధానపర నిర్ణయాలను ఆయన ప్రస్తావించారు. 40 ఏళ్ల సుస్థిర, పురోగామి అభివృద్ధి అనంతరం చైనా అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో కూడిన అభివృద్ధి సాధించే లక్ష్యాలపై దృష్టి సారించిందన్నారు. ప్రపంచ వాణిజ్య ప్రగతిలో చైనా ఒక్కటే 30 శాతం వాటాతో చోదకశక్తిగా నిలిచిందన్నారు. బయట ప్రపంచానికి చైనా మరింతగా తలుపులు తెరవనుందన్నారు. వాణిజ్య రంగంలో మరిన్ని అవకాశాలు కల్పించి, ఆదాయాలు, లాభాలను ఇతర దేశాలతో కలసి పంచుకోవటానికి ఏమాత్రం వెనుకాడబోమని జిన్‌పింగ్ చెప్పారు. స్థిరమైన, ఆరోగ్యకరమైన, సుస్థిరాభివృద్ధి సాధించే క్రమంలో విభేదాల పరిష్కారానికి అమెరికా ప్రభుత్వంతో అర్థవంతమైన చర్చలకు, సహకార విస్తృతికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇదే తరహాలో చైనాతో కలసి పని చేసేందుకు అమెరికా వైపు నుంచి కూడా కృషి జరగాలని చైనా కోరుకుంటుందన్నారు. వాణిజ్యం, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఆంక్షలు, యుద్ధాలకు తావు లేదని, ఇందులో విజేతలంటూ ఎవ్వరూ ఉండరని చైనా అధినేత ఉద్ఘాటించారు. దశాబ్దకాలంగా తాము దిగ్విజయంగా చేపడుతున్న బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బిఆర్ఐ) పురోగతి గురించి కూడా జిన్‌పింగ్ ప్రస్తావించారు.

## అసాధారణ వేగంతో విస్తరిస్తున్న విశ్వం !

న్యూయార్క్ : విశ్వం ఊహించిన దానికన్నా అసాధారణ వేగంతో విస్తరిస్తోందని వెబ్ టెలిస్కోప్ డేటా ధ్రువీకరించింది. నాసాకు చెందిన జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ రెండేళ్ళపాటు ఇచ్చిన డేటా గతంలో హబుల్ రోదసీ టెలిస్కోప్ ఇచ్చిన డేటాతో సరిపోలుతోంది. విశ్వం విస్తరించే రేటు దాదాపు 8శాతం వేగంగా వుందని గతంలో హబుల్ పేర్కొంది. వందల కోట్ల సంవత్సరాల కాలంలో కాస్మోస్ కాంతి కిరణాల్లో తొలినాటి పరిస్థితులు, తదనంతర కాలంలో పరిణామ క్రమం గురించి ఖగోళ భౌతిక శాస్త్రవేత్తలు తెలుసుకున్న సమాచారం ప్రాతిపదికగా కన్నా చాలా వేగంగా విశ్వం విస్తరిస్తోందని భావించారు. అందుకే ఈ తేడాను హబుల్ టెన్షన్‌గా పిలుస్తారు. మన దగ్గర గల అత్యుత్తమ సిద్ధాంతాలు పేర్కొన్నదాని కన్నా చాలా వేగంగా విశ్వం విస్తరిస్తోందని మేరీల్యాండ్‌లోని జాన్స్ హాప్కిన్స్ యూనివర్శిటీ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త ఆడమ్ రీస్ పేర్కొన్నారు. ఆయన నేతృత్వంలోని బృందం చేసిన అధ్యయన నివేదికను అస్ట్రో ఫిజికల్ జర్నల్‌లో సోమవారం ప్రచురించారు. ఇప్పటివరకు విశ్వం గురించి మన అవగాహనలో కొంత భాగం కోల్పోయినట్లు కనిపిస్తోందని రీస్ పేర్కొన్నారు. ప్రధానంగా రెండు అంశాలు – కృష్ణ బిలం, కృష్ణ శక్తి (డార్క్ మేటర్, డార్క్ ఎనర్జీ) గురించి మనం విస్మరించామని, కానీ అవే ఈ విశ్వంలో 96శాతం వున్నాయని అన్నారు. అందువల్ల ఇదేమీ చిన్న విషయం కాదన్నారు. 13–14 వందల కోట్ల సంవత్సరాల క్రితం సంభవించిన బిగ్ బ్యాంగ్‌తో ఈ విశ్వం ఆవిర్భవించింది, అప్పటి నుండి క్రమంగా విస్తరిస్తూనే వస్తోంది.

## ఎట్టకేలకు బోనెక్కిన నెతన్యాహు

### అవినీతి కేసులో కోర్టు విచారణకు హాజరు



టెల్ అవీవ్ : యుద్ధోన్మాద దాడులతో, నియంతృత్వ పోకడలతో రెచ్చిపోతున్న ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహు ఎట్టకేలకు బోనెక్కాల్సివచ్చింది. అయితే యుద్ధనేరాలకు సంబంధించిన కేసులో కాదు. అవినీతి మకిలీ పులుముకున్న నేరాభియోగాలపై ఆయన కోర్టు బోనెక్కాల్సివచ్చింది. తనపై వచ్చిన అవినీతి అభియోగాలకు సంబంధించి తొలిసారిగా నెతన్యాహు విచారణకు హాజరయ్యారు. ఇతర సాక్షుల మాదిరిగానే నెతన్యాహుకు కూడా కొన్ని సదుపాయాలు వుంటాయని, ఆయన కూర్చుని లేదా నిల్చుని ఎలాగైనా సాక్ష్యమివ్వవచ్చని న్యాయమూర్తుల్లో ఒకరు తెలిపారు. అవినీతి, విశ్వాస ఉల్లంఘన, ముడుపులు స్వీకరించడం ఇలా మూడు వేర్వేరు కేసుల్లో ఆయనపై విచారణ జరగనుంది. కిక్కిరిసిన కోర్టు గదిలోకి వచ్చిన నెతన్యాహు చాలా సాధారణంగా కనిపించారు. తనకు తన కుటుంబానికి సంబంధించిన వార్తలను సానుకూలంగా ప్రచురించినందుకు ప్రతిఫలంగా మీడియా పెద్దలకు నిబంధనల్లో సడలింపులు ఇచ్చారని కూడా ఆయన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. హాలివుడ్ నిర్మాత వ్యక్తిగత, వ్యాపార ప్రయోజనాల కోసం సహకరించినందుకు ప్రతిగా వేలాది డాలర్ల విలువైన సిగార్లు, షాంపేన్‌లు ముడుపులుగా అందుకున్నారని అభియోగాలున్నాయి. అయితే తానెలాంటి తప్పులు చేయలేదని నెతన్యాహు వాదిస్తున్నారు. ఇవన్నీ తనకు వ్యతిరేకంగా వుండే మీడియా పన్నిన కుట్రలుగా పేర్కొన్నారు. తన సుదీర్ఘ కాల పాలనకు తెర దించేయాలనే లక్ష్యంతోనే కక్ష సాధింపుతో ఇవన్నీ జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. అయితే గాజాలో దాడుల కారణంగా అంతర్జాతీయంగా నెతన్యాహుపై తీవ్ర వ్యతిరేకత నెలకొంది. అలాగే అంతర్జాతీయ న్యాయస్థానం కూడా ఆయన అరెస్టుకు వారంట్లు జారీ చేసింది. ఇటువంటి సమయంలో నెతన్యాహు ఈ విచారణను ఎదుర్కొనాల్సిరావడం గమనార్హం.

## సిరియాపై దురాక్రమణకు యత్నం

దమాస్కస్ : తిరుగుబాటు అనంతరం సిరియాలో నెలకొన్న అనిశ్చితిని ఆసరా చేసుకుని ఇజ్రాయిల్ ఆ దేశంపై దురాక్రమణపూరిత దాడులకు పూనుకుంది. సిరియాకు చెందిన గొలాన్ హైట్స్ బఫర్ జోన్‌ను కబళించేందుకు ఇజ్రాయిల్ సైన్యం ఆ ప్రాంతంలోకి చొరబడింది. రసాయనిక ఆయుధాలు ఉన్నాయని నిరాధారమైన ఆరోపణలు చేస్తూ గొలాన్ హైట్స్ పై పెద్దయెత్తున వైమానిక దాడులకు పాల్పడుతోంది. సిరియా నౌకలను, మిలటరీ గోదాములను ధ్వంసం చేసింది. రాజధాని దమాస్కస్ చుట్టుపక్కల ప్రాంతాల్లో పరిశోధనా కేంద్రాలు, మిలటరీ ప్రాంతాలపై కూడా దాడులు చేస్తోంది. అసద్ ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత ఇజ్రాయిల్, గోలన్ హైట్స్‌పై దండెత్తింది. గడచిన 48గంటల్లో దాదాపు 250 వైమానిక దాడులు జరిపినట్లు ఎస్‌ఓహెచ్‌ఆర్ తెలిపింది. ఇది పరిమితమైన, తాత్కాలిక చర్యగా ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రి వ్యాఖ్యానించారు. సిరియా గోలన్ హైట్స్‌లోని నిస్సైనికీకరణ మండలాన్ని స్వాధీనం చేసుకున్న ఇజ్రాయిల్ చర్యలను అరబ్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఈ దాడులు, 1974 నాటి ఒప్పందాన్ని దారుణంగా ఉల్లంఘించడమేనని ఈజిప్ట్ విమర్శించింది. అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించడమే కాకుండా సిరియా ప్రాదేశిక సమగ్రతను దారుణంగా దెబ్బతీశారని పేర్కొంది. ఈ దాడులపై తక్షణమే నిర్దిష్ట వైఖరి తీసుకోవాలని భద్రతా మండలిని కోరింది. సిరియాలో శాంతి, సుస్థిరత పునరుద్ధరణకు గల అవకాశాలను దెబ్బతీసేలా ఇజ్రాయిల్ దాడులు ఉన్నాయని సౌదీ అరేబియా పేర్కొంది. ఇదొక ప్రమాదకరమైన పరిణామమని కతార్ విమర్శించింది. ఇజ్రాయిల్ దురాక్రమణ చర్యలను తీవ్రంగా ఖండించింది. ఇజ్రాయిల్ అనుసరించే ఇటువంటి విధానాల వల్ల ఈ ప్రాంతంలో మరింత హింస పెచ్చరిల్లుతుందని హెచ్చరించింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానాలను, అంతర్జాతీయ చట్టాలను ఇజ్రాయిల్ బాహాటంగా ఉల్లంఘిస్తోందని కువైట్ విమర్శించింది. సిరియాపై ఇజ్రాయిల్ దురాక్రమణ తమకెంత మాత్రమూ సమ్మతం కాదని జోర్డాన్ పేర్కొంది. గొలాన్, దాని చుట్టుపక్కల ప్రాంతాలతో కూడిన బఫర్ జోన్‌ను స్వాధీనం చేసుకోవడాన్ని ఇరాక్ ఖండించింది. దురాక్రమణదారు ఇజ్రాయిల్ చర్యలను అరబ్ లీగ్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది.

## 40 పేజీల లేఖ రాసి

### సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య

బెంగళూరు: 40 పేజీల లేఖ రాసి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అతుల్ సుభాష్ (34) ఒక కంపెనీలో ఐటీ డైరెక్టర్‌గా పని చేస్తూ మారతహళ్లిలోని మంజునాథ లేఅవుట్లో ఉంటున్నారు. అతుల్‌తో గొడవపడిన అతని భార్య ఉత్తరప్రదేశ్‌లోని పుట్టింటికి వెళ్లి, అక్కడ తన భర్తపై ఫిర్యాదు చేసింది. ఈక్రమంలో గత ఆదివారం అర్ధరాత్రి అతుల్ సుభాష్ ఏకంగా 40 పేజీల లేఖ రాసి బెంగళూరులోని ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు. మరణానికి ముందుగా సుభాష్ లేఖ రాశారు. భార్యతో తాను అనుభవిస్తున్న మానసిక క్షోభకు సంబంధించి రాసిన లేఖను ఇ–మెయిల్ ద్వారా సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, తన కార్యాలయం అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులకు పంపించారు. అనంతరం తన నివాసంలో ఆదివారం అర్ధరాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు మంగళవారం గుర్తించారు. అతను రాసిన లేఖ ప్రకారం.. భార్యతో కలిసి ఉండేందుకు చేస్తున్న ప్రయత్నాలు సఫలం కాకపోవడంతో ఆవేదనకు గురైనట్లు పోలీసులు భావిస్తున్నారు. తన నాలుగేళ్ల కుమార్తె కోసం ఇప్పటికే కొని ఉంచిన బహుమతిని అందించాలని, ఇంటి తాళం ఎక్కడ పెట్టాడనే అంశాలనూ ఆయన తన లేఖలో పేర్కొన్నారు. అయితే సుభాష్ బలవన్మరణానికి మూడు రోజుల నుంచి ప్రయత్నించినట్లు పోలీసులు గుర్తించారు. శవ పరీక్షలు పూర్తి చేసి, మృతదేహాన్ని అతుల్ సుభాష్ కుటుంబానికి మంగళవారం అందజేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# చక్కని ఆరోగ్యం

## గుప్పెడు ఈ గింజలు తింటే చాలు గుండె పదిలం..!



శీతాకాలం అంటేనే జలుబు, దగ్గుతో చాలా మంది ఇబ్బంది పడుతుంటారు. దీంతో పాటు వివిధ రకాల వ్యాధులు చుట్టుముడుతుంటాయి. ఇందుకు ప్రధాన కారణం శరీరంలో ఇమ్యూనిటీ లోపించడమే. అందుకే చలికాలంలో బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి అంటుంటారు ఆరోగ్య నిపుణులు. ఈ సీజన్‌లో బెస్ట్ ఫుడ్ అంటే పిస్తా అని చెబుతున్నారు పోషకాహార నిపుణులు. చలకాలంలో క్రమం తప్పకుండా పిస్తా తినడం వల్ల ఊహించని అద్భుతమైన ప్రయోజనాలు పొందుతారని అంటున్నారు. అవేంటో చూద్దాం రండి..! పిస్తాలో విటమిన్ సి, విటమిన్ ఎ, ఐరన్, కాల్షియం, ప్రొటీన్, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ వంటి పోషకాలు ఉంటాయి. పిస్తాలో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ బయటకు పంపి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. పిస్తా పప్పు తినడం వల్ల మీ చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. ఎందుకంటే ఇందులో విటమిన్ ఇ, యాంటీ ఆక్సిడెంట్లు, కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. పిస్తాలో విటమిన్ సి, విటమిన్ ఎ, ఐరన్, కాల్షియం, ప్రొటీన్, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ వంటి పోషకాలు ఉంటాయి. పిస్తాలో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ బయటకు పంపి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. పిస్తా పప్పు తినడం వల్ల మీ చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. ఎందుకంటే ఇందులో విటమిన్ ఇ, యాంటీ ఆక్సిడెంట్లు, కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. పిస్తాపప్పులో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ప్రతిరోజూ తినడం వల్ల మీ ఇమ్యూనిటీ బలంగా ఉంటుంది. పిస్తాపప్పులో బయోటిన్ పుష్కలంగా లభిస్తుంది. ఇది జుట్టు రాలడం, చుండ్రు, పొడిబారడం వంటి అనేక సమస్యల నుంచి ఉపశమనం కలిగించడంలో సహాయపడుతుంది. పీచు, నీరు పుష్కలంగా ఉండే పిస్తా పప్పు తినడం వల్ల పొట్ట చాలా కాలం పాటు నిండుగా ఉంటుంది. దీని కారణంగా బరువు తగ్గుతారు. ఆరోగ్యవంతమైన వయోజన వ్యక్తి రోజూ కనీసం 4 నుంచి 4 పిస్తాపప్పులు తినడం మంచిది. వీటి కంటే ఎక్కువగా తినకూడదు. ఇందులో హెల్తీ కొలాజెన్ ఉంటుంది. తగిన మోతాదులో తీసుకుంటూ ఆరోగ్యంతో పాటు అందానికి కూడా మేలు చేస్తుంది. పిస్తాలో గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువ. దీంతో బ్లడ్ షుగర్ లెవెల్స్ తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో ఫెనోలిక్ కాంపౌండ్, కెరోటినాయిడ్, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి.



## చపాతీలు నేరుగా గ్యాస్ మంటపై కాలుస్తున్నారా..!

ఈ రోజుల్లో చాలా మంది రోటీ, పుల్కా వంటివి ఎక్కువగా తింటున్నారు. ఎందుకంటే.. వరి అన్నంతో కలిగే సైడ్ ఎఫెక్ట్‌పై చాలా మంది అవగాహన పెంచుకుంటున్నారు. అయితే, చపాతీ, రోటీలు తయారు చేసేందుకు ఎక్కువ మంది వాటిని నేరుగా గ్యాస్ మంట మీద కాల్చటం చేస్తున్నారు. కానీ, ఇది సరైనది కాదు అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఇలా కాల్చిన రోటీలు తింటే ఆరోగ్యం డేంజర్‌లో పడుతుందని హెచ్చరిస్తున్నారు. రొట్టెలు భారతీయ ఆహారంలో భాగం. దక్షిణాదిలో కొంత తక్కువగానే తీసుకున్నా.. ఉత్తరాదిలో మాత్రం రొటీలను ఎక్కువగా తింటారు. అయితే.. వీటిని చాలా మంది పెనంపై కాకుండా నేరుగా మంటపైనే కాల్చుతుంటారు. ఇది చాలా ప్రాంతాల్లో సాధారణమే అయినప్పటికీ ఇలా రొట్టెలను నేరుగా మంటపై కాల్చడం వల్ల క్యాన్సర్? వచ్చే అవకాశాలు ఉన్నట్టు పరిశోధనలో తేలింది. చపాతీ, రోటీ వంటివి ఏదైనా సరే నేరుగా గ్యాస్ మంటపై అధిక ఉష్ణోగ్రతల వద్ద కాల్చడం వల్ల పెను ప్రమాదం ఉంచివుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీని వల్ల కొన్ని హానికరమైన పదార్థాలు ఉత్పత్తి అవుతాయని, ఇవి మానవ శరీరానికి ప్రమాదమని చెబుతున్నారు. రోటీలను నేరుగా స్టౌ పై పెట్టి కాల్చడం వల్ల క్యాన్సర్ వస్తుందని చెబుతున్నారు. ఎక్కువ మంటపై వంట చేయడం వల్ల క్యాన్సర్ కారకాలను ఉత్పత్తి చేస్తుందని సూచిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతపై వండడం వల్ల క్యాన్సర్?కు కారణమయ్యే అకిలామైడ్, హెటెరోసైక్లిక్ అమైన్‌లు, పాలీసైక్లిక్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్‌లు కూడా ఉత్పత్తి అవుతాయని వైద్యులు చెబుతున్నారు. నల్లగా మారిన భాగాలలో హానికరమైన కార్బన్ సమ్మేళనాలు ఉండే అవకాశం ఉంది. వీటి వల్ల శ్వాసకోశ సమస్యలు , గుండె సమ్యలతో పాటు క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉంది. జీర్ణ సమస్యలు, లేదంటే ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఇలా నేరుగా గ్యాస్ మంటపై కాల్చిన చపాతి, రోటీ తినడం వల్ల వారి పరిస్థితి మరింత దిగజారిపోయే అవకాశం ఉందని చెబుతున్నారు. జీర్ణ సమస్యలు లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వైద్యుని సలహా మేరకు తినండి.

## అరటిపండును ఖాళీ కడుపుతో తింటున్నారా..?



అయితే.. అరటిపండును పరిమిత పరిమాణంలో తింటే అది ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది.. అటువంటి పరిస్థితిలో చాలా మంది ఈ పండుతో రోజును ప్రారంభిస్తారు. ముఖ్యంగా పాలు – అరటిపండు కలిపి తినడం అల్పాహారంలో ఒక భాగం.. ఇది ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది. కానీ.. కొన్ని సమస్యలున్న వారు అరటి పండును ఉదయాన్నే తినడం మానుకోవాలి. ఎక్కువమంది ఇష్టంగా తినే పండ్లలో అరటి పండు ఒకటి. అరటి పండులో ఎన్నో పోషకాలున్నాయి.. రోజూ ఒక మీడియం అరటిపండు తీసుకోవడం వల్ల విటమిన్.. రోజువారీ విలువలో 33% వరకు కవర్ చేయవచ్చు. అరటిపండ్లలో పొటాషియం, మెగ్నీషియం, భాస్వరం, కాల్షియం, ఇతర విటమిన్లు వంటి కీలక పోషకాలున్నాయి.. అరటి జీర్ణక్రియ, గుండె ఆరోగ్యానికి మంచిది.. అరటి పండ్లలో ఎక్కువగా ఉండే పెక్టిన్ పేగు పనితీరును మెరుగుపరుస్తుంది. పేగులోని ఆహారం త్వరగా జీర్ణమయ్యేందుకు సహకరిస్తుంది. అందులో ఉండే కరిగిపోయే గుణమున్న ఫైబర్ శరీరంలో కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచడంతోపాటు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. అయితే.. అరటిపండును పరిమిత పరిమాణంలో తింటే అది ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది.. అటువంటి పరిస్థితిలో చాలా మంది ఈ పండుతో రోజును ప్రారంభిస్తారు. ముఖ్యంగా పాలు– అరటిపండు కలిపి తినడం అల్పాహారంలో ఒక భాగం.. ఇది ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది. అయితే.. కొందరు ఉదయాన్నే ఖాళీ కడుపుతో అరటిపండును తినకూడదని వైద్య నిపుణులు చెబుతున్నారు.. ఖాళీ కడుపుతో ఎలాంటి వారు అరటి పండు తినకూడదో ఇప్పుడు తెలుసుకోండి. అరటిపండు చాలా సరసమైన ధరకు లభించే పోషకాహార పండు.. ఇది అన్నికాలలో సులభంగా లభిస్తుంది. ఇది ఆకలిని తీర్చడమే కాకుండా శరీరానికి శక్తిని అందిస్తుంది. బరువు పెరగాలనుకునే వారు ఈ పండును ఎక్కువగా తీసుకుంటారు. అయితే, చాలా మంది ఆరోగ్య నిపుణులు ఉదయం ఖాళీ కడుపుతో తినడానికి నిరాకరిస్తారు. పొట్ట సమస్యలతో బాధపడేవారు: ఉదయాన్నే ఖాళీ కడుపుతో అరటిపండు తినడం వల్ల ఎసిడిటీ లేదా గ్యాస్ వస్తే, దానికి దూరంగా ఉండటం మంచిది.. లేకుంటే కడుపు సమస్యలు పెరిగే అవకాశం ఉంది. వాస్తవానికి, ఇది కార్బోహైడ్రేట్లకు గొప్ప మూలం.. కాబట్టి కొన్నిసార్లు ఇది జీర్ణక్రియలో సమస్యలను కలిగిస్తుంది. అటువంటి పరిస్థితిలో, వాంతులు, కడుపు నొప్పి, అనేక ఇతర సమస్యలు సంభవించవచ్చు. మీరు దానిని తినవలసి వస్తే, ఇతర ఆహారాలతో కలిపి తినండి.

## ఖాళీ కడుపుతో అంజీర్ పండ్లను తింటున్నారా?

తియ్యటి రుచితో ఉండే అంజీర్ పండ్లలో ఆరోగ్య ప్రయోజనాలు పుష్కలంగా నిండివున్నాయి. అంజీర్ పండ్లను ఉదయం, సాయంత్రం ఏ సమయంలోనైనా తీసుకోవచ్చు. లేదా రెండు పూటలూ తక్కువ మోతాదుతో తీసుకోవచ్చు. అయితే ఉదయాన్నే ఖాళీ కడుపుతో అంజీర పండ్లను తీసుకుంటే ఏమవుతుందో తప్పక తెలుసుకోవాలంటున్నారు ఆరోగ్య నిపుణులు..అదేంటో ఇక్కడ తెలుసుకుందాం. ఉదయాన్నే ఖాళీ పొట్టతో అంజీర్ తినడం వల్ల దాని సహజ చక్కెరల కారణంగా త్వరగా శక్తిని పొందవచ్చు. ముఖ్యంగా శరీరంలో శక్తిని అందించే కార్బోహైడ్రేట్లు. అత్తి పండ్లతో పాలు తీసుకోవడం మంచి శక్తి వనరు. ఉదయాన్నే ఖాళీ కడుపుతో దీన్ని తీసుకోవడం ద్వారా రోజంతా శక్తివంతంగా ఉంటారు. అంజీర్ పండ్లలో కాల్షియం ఎక్కువ శాతం ఉంటుంది. దీంతో అంజీర్ పండ్లు తింటే ఎముకలకు ఎంతో మేలు చేస్తుంది. నిత్యం అంజీర్ పండ్లు తింటే ఎముకలు ధృడంగా ఉంటాయి. ఎముకల బలహీనత సమస్య ఉన్నవారు రోజు 2–3 పండ్లను తింటే ఆ సమస్యకు చెక్ పెట్టవచ్చు. శరీరంలో ఉన్న మలినాలను తొలగించడంలో అంజీర్ పండ్లు సమర్థవంతంగా పనిచేస్తాయి. అంజీర్ పండ్లలో పొటాషియం, సోడియం, ఫాస్ఫారిక్ ఆమ్లం, ఐరన్, విటమిన్లు వంటి అనేక



పోషకాలు కూడా సమృద్ధిగా ఉంటాయి. ఖాళీ కడుపుతో అంజీర పండ్లను తినడం వల్ల రక్తపోటు సమస్యలు రావు. రక్తపోటును ఇది అదుపులో ఉంచుతుంది. ఇందులో ఉండే పొటాషియం మరియు యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని రక్తపోటును నియంత్రిస్తాయి. అలాగే గుండెకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. అంజీర్‌తో పొట్టకు చాలా మేలు జరుగుతుంది. ఇందులో ఎక్కువ మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఇది మలబద్ధకం వంటి సమస్యలకు చెక్ పెడుతుంది. అంతేకాకుండా జీర్ణక్రియ సరిగా ఉండడానికి బాగా పనిచేస్తుంది. అసిడిటీ, అజీర్ణం, గ్యాస్ మొదలైన సమస్యల నుంచి విముక్తి పొందుతారు. ప్రతి రోజు 2–3 అంజీర్ పండ్లను తేనెతో కలిపి తీసుకుంటే కడుపు ఖాళీ అవుతుంది. గ్యాస్, ఎసిడిటీ వంటి సమస్యలు కూడా దరి చేరవు. అంజీర్ పండ్లు తింటే ఆరోగ్యవే కాకుండా అందంగా మారతారు. మొటిమలతో ఇబ్బందులు పడుతున్నవారికి అంజీర్ పండ్లతో ఆ సమస్యకు చెక్ పెట్టవచ్చు. అంజీర్ పండ్లను మెత్తగా నూరి ఆ పేస్ట్‌ను మొటిమలకు అప్లై చేయాలి. ఆకులు కూడా వాడవచ్చు. 20 నిమిషాల తర్వాత ముఖాన్ని శుభ్రంగా వాష్ చేసుకోవాలి. ఇలా కొన్ని రోజుల పాటు చేస్తే ముఖంపై మొటిమలు, మచ్చలు మాయం అవుతాయి.

## పిజ్జా, బర్గర్లు తెగ లాగించేస్తున్నారా?

నేటి కాలంలో అధిక మంది ఫాస్ట్ ఫుడ్ కి అలవాటు పడుతున్నారు. ముఖ్యంగా పిజ్జాలు, బర్గర్లు వేళా పాళా లేకుండా లాగించేవారు మన చుట్టూ చాలా మందే ఉన్నారు. అయితే ఇలాంటి వారికి పరిశోధకులు షాకింగ్ న్యూస్ చెప్పారు. పిజ్జా, బర్గర్లు, మోమోస్ వంటి అనారోగ్యకరమైన ఫాస్ట్ ఫుడ్ తీసుకోవడం వల్ల 50 ఏళ్లు లేదా అంతకంటే తక్కువ వయస్సు ఉన్నవారిలో జీర్ణ క్యాన్సర్, పెద్దప్రేగు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని తాజా అధ్యయనం వెల్లడించింది. ఇటీవల ఆస్ట్రేలియాలోని ఫ్లిండర్స్ యూనివర్సిటీలో రెడ్ మీట్, ప్రాసెస్డ్ మీట్, ఫాస్ట్ ఫుడ్, షుగర్ డ్రింక్స్, ఆల్కహాల్ వంటి అనారోగ్యకరమైన ఆహార పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై పరిశోధన నిర్వహించగా, వీటిని తీసుకోవడం వల్ల క్యాన్సర్ వస్తుందని తేలింది. పిజ్జా, బర్గర్లు, మోమోస్ వంటి ఫాస్ట్ ఫుడ్ తీసుకోవడం వల్ల శరీరంలో మంట పెరుగుతుందని, దీని వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం పెద్దప్రేగు క్యాన్సర్ కేసుల పెరుగుదల 50 సంవత్సరాలు లేదా అంతకంటే తక్కువ వయస్సు ఉన్నవారిలోనే ఎక్కువగా కనిపిస్తుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ప్రాసెస్ చేసిన ఆహారం, వేయించిన ఆహారాలు, చక్కెర పానీయాలు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. ఎందుకంటే ఈ ఆహారాలలో కొవ్వు, చక్కెర అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో మంట, క్యాన్సర్ కారకాలను పెంచుతాయి.

ఈ ఫాస్ట్ ఫుడ్స్ రసాయనాలు, కృత్రిమ సంకలితాలను కలిగి ఉంటాయి. ఇవి శరీరంలోని జీవక్రియను అసమతుల్యత చేస్తాయి. ఇవి ఆరోగ్యకరమైన కణాలను దెబ్బతీయడం ద్వారా క్యాన్సర్ కణాలను పెంచుతాయి. అటువంటి పరిస్థితిలో ఆరోగ్యకరమైన కొవ్వులు, కూరగాయలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం, తక్కువ చక్కెర, ఆల్కహాల్ తీసుకోవడం ద్వారా క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

## డయాబెటిస్ రోగులు పల్లీలు తింటే ఏమవుతుంది?

వేరుశెనగల్లో ప్రోటీన్, ఫైబర్, అవసరమైన కొవ్వులు పుష్కలంగా ఉంటాయి.. వాస్తవానికి.. ఇంట్లో ఖాళీగా ఉన్నా.. బోర్ కొడుతున్నా.. టీవీ చూస్తున్నా.. లేదా ప్రయాణంలో ఉన్నప్పుడు.. మనం వేరుశెనగలు తినడానికి ఇష్టపడతాము.. అయితే ఈ సూపర్‌ఫుడ్ డయాబెటిక్ రోగులకు ప్రయోజనకరంగా ఉంటుందా..? హాని చేస్తుందా..? నిపుణులు ఏం చెబుతున్నారంటే.. మధుమేహం కేసులు పెరుగుతున్నాయి.. లక్షలాది మంది డయాబెటిస్ తో బాధపడుతున్నారు.. ఒకప్పుడు వృద్ధులలో కనిపించే ఈ వ్యాధి .. చిన్న వయస్సు వారిని కూడా వదిలిపెట్టడం లేదు.. ఇలాంటి పరిస్థితుల్లో షుగర్ వ్యాధిగ్రస్తులు ఎప్పుడు ఏం తినాలి.. ఏమి తినకూడదు అనే సందిగ్ధంలో ఉంటారు. ఎందుకంటే ఇందులో చిన్న పొరపాటు జరిగినా రక్తంలో చక్కెర స్థాయి ఒక్కసారిగా పెరిగిపోతుంది. మధుమేహంలో కిడ్నీ వ్యాధి, గుండె జబ్బులు, కంటిచూపు బలహీనపడే ప్రమాదం ఉంది. కొంతమందికి ఈ సంక్లిష్ట వ్యాధి సమయంలో వేరుశెనగలు తినవచ్చా లేదా..? తింటే ఏమవుతుంది అనే ప్రశ్న తలెత్తుతుంది. వేరుశనగల్లో ప్రోటీన్, ఫైబర్, అవసరమైన కొవ్వులు పుష్కలంగా ఉంటాయి.. వాస్తవానికి.. ఇంట్లో ఖాళీగా ఉన్నా.. బోర్ కొడుతున్నా.. టీవీ చూస్తున్నా.. లేదా ప్రయాణంలో ఉన్నప్పుడు.. మనం వేరుశెనగలు తినడానికి ఇష్టపడతాము.. అయితే ఈ సూపర్‌ఫుడ్ డయాబెటిక్ రోగులకు ప్రయోజనకరంగా ఉంటుందా..? హాని చేస్తుందా..? డయాబెటిస్ రోగులు వెరుశనగలు తింటే ఏమవుతుందో ఇప్పుడు తెలుసుకోండి.. బ్రిటీష్ జర్నల్ ఆఫ్ న్యూట్రిషన్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం.. ఉదయాన్నే వేరుశెనగ తినడం వల్ల రక్తంలో చక్కెర నియంత్రణలో ఉంటుంది. అదనంగా, మెగ్నీషియం వేరుశెనగలో ఉంటుంది.. ఇది డయాబెటిస్‌లో ప్రయోజనకరంగా ఉంటుంది. దీనితో పాటు, డయాబెటిక్ రోగులకు ముఖ్యమైన వేరుశెనగ తినడం వల్ల అనేక ఇతర ప్రయోజనాలు ఉన్నాయి. అవేంటో చూడండి.. కొలెస్ట్రాల్ తగ్గుతుంది: వేరుశెనగ తినడం వల్ల మన సిరల్లో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది.. ఎందుకంటే ఇందులో ఫైబర్, ప్రోటీన్, మోనోశాచురేటెడ్ కొవ్వు ఉంటుంది. డయాబెటిక్ రోగులకు గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.. కాబట్టి, వారు తప్పనిసరిగా వేరుశెనగ తినాలి.

# సినిమా




## అందమైన లొకేషన్లలో రాంచరణ్, కియారా అద్వానీ

### నానా హైరానా సాంగ్ షూట్ సాగిందిలా..!

గ్లోబల్ స్టార్ రాంచరణ్–స్టార్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో వస్తోన్న సినిమా గేమ్‌ఛేంజర్ బాలీవుడ్ భామ కియారా అద్వానీ, రాజోలు భామ అంజలి ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2025 జనవరి 10న తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా ఇటీవలే నానా హైరానా సాంగ్ విడుదల చేశారని తెలిసిందే. ఈ పాట అందమైన లొకేషన్స్ లో రాంచరణ్, కియారా అద్వానీ మధ్య కలర్‌ఫుల్‌గా సాగుతుంది. తాజాగా ఈ సాంగ్ మేకింగ్ వీడియోను, స్టిల్స్‌ను సోషల్ మీడియా ద్వారా అందరితో షేర్ చేశాడు రాంచరణ్. ఈ వీడియో, స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. గేమ్ ఛేంజర్‌లో నవీన్ చంద్ర, సునీల్, శ్రీకాంత్, బాలీవుడ్ యాక్టర్ హ్యారీ జోష్, కోలీవుడ్ యాక్టర్లు ఎస్‌జే సూర్య, సముద్రఖని, కన్నడ నటుడు జయరామ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి కార్తీక్ సుబ్బరాజు కథనందిస్తుండగా.. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్ సమకూరుస్తున్నారు. ఈ చిత్రానికి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.



## రష్మికతో పోటీ పడుతున్న కీర్తి

పాత్ బ్రేకింగ్‌లో ఎంత మజా ఉంటుందో.. ఆల్రెడీ ఉన్న పాత్‌లో జాగ్రత్తగా అడుగులు వేసి డెస్టినేషన్ రీచ్ కావడంలోనూ అంతే హ్యాపీనెస్ ఉంటుంది. ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న విషయాలు.. రష్మిక అండ్ కీర్తి సురేష్‌కి యాప్ట్ గా ఉంటాయి. ఇప్పుడున్న సిట్యువేషన్‌ని బట్టి రష్మిక సక్సెస్ అయ్యారు. మరి కీర్తి సురేష్ సంగతేంటి? ఎదగడం అంటే అడుగులో అడుగు వేయడం... మెట్టుకు మెట్టూ ఎక్కడం అని స్ట్రాంగ్‌గా నమ్మారు రష్మిక మందన్న. అందుకే ఎదగడానికి ఉన్న ఏ అవకాశాన్నీ ఆమె మిస్ చేసుకోలేదు. ఓ వైపు గ్లామర్, మరోవైపు పెర్ఫార్మెన్స్.. ఇటు కమర్షియల్ ఫార్ములా... అన్నిటినీ జాగ్రత్తగా కవర్ చేస్తున్నారు. మన దగ్గరే కాదు, నార్త్ సినిమాలకు కూడా బెస్ట్ ఆప్షన్‌గా కనిపిస్తున్నారు రష్మిక మందన్న. రెగ్యులర్ సినిమాల్లోనే కాదు, పీరియాడిక్ టచ్ ఉన్న మూవీస్‌కి కూడా ఆమెను తీసుకోవచ్చనే కాన్ఫిడెన్స్ క్రియేట్ అవుతోంది మేకర్స్ లో. పాటలకు కావాల్సిన గ్లామర్, సిట్యువేషన్‌కి కావాల్సిన సీరియస్‌నెస్‌నీ పండించగలరనే కాన్ఫిడెన్స్ పుష్ప2 చూశాక స్ట్రాంగ్‌గా రిజిస్టర్ అయింది ఇండస్ట్రీకి. రష్మిక రూట్లో ట్రావెల్ చేస్తున్న సౌత్ హీరోయిన్లు ఎవరు అని ఆరా తీస్తే, అందరికీ కీర్తి సురేష్ పేరు కనిపిస్తోంది. కెరీర్ స్టార్టింగ్‌లో ఫుల్ పెర్ఫార్మెన్స్ రోల్స్ కి పరిమితమయ్యారు ఈ లేడీ. తర్వాత కాస్త రూటు మార్చి కమర్షియల్ టచ్ ఉన్న సినిమాల్లో స్టార్ హీరోల పక్కన మెప్పించారు. ఇప్పుడు నార్త్ ఎంట్రీ మూవీ బేబీ జాన్ కోసం ఫుల్‌గా మేకోవర్ అయ్యారు కీర్తి. ప్యాన్ ఇండియా ప్రాజెక్టుల్లో సక్సెస్ కావాలంటే గ్లామర్‌కి ఉన్న ఇంపార్టెన్స్ గురించి బాగానే తెలుసుకున్నారు ఈ బ్యూటీ. రీసెంట్‌గా రిలీజ్ అయిన నయన మటక్క సాంగ్‌లో కీర్తిని చూసిన వారు.. రష్మిక రూట్లో పక్కాగా ట్రావెల్ చేస్తున్నారుగా..! అని అంటున్నారంటేనే... కీర్తి ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఏంటో అర్థం చేసుకోవచ్చు.



## యాక్షన్ మూడ్‌లో హరిహరవీరమల్లు సెట్‌లో పవన్ కల్యాణ్, జ్యోతికృష్ణ

టాలీవుడ్ యాక్టర్ పవన్ కల్యాణ్ బ్యాక్ టు బ్యాక్ సినిమాల షూటింగ్స్‌లో పాల్గొంటూ అభిమానుల్లో జోష్ నింపుతున్నాడు. ఈ స్టార్ యాక్టర్ ఖాతాలో ఓజీ, హరిహరవీరమల్లు ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలున్నాయని తెలిసిందే. కాగా ప్రస్తుతం ఓ వైపు ఓజీ షూట్‌లోనే పాల్గొంటూనే.. మరోవైపు హరిహరవీరమల్లు చిత్రీకరణలో బిజీగా మారిపోయాడు. ఇప్పటికే ఓజీ షూట్ థాయ్‌లాండ్, బ్యాంకాక్‌లో కొనసాగుతుందని తెలిసిందే. తాజాగా హరిహరవీరమల్లు సెట్‌లో షూటింగ్ మూడ్‌లో ఉన్న స్టిల్ నెట్టింట వైరల్ అవుతోంది. డైరెక్టర్ సీన్ వివరిస్తుండగా.. పవన్ కల్యాణ్ స్క్రిప్ట్ చదువుకుంటుండటం చూడొచ్చు. హరిహరవీరమల్లు ఫైనల్ షెడ్యూల్‌లో పవన్ కల్యాణ్ అంటూ ఖడ్గాలు, స్టార్ ఎమోజీలను పోస్ట్ చేశారు మేకర్స్. ఇప్పుడీ స్టిల్ అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తోంది. జ్యోతి కృష్ణ డైరెక్షన్‌లో పీరియాడిక్ డ్రామా ఫొటో షూట్ కోసం ఇటీవలే భారతీయ తొలి పొటోమెట్రిక్ 3 డీ స్కానింగ్ టెక్నాలజీ వినియోగించారని తెలిసిందే. ఈ మూవీలో ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. బాలీవుడ్ నటుడు, దర్శక నిర్మాత అనుపమ్ ఖేర్, అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీకి లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ మూవీ రెండు పార్టులుగా వస్తుండగా.. పార్ట్ 1ను మార్చి 28న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు.



### లాంగ్ గ్యాప్ తర్వాత..

## విక్రమ్ తంగలాన్ ఓటీటీలో ఇంప్రెస్ చేసేనా?

కోలీవుడ్ స్టార్ హీరో చియాన్ విక్రమ్ కాంపౌండ్ నుంచి వచ్చిన చిత్రం తంగలాన్ హిస్టారికల్ డ్రామాగా పా రంజిత్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో మాళవికా మోహనన్, పార్వతి తిరువొత్తు ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషించగా.. పశుపతి, డానియెల్ కల్టగిరోన్ కీలక పాత్రలు పోషించారు. ఆగస్టు 15న తెలుగు,తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఓటీటీ ప్రీమియర్ అప్‌డేట్ వచ్చేసింది. 100 రోజుల తర్వాత ఓటీటీలోకి వచ్చేసింది. ప్రస్తుతం పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో ప్రీమియర్ అయింది. ప్రస్తుతం తమిళం, తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. మరి ఓటీటీలో తంగలాన్‌కు ప్రేక్షకులను ఎలాంటి స్పందన వస్తుందనేది చూడాలి. ఇంకేంటి తంగలాన్‌పై మీరూ లుక్కేయండి. ఈ మూవీని స్టూడియో గ్రీన్, నీలమ్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై కేఈ జ్ఞానవేల్ రాజా తెరకెక్కించగా.. జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించాడు.

# రాజ్యసభ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం

రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్‌పై కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమి ఎంపీలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ధన్‌ఖడ్ పక్షపాతంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపిస్తూ మొత్తం 71 మంది ఎంపీల సంతకాలతో నోటీసు ఇచ్చినట్టు కూటమి వర్గాలు తెలిపాయి. అయితే సాంకేతికంగా ప్రస్తుత సమావేశాల్లో ఈ తీర్మానానికి ఆమోదం లభించే అవకాశం లేదు. ఎందుకంటే 14 రోజుల ముందుగా నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుత శీతాకాల సమావేశాలు మరో 8 రోజుల్లోనే ముగియనుండడంతో ఆమోదం పొందేందుకే అవకాశం లేదు.

రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖర్‌పై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. ఎగువ సభలో చైర్మన్ వ్యవహరిస్తున్న తీరు ఏకపక్షంగా ఉంటోందని ఎంపీలు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. రాజ్యసభ నుంచి తాము తరచూ వాకౌట్ చేయాల్సిన పరిస్థితికి చైర్మన్ ధన్‌ఖర్ వైఖరే కారణమని విపక్ష ఎంపీలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు.



ఈ తీర్మానంపై ఇండియా కూటమి పార్టీలైన తృణమూల్, ఆమ్ ఆద్మీపార్టీ, సమాజ్ వాదీపార్టీ, డీఎంకే, ఆర్జేడీ తదితర పార్టీలకు చెందిన 50 మందికిపైగా ఎంపీలు సంతకాలు చేశారు. ఎంపీలు సంతకాలు చేసిన ఈ నోటీసులను రాజ్యసభ సెక్రటేరియట్‌కు సమర్పించారు. చైర్మన్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడం భారత పార్లమెంటరీ చరిత్రలోనే ఇది మొదటిసారి.

రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మాట్లాడేందుకు లేచి నిలబడినపుడు చైర్మన్ ఆయనకు అవకాశం ఇవ్వాలని, కాని కాంగ్రెస్ అధ్యక్షుడు, సభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే లేచి నిలబడగానే మైక్రోఫోన్‌ను చైర్మన్ తరచు కట్ చేస్తున్నారని విపక్ష ఎంపీలు వాదిస్తున్నారు. పార్లమెంటరీ నిబంధనలు, సాంప్రదాయాల ప్రకారం సభ నడవాలని, కాని తాము ఫిర్యాదు చేసిన ప్రతిసారి తమను ఛాంబర్‌లోకి పిలిచి సర్దుబాటు చేసేందుకు చైర్మన్ ప్రయత్నిస్తున్నారే తప్ప నిబంధనలను పాటించాలని భావించడం లేదని సీనియర్ ప్రతిపక్ష నాయకుడు ఒకరు తెలిపారు. కాగా తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, సమాజ్ వాదీ పార్టీలతో పాటు ఇండియా కూటమిలోని అన్ని పార్టీల ఎంపీలు సంతకాలు చేసినట్టు జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. నిజానికి తృణమూల్ కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీలు... అదానీ వ్యవహారంలో కాంగ్రెస్, ఇతర ఎంపీలతో పాటు పాల్గొనలేదు. పార్లమెంటు ఆవరణలో చేపట్టిన నిరసనల్లో పాల్గొనడం లేదు. అయినప్పటికీ రాజ్యసభ సభ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మాన నోటీసుల విషయంలో కలిసి రావడం గమనార్హం.

# కేబినేట్ భేటి ముందుకు జమిలి ఎన్నికల బిల్లు

¶ · · ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో కేంద్ర కేబినెట్ బుధవారం న్యూఢిల్లీలో సమావేశం కానుంది. ఈ సందర్భంగా ఈ సమావేశం ముందుకు జమిలి ఎన్నికల బిల్లు రానుంది. అయితే జమిలి ఎన్నికలు నిర్వహించాలని ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీ కృత నిశ్చయంతో ఉన్నారు. అందుకోసం రానున్న సాధారణ ఎన్నికలు.. జమిలిగానే జరపాలని ప్రధాని మోదీ వ్యూహాత్మంగా అడుగులు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో తదుపరి ఎన్నికలపై ఇప్పటికే ప్రధాని మోదీ కార్యచరణ ప్రారంభించారని ఎన్డీఏలోని కీలక భాగస్వామి, టీడీపీ అధినేత, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ఈ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఒకే దేశం.. ఒకే ఎన్నికకు సంబంధించిన ముసాయిదా బిల్లును కేంద్ర న్యాయ శాఖ రూపకల్పన చేసే పనిలో నిమగ్నమైందని తెలుస్తుంది. ఇక ఈ బిల్లు బుధవారం జరిగే కేంద్ర కేబినెట్ సమావేశం ముందుకు వస్తుందని భావిస్తున్నారు. అలా కాకుంటే.. వచ్చే బుధవారం కేబినెట్ సమావేశానికి ముందు సంబంధిత ముసాయిదా బిల్లు వస్తుందని ఉన్నతాధికారిక వర్గాలు వెల్లడిస్తున్నాయి. కేంద్ర కేబినెట్ ఆమోదం అనంతరం పార్లమెంటు ముందుకు ఒకే దేశం ఒకే ఎన్నిక బిల్లు రానుంది. మరోవైపు ఒకే దేశం ఒకే ఎన్నికకు మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ఇచ్చిన నివేదికకు గతంలోనే కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసిన విషయం విధితమే. కోవింద్ అందించిన నివేదిక ఆధారంగా.. అందుకు సంబంధించిన బిల్లు రూపొందుతోంది. ఇంకోవైపు.. ఈ జమిలి బిల్లుపై దేశవ్యాప్తంగా విస్తృత చర్చ జరగాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షిస్తున్నారు. ఈ బిల్లుకు ప్రజల నుండి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తుందని బీజేపీ అగ్రనాయకత్వం అంచనా వేస్తోంది. అయితే పార్లమెంటులో రాజ్యాంగ సవరణలకు కూటమికి అవసరమైన సంఖ్యా బలం లేదు. అయినా ఈ



బిల్లు ఆమోదించుకోనేందుకు ముందుకెళ్లాలని మోదీ భావిస్తున్నారు. ఇక ఈ జమిలి ఎన్నికలకు మొత్తం 47 పార్టీల్లో 32 పార్టీలు జై కొట్టిన సంగతి తెలిసిందే. అంటే 13 రాజకీయ పార్టీలు ఈ బిల్లును వ్యతిరేకించాయి.

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతోపాటు సార్వత్రిక ఎన్నికలు ఒకే సారి నిర్వహించాలని.. అందుకోసం ఒకే దేశం.. ఒకే ఎన్నికను తీసుకు రావాలని బీజేపీ చాలా కాలంగా ప్రయత్నాలు చేస్తోంది. ఆ క్రమంలో భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ కొన్ని నెలల పాటు చర్చలు, సూచనలు, సలహాలు తీసుకుని ఒక నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. దీనికి కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఈ నేపథ్యంలోనే ఈ జమిలి ఎన్నికలకు సంబంధించిన బిల్లును ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టి.. ఆమోదం కల్పించాలని మోదీ సర్కార్ యోచిస్తోంది.

ఇక 2027లో దేశంలో అన్ని రాష్ట్రాల అసెంబ్లీలతోపాటు లోక్‌సభకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేలా కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్ వేగంగా పావులు కదుపుతోంది. జమిలి ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే బిల్లు రూపొందినట్లు బీజేపీ వర్గాల పేర్కొంటున్నాయి. ఈ బిల్లును ప్రస్తుత పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్ట అవకాశం ఉందని సమాచారం. ఆ తర్వాత ఈ జమిలి ఎన్నికల బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి సిఫార్సు చేసే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే ఈ సమావేశాల్లో వీలు కాని పక్షంలో వచ్చే సమావేశాల్లో అయినా.. దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉందని బీజేపీ వర్గాల స్పష్టం చేస్తున్నాయి.

## ఆటోడ్రైవర్లకు రూ.10 లక్షల బీమా, పిల్లల పెళ్లిళ్లకు లక్ష సాయం



**న్యూఢిల్లీ:** దేశ రాజధానిలోని ఆటో డ్రైవర్లపై ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వరాల జల్లులు కురిపించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆటోవాలాలకు 5 కీలక హామీలిచ్చారు. ఆటోవాలాలకు రూ.10 లక్షల బీమా, పిల్లల పెళ్లిళ్లకు రూ.1 లక్ష సాయం అందిస్తామని వాగ్దానం చేశారు. ఆటో డ్రైవర్ నవ్‌నీత్ ఇంట్లో కేజ్రీవాల్, ఆయన భార్య సునీత మంగళవారంనాడు లంచ్ తీసుకున్నారు. "నిన్న మా ఇంట్లో ఆటోడ్రైవర్లతో సమావేశమయ్యాను. ఈరోజు నవ్‌నీత్ (ఆటోడ్రైవర్) ఇంటికి మధ్యాహ్నం భోజనం కోసం వచ్చాను. ఆటోడ్రైవర్లకు ఐదు హామీలు ఇస్తున్నాను. 2025 ఫిబ్రవరిలో మేము మళ్లీ అధికారంలోకి వస్తున్నాం. ఇచ్చిన 5 హామీలను ఆ వెంటనే అమలు చేస్తాం. ఆటోడ్రైవర్ కుమార్తెల పెళ్లిళ్లకు లక్ష రూపాయలు సాయం అందిస్తాం. దీపావళి, హోలి పండుగలకు యూనిఫాం కోసం రూ.2,500 చొప్పున ఇస్తాం. రూ.10 లక్షల జీవిత బీమా, రూ.5 లక్షల ప్రమాద బీమా కల్పిస్తాం. ఆటోడ్రైవర్ల పిల్లలకు ఫ్రీ కోచింగ్ సదుపాయం కల్పిస్తాం. అని కేజ్రీవాల్ ఈ సందర్భంగా ప్రకటించారు.

ఫిబ్రవరిలో ఎన్నికలు

కాగా, 70 మంది సభ్యులున్న ఢిల్లీ అసెంబ్లీకి 2025 ఫిబ్రవరిలో ఎన్నికలు జరగనున్నాయి. ఆప్‌తో పాటు ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ ఎన్నికల బరిలో ఉన్నాయి. 2020లో 70 స్థానాలకు గాను 62 సీట్లు ఆప్ గెలుచుకుంది. వరుసగా మూడోసారి కూడా అధికారంలోకి వస్తామనే ధీమాతో ఉంది.

# మమతకు మద్దతు తెలిపిన మాజీ సీఎం

**పాట్నా :** ఇండియా కూటమి అధ్యక్ష బాధ్యతలు తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి అప్పగించాలని ఆర్జేడీ అధినేత, మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ అభిప్రాయపడ్డారు. అందుకు కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. మమతకు తాము మద్దతు ఇస్తామని ఆయన మంగళవారం పాట్నాలో వెల్లడించారు. మమతాకు ఇండియా కూటమి బాధ్యతలు అప్పగిస్తే.. 2025లో మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని లాలూ ప్రసాద్ యాదవ్ జోస్యం చెప్పారు. మరోవైపు ఇండియా కూటమి అధ్యక్ష బాధ్యతలు సీఎం మమతా బెనర్జీకి అప్పగించాలని ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో డిమాండ్ వినిపిస్తున్న సంగతి తెలిసిందే. బీజేపీని పలుమార్లు మమతా బెనర్జీ ఓడించారని.. అలాంటి వేళ ఇండియా కూటమి బాధ్యతలు ఆమెకు అప్పగించడం సముచితమని ఎంపీ కీర్తి ఆజాద్ ఇప్పటికే స్పష్టం చేసిన విషయం విధితమే. భాగస్వామ్య పక్షాలు కోరితే ఇండియా కూటమికి నాయకత్వం వహించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఇటీవల ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రకటించారు. దీనిపై సర్వత్ర చర్చ ప్రారంభమైంది. ఇక సీఎం మమతా బెనర్జీ చేసిన తాజా ప్రకటనపై కూటమిలోని భాగస్వామ్య పక్షాల నుంచి మిశ్రమ స్పందన వస్తుంది. అయితే ఇండియా కూటమిని తానే ఏర్పాటు చేశానని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. దీనిని సరిగ్గా నిర్వహించాల్సిన బాధ్యత సారథి స్థానంలో ఉన్న వారిపై ఉందంటూ మమతా బెనర్జీ పేర్కొన్నారు. ఇక ప్రతిపక్ష కూటమిలోని పలు పార్టీల నేతలు ఆమె నాయకత్వం వహించేందుకు సుముఖత వ్యక్తం చేసిన విషయం విధితమే. ఇండియా కూటమికి ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ సారథ్యం వహిస్తుంది. అయితే కాంగ్రెస్ పార్టీ సరైన సత్తా చాటకుంటే.. తానేం చేయలేనని.. హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను దృష్టిలో ఉంచుకొని మమతా బెనర్జీ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు మమతా బెనర్జీ వ్యాఖ్యలపై



కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. పశ్చిమ బెంగాల్లో వరుసగా మూడు సార్లు అధికారం చేపట్టినప్పటికీ.. తృణమూల్ కాంగ్రెస్ పార్టీని దేశవ్యాప్తంగా విస్తరించేందుకు చేసిన ప్రయత్నాలు ఆశించిన ఫలితాలను ఇవ్వలేక పోయాయని గుర్తు చేసింది. బెంగాల్ పొరుగున్న రాష్ట్రాల్లో పార్టీని విస్తరించలేని వారు.. జాతీయ స్థాయి నాయకత్వ బాధ్యతలు చేపట్టి ఎలా రాణించగలరంటూ సీఎం మమతా బెనర్జీకి కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రశ్నించిన సంగతి తెలిసిందే.

ఇంతకీ మమతా బెనర్జీ ఏమన్నారంటే..?

తాను ఇండియా కూటమిని ఏర్పాటు చేశానన్నారు. ప్రస్తుతం దానిని నిర్వహించడం ముందు ముందున్న వారిపై ఉంది. వారు ప్రదర్శనను నిర్వహించ లేకపోతే, నేను ఏమి చేయగలను? అని ప్రశ్నించారు. అందరినీ వెంట తీసుకెళ్లాలని తాను చెప్తానన్నారు. అవకాశం దొరికితే దాని సజావుగా సాగేలా చూస్తానని మమత బెనర్జీ స్పష్టం చేశారు. అయితే తాను పశ్చిమ బెంగాల్ నుంచి బయటకు వెళ్లడం ఇష్టం లేదని కుండబద్దలు కొట్టారు. కానీ తాను ఇక్కడ నుండి అమలు చేయగలనంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించిన విషయం విధితమే. ఇటీవల జరిగిన మహారాష్ట్ర, జార?ండ్ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో మహారాష్ట్రలో బీజేపీ సత్తా చాటింది. కానీ జార?ండ్ లో మాత్రం ఇండియా కూటమికి చెందిన జార?ండ్ ముక్తి మోర్చ పార్టీ ఘన విజయం సాధించింది. దీంతో ఆ పార్టీ సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

## జామా మసీదు అక్రమ కట్టడంపై బుల్డోజర్ యాక్షన్



ఫతేపూర్: యోగి ఆదిత్యనాథ్ సారథ్యంలోని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మరోసారి బుల్డోజర్ యాక్షన్‌కు దిగింది. ఫతేపూర్ జిల్లాలోని నూర్ జామా మసీదు విస్తరణలో భాగంగా నిర్మించిన అక్రమ కట్టడాలను అధికారులు మంగళవారంనాడు కూల్చివేశారు. డ్రైనేజీ నిర్మాణానికి అడ్డంకిగా అక్రమ నిర్మాణం జరిగినందున మసీదులోని కొంతభాగాన్ని కూల్చేసినట్టు అధికారులు తెలిపారు. రెండుసార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ మసీదు కమిటీ నుంచి స్పందన లేదని, మసీదు విస్తరణ పేరుతో గత మూడేళ్లగా ఈ అక్రమ కట్టడాలను నిర్మించారని జిల్లా అధికారి ఒకరు తెలిపారు. జామా మసీదులోని ఆక్రమిత నిర్మాణాల కూల్చివేత సందర్భంగా పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. అదనపు జిల్లా మెజిస్ట్రేట్ అవినాష్ త్రిపాఠి, ఎస్ఎస్‌పీ విజయశంకర్ మిస్రా సహా పలువురు సీనియర్ అధికారుల సమక్షంలో కూల్చివేతలు చేపట్టారు. ముందస్తు చర్యగా భారీగా పోలీసు బలగాలను మోహరించారు. కాగా, పీడబ్ల్యూడీ శాఖ సర్వే జరిపి, అక్రమ నిర్మాణాలు చేపట్టిన యజమానులందరికీ నోటీసులు ఇచ్చిందని, ఆక్రమణలకు సంబంధించి సెప్టెంబర్ 24న మసీదు కమిటీకి కూడా నోటీసులు జారీ అయ్యాయని పోలీసులు తెలిపారు. మసీదు కమిటీతో సహా 133 భవనాలు, రోడ్డుపై నున్న దుకాణాలకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. మసీదు కమిటీ నెలరోజులు గడువు అడిగిందని, అది కూడా ముగియడంతో అధికారులు ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారని చెప్పారు. జిల్లాలో శాంతి భద్రతల పరిస్థితి అదుపులో ఉన్నట్టు తెలిపారు.

**మసీదు కమిటీ అభ్యంతరం**

కాగా, మసీదులోని కొంత భాగాన్ని కూల్చివేయడం ద్వారా అలహాబాద్ హైకోర్టు ఆదేశాలను పోలీసులు ఉల్లంఘించారని నూర్ జామా మసీదు కమిటీ పేర్కొంది. మసీదు కమిటీ హైకోర్టులో రిట్ పిటిషన్ వేసిందని, డిసెంబర్ 13న పిటిషన్ విచారణకు రానుందని చెప్పారు. అయితే దీనికి ముందే ప్రార్థనా మందిరంలోని కొంత భాగం కూల్చివేయడం కోర్టు ఆదేశాల ఉల్లంఘన కిందకే వస్తుందని మసీదు కమిటీ సెక్రటరీ సైయద్ నూరి తెలిపారు.

## కంటెయినర్‌ను ఢీకొట్టిన పికప్ వ్యాన్.. ఏడుగురు దుర్మరణం



యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హత్రాస్ జిల్లా లో ఓ కుటుంబం వెళ్తున్న పికప్ వ్యాన్‌ను భారీ కంటెయినర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ కుటుంబానికి చెందిన ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. వారిలో ముగ్గురు మహిళలు, ముగ్గురు పురుషులు, ఒక చిన్నారి ఉన్నారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే స్థానిక పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించారు. కాగా ఘటనపై యూపీ సీఎం యోగీ ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు.

## ఉత్తరాదిపై చలి పంజా..



దేశంలోని ఉత్తరాది రాష్ట్రాలపై చలి పంజా విసురుతున్నది. ఢిల్లీ సహా పలు ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు చలికి గజగజ వణుకుతున్నారు. దేశ రాజధాని ఢిల్లీతోపాటు జమ్మూ కశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, హర్యాణా, యూపీలో చలి తీవ్రత పెరిగింది. పలుచోట్ల దట్టమైన పొగమంచు కమ్మేసింది. మంగళవారం ఉదయం ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రతలు 8.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. జమ్మూ కశ్మీర్‌లో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. గరిష్టంగా 10 డిగ్రీల సెల్సియస్, కనిష్టంగా మైనస్ 2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. ఇక ఉత్తరప్రదేశ్‌లో కనిష్ట ఉష్ణోగ్రతలు 8 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. దీంతో ప్రజలు చలి తీవ్రతకు గజగజ వణికిపోతున్నారు. చలి మంటలతో ఉపశమనం పొందుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో 19.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. అహ్మదాబాద్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు 18 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.

## ఎస్ఎం కృష్ణ మృతిపట్ల మూడు రోజులపాటు సంతాప దినాలు ప్రకటించిన కర్ణాటక ప్రభుత్వం



కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మాజీ మంత్రి ఎస్ఎం కృష్ణ కన్నుమూశారు. గతకొంత కాలంగా వృద్ధాప్యం రీత్యా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. మంగళవారం తెల్లవారుజామున బెంగళూరు సదాశివనగర్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఈ నేపథ్యంలో ఆయన మృతి పట్ల కర్ణాటక ప్రభుత్వం రాష్ట్రంలో మూడు రోజుల పాటు సంతాప దినాలుగా ప్రకటించింది డిసెంబర్ 10 నుంచి డిసెంబర్ 12 వరకూ ఎలాంటి కార్యక్రమాలు, వేడుకలు నిర్వహించడం లేదని తెలిపింది. ఆయన అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించనున్నట్లు వెల్లడించింది. దీంతో ప్రస్తుతం బెళగావిలో నిర్వహిస్తున్న శీతాకాల అసెంబ్లీ సమావేశాలను గురువారానికి వాయిదా వేశారు. మరోవైపు ఎస్ఎం కృష్ణ భౌతికకాయానికి పలువురు ప్రముఖులు నివాళులర్పిస్తున్నారు. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగానికి గురయ్యారు.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : **SIRIKONDA AUGUSTIN . RNI No.: APTEL/2013/52694.** E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.